




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








హైదరాబాద్ | 17-01-2026 శనివారం | సంపుటి : 26 | సంచిక : 307 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on




## మీకు వీలుకాకపోతే చెప్పండి

# మేమే నిర్ణయిస్తాం

2

- ఫిరాయింపు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకీ ఉదాసీనత?
- సమయం ఇచ్చినా ఎందుకు నిర్ణయం తీసుకోవడంలేదు
- మీ వల్ల కాకపోతే చెప్పండి, మేమే చర్య తీసుకుంటాం
- ఆ ఎమ్మెల్యేలపై రెండు వారాల్లోగా చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీం కోర్టు అసహనం



# మళ్లీ మేమే వస్తాం

## రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లోనూ మాదే గెలుపు : సీఎం రేవంత్‌రెడ్డి

- తుమ్మిడిహట్టి నిర్మించుకుందాం
- జల్ జంగిల్ జమీన్ పోరాట వేదిక ఈ జిల్లా
- పాలమూరుతో సమానంగా నిధులిస్తాం
- ఎర్ర బస్సు తిరగని చోటికి ఎయిర్ బస్సు తెస్తాం
- ఎన్నికలప్పుడే రాజకీయాలు : సీఎం

**వుదయం, ఆదిలాబాద్ :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలకు విస్తృత సేవలు అందించిన సీ .రాంచంద్రారెడ్డి పేరును చనాటా – కొరిటా బ్యారేజీకి, నర్సారెడ్డి పేరును సధర్మత్ బ్యారేజీకి పెడతామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో గెలుస్తామని, మళ్ళీ అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్మల్ "ప్రజా పాలన– ప్రగతి బాట" బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానమని తెలిపారు. జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఆదిలాబాద్ అని పేర్కొన్నారు.ఆ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదనీ చెప్పారు.అందుకే పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇస్తామని అన్నారు.జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా అభివృద్ధి పథంలో సాగేదనీ చెప్పారు.కానీ కారణాలు ఏవైనా ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు.అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేస్తున్నామని వివరించారు.ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు అయినా ఎవరికి వారు తమ ప్రాంతానికే రావాలనుకోవడంతో



యూనివర్సిటీ ఏర్పాటు జాప్యమైందని తెలిపారు. బాసర ఐ.ఐ. టీ.లో యూనివర్సిటీకి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఇందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి సూచించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షలు నిర్వహించాలని సుదర్శన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఒక నివేదిక తయారు చేసి ఇవ్వండి... ఆదిలాబాద్ కు కావాల్సిన అభివృద్ధి, రావాల్సిన నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఆదిలాబాద్ రైతాంగానికి నీళ్లు ఇవ్వాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాల్సిందేననీ సీఎం ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.బడ్జెట్ సమావేశాల లోపు తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించుకుందాం.. ప్రతీ చుక్కను ఒడిసిపట్టుకుని ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసుకుందామని పేర్కొన్నారు. ఎర్రబస్సు తిరగని ఆదిలాబాద్ లో ఎయిర్ బస్ తిరిగేలా ఎయిర్ పోర్టును ఏర్పాటు చేసుకుందామని వ్యాఖ్యానించారు.కేవలం ఎయిర్ పోర్టు ఒక్కటే ఏర్పాటు చేసుకుంటే సరిపోదని, ఆదిలాబాద్ లో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసుకుందామని తెలిపారు.పదివేల ఎకరాలు సేకరించి ఈ ప్రాంతాన్ని..

మిగతా 2లో..



## ఈ నోబెల్ మీకే

# అంకితం

### తనకు వచ్చిన శాంతి పతకాన్ని ట్రంప్‌కి ఇచ్చేసిన మచాడో

**వాషింగ్టన్ :** స్వాతంత్ర్యం కోసం వెనెజువెలా చేస్తున్న పోరాటానికి తోడ్పడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి (2025) గ్రహీత మరియా కొరినా మచాడో తన మెడల్‌ను కానుకగా అందించారు. అందుకు కృతజ్ఞతలు చెపుతూ, వెనెజులా ప్రతిపక్ష నాయకురాలు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న ఒక అద్భుత మహిళ అంటూ ట్రంప్ అభివర్ణించారు. ఆయన నుంచి లబ్ధి పొందేందుకే ఈ కానుకను ట్రంప్‌కు మచాడో ఇచ్చిందని పలువురు వ్యాఖ్యాతలు అంటున్నారు. కాగా, డెల్సీ రోడ్రిగెజ్ నేతృత్వంలో వెనెజులా తాత్కాలిక ప్రభుత్వానికి ప్రస్తుతానికి తన తోడ్పాటును ప్రకటించారు.ట్రంప్ ఆ పతకాన్ని స్వీకరించినట్టు వైట్ హౌజ్ అధికారి ఒకరు ఎబిసి న్యూస్ ఛానెల్‌కు చెప్పినట్టు ఆ ఛానెల్ పేర్కొంది. నోబెల్ శాంతి బహుమతి, మచాడోతోనే ఉంటుంది. ఎందుకంటే, నోబెల్ ఫౌండేషన్ నిబంధనల కింద దానిని ట్రంప్‌కు ప్రదానం చేయడం కుదరదు అని అన్నారు.

నార్వేజియన్ నోబెల్ ఇనిస్టిట్యూట్, నోబెల్ కమిటీ ప్రకారం, ఒకసారి నోబెల్ శాంతి బహుమతిని ప్రదానం చేసిన తర్వాత, దానిని బదిలీ చేయలేరు, పంచుకోలేరు లేదా మరొకరికి ఇవ్వలేరు. ఇది ఆల్ఫ్రెడ్..

మిగతా 2లో..

## మమత బెనర్జీ అడుగు జాడల్లో

# రాంచీలో ఈడీపై పోలీసుల దాడి



**రాంచీ :** దర్యాప్తు ఏజెన్సీల మీదే దాడి జరిగితే? బొమ్మ తిరగబడినట్టే కదా? అందరి మీదా దాడులు చేసే ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ (ఈడీ) రాంచీ కార్యాలయంపై జార్ఖండ్ పోలీసులు గురువారం దాడి చేయడంతో వారు అవాక్కయ్యారు. ఒక ఆరోపిత దాడికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా పోలీసులు ఈడీ కార్యాలయం నుండి సీసీటీవీ ఫుటేజీని సేకరించారని పీటీఐ వార్తా సంస్థ నివేదించింది.దీనితో ఈ దాడికి వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థ ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించగా, జార్ఖండ్ ప్రభుత్వ ఉద్యోగి ఒకరు దాఖలు చేసిన కేసులో ఈడీపై దర్యాప్తుకు వ్తిరకేంగా కోర్టు స్టే ఇచ్చింది.

ఆరోపిత నీటి సరఫరా కుంభకోణంలో విచారణ సమయంలో ఈడీ అధికారులు తనను చితకబాదారని ఆరోపిస్తూ, జనవరి 12న మంచినీరు, పారిశుద్ధ్యశాఖ మాజీ ఉద్యోగి సంతోష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఉదయమే పోలీసు సిబ్బంది ఈడీ కార్యాలయానికి వెళ్లారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం,..

మిగతా 2లో...

# పల్లెకు ముల్లె

## కేంద్రం నుంచి రూ.2500 కోట్లు

## గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

సమస్యలతో సతమతమవుతోన్న పల్లెలకు మహర్దశ రానుంది. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్లాడుతోన్న గ్రామాలకు భారీగా నిధులు విడుదల కానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం తన వంతుగా రూ. 277 కోట్లు కేటాయించగా.. కేంద్రం సైతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో రాష్ట్రంలోని పల్లెలు కొత్త వెలుగులు సంతరించుకోనున్నాయి. సుమారు మూడేళ్ల నుంచి అభివృద్ధి నిధుల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న పాలకవర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల తీపికబురు చెప్పాయి. తాజాగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ముగిసి.. కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో నిధుల విడుదలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రావాల్సిన రూ. 2,500 కోట్ల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఈ నెలాఖరులోపు రూ. వెయ్యి కోట్లు, వచ్చే నెలలో మరో రూ. 1,500 కోట్లు విడుదల చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం సైతం మూడు రోజుల క్రితమే సంక్రాంతి కానుకగా తన వంతుగా రూ. 277 కోట్లు విడుదల చేసింది. కాగా రాష్ట్రంలో 2024 జనవరిలో పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికలు జరగకపోవడంతో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రావాల్సిన నిధులను కేంద్రం నిలిపివేసింది. గత నెలలో ప్రభుత్వం విజయవంతంగా ఎన్నికలు నిర్వహించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి నివేదిక సమర్పించగా.. సానుకూలంగా స్పందించిన కేంద్రం నిధులను మంజూరు చేసింది. ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవడానికి కేంద్రం కఠినమైన విధివిధానాలను నిర్దేశించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ...

మిగతా 2లో..



## అదనపు విచారణ

# అనవసరం

### ట్యాపింగ్ కేసులో సుప్రీం

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీస్ కస్టడీలో ఉన్న ప్రభాకర్ రావు ను ఇంకెంత కాలం విచారిస్తారని రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. ఇప్పటికే ఆయన్ను రెండు వారాలకు కస్టడీకి అనుమతించామని, ఇంకా అదనపు విచారణ అవసరంలేదని వ్యాఖ్యానించింది. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదించారు. దీంతో ముందస్తు బెయిల్ ఇచ్చినంత మాత్రాన ఆయన్ని పిలవకుండా ఉండలేరు కదా..?

మిగతా 2లో..

## ఇరాన్‌పై శాంతించిన

# అమెరికా

### దాడి ఆలోచనకు ట్రంప్ స్వస్తి?

**వాషింగ్టన్ :** ప్రస్తుతానికి ఇరాన్‌పై దాడి చేయడాన్ని వాయిదా వేస్తున్నట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించడంతో ప్రపంచం, ముఖ్యంగా పశ్చిమాసియాలోని దేశాలూ ఊపిరి పీల్చుకుంటున్నాయి. తెహ్రాన్‌లోని ప్రభుత్వం నిరసనల్లో పాల్గొన్న వారిని చంపడం నిలిపివేస్తుందని "అవతలి వైపు" ఉన్న వర్గాల నుంచి తనకు హామీ లభించిందంటూ, ట్రంప్ పేర్కొన్నారు.ఇరాన్‌లో చంపడాలు నిలిచిపోయాయని, తనకు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా ఈ సమాచారం అందిందని, ఆయన అన్నారు. అయితే సైనిక చర్య లేదా అని విలేకరులు వేసిన ప్రశ్నకు, ప్రక్రియ ఏమిటో చూడండని సమాధానమిచ్చారు. అక్కడ జరుగుతున్న విషయాల గురించి సన్నిహితంగా తెలిసిన వారి నుంచే తమకు సమాచారం వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ముందు ఉద్యమకారులను ఇరాన్ అగ్ర నాయకుడికి వ్యతిరేకంగా ఉద్యమించమని, సాయం మార్గంలో ఉందని సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టిన ట్రంప్, తర్వాత ఈ రకంగా స్వరం మార్చడంతో పశ్చిమాసియాలోని దేశాలు ఊరట పొందాయి. మా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే, మీ స్థావరాలపై దాడి చేస్తామంటూ ఇరానియన్లు ప్రకటిస్తున్న క్రమంలో బుధవారం నాడు అమెరికా కొందరు సిబ్బందిని ఖతార్‌లోనూ, ఆ ప్రాంతంలోని ఇతర అమెరికన్ స్థావరాలలోనూ మోహరించారు.



వాస్తవానికి, ఆ పరిణామాలు జూన్‌లో ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులకు ముందు తీసుకున్న చర్యలకు సమాంతరంగా ఉండడంతో, ఇది మరో విడత దాడులు త్వరలోనే జరగవచ్చనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది. వెనిజువెలాపై అమెరికా దాడి ఫలితంగా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన నేపథ్యంలో, ఆ బెదిరింపులు మరింత విశ్వసనీయంగా కనిపించాయి. కాగా, ఇరాన్‌పై అమెరికా సైనిక దాడులను ప్రారంభిస్తే, వారు ఇజ్రాయెల్‌పై దాడి చేసే అవకాశముందని, కనుక అందుకు పాల్పడవద్దని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతెన్యాహూ ట్రంప్ ను కోరినట్టు వార్తలు వచ్చాయి. న్యూయార్క్ టైమ్స్ ప్రకారం, ఇరాన్‌పై సైనిక చర్యల గురించి చర్చించడానికి వైట్ హౌస్ అధికారులు సమావేశమైన రోజునే ...

మిగతా 2లో..



## అభిశంసనకు

# లైన్ క్లియర్

### జస్టిస్ వర్మ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** ఇంట్లో నగదు కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన ప్రక్రియకు మార్గం సుగమం అయింది. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పార్లమెంటరీ ప్యానెల్ చేస్తున్న దర్యాప్తు చట్టబద్ధతను సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారంనాడు సర్వోన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై జనవరి 8న తమ నిర్ణయాన్ని రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, ఎస్‌సి శర్మలతో కూడిన ధర్మాసనం శుక్రవారం తమ తీర్పును ప్రకటించింది.న్యాయమూర్తుల (దర్యాప్తు) చట్టం, 1968 కింద సంయుక్త కమిటీ అవసరమని, ఎగువ సభలో తొలగింపు మోషన్‌ను తిరస్కరించే అధికారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌కు లేదంటూ చేసిన జస్టిస్ వర్మ వాదనలను ధర్మాసనం స్పష్టంగా తిరస్కరించింది.

ప్రస్తుత కేసులో పిటిషనర్‌కు ఎలాంటి ఊ–రటను పొందే హక్కులేదని తాము భావిస్తున్నామంటూ, తన తీర్పును ప్రకటిస్తున్న సమయంలో జస్టిస్ దత్తా అభిప్రాయపడ్డారు. తదుపరి విచారణకు వ్యతిరేకంగా ఆయన చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించడం,

మిగతా 2లో...



# హాట్ ఎయిర్ బెలూన్‌లో విహారం

## లాంఛనంగా ప్రారంభించి మంత్రి జూపల్లి

**వుదయం, హైదరాబాద్ :**

చారిత్రక గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు.

మిగతా 2లో..

# మెట్రో -1ను తీసుకోండి

- జాయింట్ కమిటీ కోసం అధికారుల పేర్లు పంపండి
- మొదటి దశ లావాదేవీలు పూర్తయితే రెండో దశ నిర్మాణంపై చర్యలు
- సీఎం రేవంత్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

ఎల్ అండ్ టీ నుండి మెట్రో మొదటి దశ నెట్ వర్క్ ను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తర్వాత కేంద్ర ప్రభుత్వానికి రెండో దశ నిర్మాణ ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న మెట్రో రెండో దశ పనులకు సంబంధించి కిషన్ రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రెండో దశ నిర్మాణం గురించి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో చర్చించినట్టు తెలిపారు. మెట్రో మొదటి దశ లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించినట్టుగా ముందుగా మొదటి దశను టేకోవర్ చేసుకోవాలని చెప్పినట్టు తెలిపారు. మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున కమిటీ వేయాలని మనోహర్ లాల్ ఖట్టర్ ఇప్పటికే చెప్పారు. ఆ కమిటీ కోసం రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని సూచించారు.



## ఎన్పీడీసీఎల్‌కు

# 'ఇన్నోవేషన్ అవార్డు'

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**




నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ మరో అంతర్జాతీయ స్థాయి గుర్తింపును దక్కించుకుంది. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించిన 'ఇప్పాయి పవర్ అవార్డ్స 2026'లో ఎన్పీడీసీఎల్ 'ఇన్నోవేషన్ అవార్డు'ను కైవసం చేసుకుంది. ఈనెల 10వ తేదీన కర్ణాటకలోని బెల్గాంలో జరిగిన 26వ 'రెగ్యులేటర్స్ అండ్ పాలసీమేకర్స్ రిట్రీట్' కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఈ (ప్రాజెక్ట్స్) సురేందర్ ఈ అవార్డును అందుకున్నారు. శుక్రవారం హన్మకొండ, నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి సీఈ (ప్రాజెక్ట్స్) సురేందర్ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్‌లో ప్రవేశపెట్టిన వినూత్న సాంకేతిక పద్ధతుల వల్లే ఈ అవార్డు దక్కిందని తెలిపారు.

ఏ ఐ రిస్క్ ప్రిడిక్షన్ మోడల్ : కృత్రిమ మేధస్సు ద్వారా విద్యుత్ సరఫరాలో తలెత్తే ముప్పులను ముందుగానే పసిగట్టడం.

మిగతా 2లో..

# 'పల్లె'కు ముల్లె




**మొదటి పేజీ తరువాత..**

అన్ని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించి, దానిని పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈగ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. నిధుల చెల్లింపుల కోసం సర్పంచి (చెకర్), ఉప సర్పంచి (మేకర్) కచ్చితంగా క్లాస్3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు పొందాలి. వీటిని ఎంపీడీవోల ద్వారా ఆమోదించాల్సి ఉంటుంది. పనులన్నీ ఈప్రొక్యూర్‌మెంట్ లేదా టెండర్ విధానాల ద్వారానే నిర్వహించాలని, అవసరమైన రిజిస్ట్రేషన్లను జీఈఎం పోర్టల్‌లో పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది.

**'పుర'లకు రూ. 10 కోట్లు**

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల క్రితమే ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్ సీ) ద్వారా రూ. 10 కోట్ల నిధులు విడుదల చేసింది. వీటితో రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేస్తున్నట్లు ప్రకటించింది. మంజూరైన ఈ నిధులను మున్సిపాలిటీల్లోని అంతర్గత రోడ్ల మరమ్మతులు, మురుగునీటి కాలువల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న అత్యవసర పనుల కోసం వినియోగించనున్నారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగంగా ఈ నిధులను నేరుగా మున్సిపాలిటీలకు మళ్లించారు. తాజా కేటాయింపులతో పట్టణాల్లో ఆగిపోయిన పనులకు ఊపిరి పోసింది. మున్సిపాలిటీలకు విడుదల చేసిన ఈ నిధులను ప్రధానంగా ప్రజల రోజువారీ అవసరాలను తీర్చే మౌలిక సదుపాయాల కోసం వినియోగించనున్నారు. నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులు, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయడం.. పట్టణాల్లో మురుగునీటి కాలువల శుభ్రత, దోమల నివారణ చర్యల కోసం అత్యవసర నిధుల కేటాయింపు.. రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం పని చేయని వీధి దీపాలను బాగు చేయడం, కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు చేయడం.. వర్షాకాలం లేదా ఇతర కారణాలతో దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్ వంటి అత్యవసర మరమ్మతులు చేయడం అనేవి వీటిలో భాగంగా ఉన్నాయి. పట్టణాల అభివృద్ధి విషయంలో రాష్ట్ర సర్కార్ వికేంద్రీకరణ పద్ధతిని అనుసరిస్తోంది. స్థానిక సంస్థలు ఆర్థికంగా స్వయంప్రతిపత్తి సాధించినప్పుడే క్షేత్రస్థాయిలో సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని భావిస్తోంది. గతంలో నిధుల విడుదల ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని నివారించేందుకు... రాష్ట్ర వాటా నిధులను నేరుగా మున్సిపాలిటీల ఖాతాల్లోకే మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. కేవలం నిధులు ఇవ్వడమే కాకుండా.. పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా మున్సిపాలిటీల సరిహద్దుల్లో అనుమతి లేని నిర్మాణాలను అరికట్టడం, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. మంజూరైన ప్రతి రూపాయికి లెక్క ఉండేలా.. పనుల నాణ్యతలో రాజీ పడకుండా ఉండేలా మున్సిపల్ కమీషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

# అభిశంసనకు లైన్ క్లియర్

**మొదటి పేజీ తరువాత..**

ఇప్పుడు జస్టిస్ వర్మ పానెల్ ఎదుట హాజరవడమే కాదు, ఆయన అభిశంసన ప్రక్రియ కొనసాగనుంది. న్యూఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో మార్చి 14వ తేదీన కాలిపోయిన కరెన్సీ కట్టలు బయటపడడంతో జస్టిస్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు.నాటి ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణకు శ్రీకారం చుట్టి, పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీఎస్ సంధావాలియా, కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ, జస్టిస్ వర్మ దుష్ప్రవర్తనను నిర్ధారిస్తూ తన నివేదికను మే 4వ తేదీన సమర్పించింది.కాగా, అప్పుడు కూడా రాజీనామా చేసేందుకు జస్టిస్ వర్మ తిరస్కరించారు. అప్పుడు ప్రధాన న్యాయమూర్తి ఈ నివేదికను, న్యాయమూర్తి స్పందనను రాష్ట్రపతి, ప్రధానికి పంపారు, ఇది అభిశంసన ప్రక్రియలకు వేదికను సిద్ధం చేసింది. తదనంతరం, ఆగస్టు 12న జస్టిస్ వర్మ తొలగింపు కోసం బహుళ పార్టీల తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ బిర్లా ఆమోదించి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్యలతో కూడిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# మళ్లీ మేమే

**మొదటి పేజీ తరువాత..**

పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకుందామన్నారు.

ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసాక అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళదామని సూచించారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు.. ప్రజలకు మంచి జరగాలన్నదే మా ఆలోచనని తెలిపారు. ప్రజల కోసం.. ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలవడానికి వెనకాడబోనని చెప్పారు. తాను పైరవీల కోసం ఎవరి దగ్గరకు వెళ్లను.. నాకు పర్సనల్ ఎజెండాలు లేవని సీఎం చెప్పారు. ఆనాటి పాలకులు చేసిన అప్పులు.. ఉరితాడుగా మారి ప్రజల ఊపిరి తీసే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తా.. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను మంజూరు చేయించుకుందాం.

ఇందుకు బీజేపీ ప్రజా ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలి. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ఎజెండా.ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నాం. పేదలకు సన్న బియ్యం అందిస్తున్నాం.. సన్నాలకు బోనస్ అందిస్తున్నాం.రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం.. ఆర్టీసీ బస్సులకు ఆడబిడ్డలని యజమానులను చేశాం. మహిళా స్వయంసహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నాం.. ప్రజలకు మంచి జరుగుతుంటే పదేండ్లు అధికారం అనుభవించినవాళ్లు చూసి ఓర్వలేకపోతున్నారు. నాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు మంచి చేయడానికే కేటాయిస్తా...రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు మంచి చేసేవారిని, అభివృద్ధి చేసే వారినే గెలిపించుకోండి.గత ఎన్నికల్లో గెలిచాం.. రాబోయే ఎన్నికల్లో గెలుస్తాం..రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

# ఈ నోబెల్ మీకే అంకితం

**మొదటి పేజీ తరువాత..**

నోబెల్ వీలునామా కింద ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నియమ నిబంధనలలో ఇది ప్రాథమిక సూత్రం. కాగా, ఆ భౌతిక మెడల్‌ను లేదా నగదు బహుమతిని దాని గ్రహీతలు ఏమైనా చేసుకోవచ్చు, అధికారిక శీర్షిక, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత గౌరవం మాత్రం వారితోనే ఉంటాయి, వాటిని మరొక వ్యక్తికి బదిలీ చేయడానికి వీలు లేదు. అంటే, 2025 నోబెల్ శాంతి బహుమతి అధికారిక విజేతగా మచాడోనే ఉంటారు. తనకు మచాడో ఇచ్చిన మెడల్‌ను ట్రంప్ పట్టుకోవచ్చు, ప్రదర్శించవచ్చు, కానీ ఆయన మాత్రం నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కాలేరు.



నోబెల్ శాంతి బహుమతి మెడల్ 6.6 సెం.మీ వెడల్పుతో, 196గ్రా.ల బరువున్న బంగారు గుండ్రటి పతకం. దానిపై ముందువైపు ఆల్ఫ్రెడ్ నోబెల్ బొమ్మ, వెనుక సౌభ్రాతృత్వానికి సంకేతంగా ఒకరి భుజాలను మరొకరు పట్టుకున్న ముగ్గురు నగ్న పురుషుల బొమ్మ ఉంటుంది. ఈ నమూనా 120 ఏళ్లకు పైగా మారలేదు.

ప్రదానం చేసిన అనంతరం కొన్ని పతకాలు చేతులు మారాయి. ఉక్రెనియన్ శరణార్థులకు తోడ్పడేందుకు 2021లో నోబెల్ శాంతి బహుమతి పొందిన దిమిత్రీ మ్యురెటావ్ పతకాన్ని 100 మిలియన్ అమెరికన్ డాలర్లకు వేలం వేశారు. నోబెల్ పీస్ సెంటర్‌లో ప్రదర్శించే పతకం, అరువుగా తీసుకున్నది కాగా, వాస్తవానికి నార్వే తొలి శాంతి బహుమతి గ్రహీత క్రిస్టియన్ లౌజ్ లాంగేది.

నోబెల్ శాంతి బహుమతిని రద్దు చేయలేరు. అటు ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా కానీ లేదా నోబెల్ ఫౌండేషన్ నిబంధనలు కానీ దీనిని అనుమతించవు. ఒక్కసారి గ్రహీతను ప్రకటిస్తే, ఆ నిర్ణయమే అంతిమం, శాశ్వతం. నార్వేజియన్ నోబెల్ కమిటీ అవార్డు ప్రదానం జరిగేంత వరకు మాత్రమే అభ్యర్థులను మూల్యాంకనం చేస్తుంది, బహుమతి గ్రహీతల తర్వాతి చర్యలను విశ్లేషించదు.

వెనెజులాలో ప్రజాస్వామిక హక్కులను ప్రోత్సహించి, దేశాన్ని నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యం దిశగా నడిపేందుకు యత్నిస్తున్నందుకు మచాడో గత ఏడాది నోబెల్ శాంతి బహుమతిని పొందరు. గత అక్టోబర్‌లో అవార్డును ప్రకటించినప్పుడు, మచాడో దానిని వెనెజులా ప్రజలకు, తమ దేశంలో ప్రజాస్వామిక ఉద్యమానికి తోడ్పడాటునందిస్తున్నాడని కొనియాడుతూ ట్రంప్‌కు అంకితం చేసింది. గత వారం, తాను తన నోబెల్ శాంతి బహుమతిని, ఒక దాడి ద్వారా వెనెజులా నాయకుడు నికొలస్ మదురోను పదవి నుంచి తొలగించిన ట్రంప్‌కు ఇవ్వడమో లేక పంచుకోవడమో చేస్తానని ఆమె పేర్కొంది. కాగా, చైనా, రష్యా, స్పెయిన్ వంటి అంతర్జాతీయ శక్తులు యుఎస్ ఆపరేషన్‌ను అపహరణగా అభివర్ణించాయి.తనను కిడ్నాప్ చేశారని మదురో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన న్యూయార్క్ లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్నారన్న అభియోగాలతో న్యాయవిచారణను ఎదుర్కొంటున్నారు. కాగా, తాను నిర్దోషినని మదురో వాదించాడు.

# అదనపు విచారణ అనవసరం

**మొదటి పేజీ తరువాత..**

మీ ఉద్దేశం పూర్తయిందా లేదా? అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. విచారణను పూర్తి చేయకుండా ప్రభాకర్‌రావును మళ్లీ జైల్లో పెట్టాలనుకుంటున్నారా..? అని జస్టిస్ నాగరత్న రాష్ట్ర ప్రభుత్వ తరుపు న్యాయవాది లూథ్రా ను ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తులో న్యాయపరమైన అంశాలు ముడిపడి ఉన్నాయని, ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను మార్చి 10వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. అవసరమైతే మళ్లీ పిలిచి విచారణ చేయవచ్చని, ప్రభాకర్‌రావు దర్యాప్తుకు సహకరిస్తారని కోర్టు వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తు దృష్టిలో ఉంచుకొని ఆర్టికల్ 142 కింద మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మాసనం వెల్లడించింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దర్యాప్తు వేగం, కస్టడీ అవసరం, ముందస్తు బెయిల్ అంశాలపై కోర్టు స్పష్టత ఇవ్వడాన్ని న్యాయనిపుణులు ఈ కేసులో కీలక మలుపుగా భావిస్తున్నారు.

# శాంతించిన ట్రంప్

**మొదటి పేజీ తరువాత..**

నెతన్యాహు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో మాట్లాడారు. ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్,ఈజిప్ట్ సహా ఇతర గల్ఫ్ దేశాలు కూడా, ఇది ప్రాంతీయ సంఘర్షణకు దారితీయవచ్చనే భయంతో ఇరాన్‌పై దాడి చేయవద్దని వైట్ హౌస్‌ను అభ్యర్థించాయి. గల్ఫ్ దేశాల సీనియర్ అధికారులు గత రెండు రోజులుగా ఈ సందేశంతో ట్రంప్ అధికారులపై లాబీయింగ్ చేస్తున్నారు. అమెరికా దాడికి ప్రతిస్పందనగా ఇరాన్ తమ దేశాలపై దాడి చేస్తుందని ఇజ్రాయెల్, అరబ్ అధికారులు ఇద్దరూ భయపడ్డారు. కాగా, అరబ్ దేశాలు కేవలం వాషింగ్టన్‌తోనే కాక టెహ్రాన్‌లోని ప్రభుత్వ ఉన్నత అధికారులతో సందేశాలను సమన్వయం చేయడంలో అరబ్ దేశాలు నిమగ్నమై ఉన్నాయని వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

# చర్చలతోనే సమస్యల పరిష్కారం




**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వానికి, భారత ఆర్మీకి మధ్యన వివిధ సమస్యలు నిరంతర చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వివిధ అంశాలకు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆర్మీ తరఫున ప్రత్యేకంగా అధికారులను నియమించాలని కోరారు. గురువారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం అధ్యక్షతన "సివిల్ మిలిటరీ లైజన్ కాన్ఫరెన్స్" జరిగింది. ఇందులో భారత సైన్యం, తెలంగాణ ప్రభుత్వం మధ్య పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, ఇతర పరిపాలనా సమస్యల సత్వర పరిష్కారంపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున పలు విజ్ఞప్తులను సీఎం రేవంత్ రెడ్డి ఆర్మీ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. సదరన్ కమాండ్ సెంటర్ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌కు మార్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రంలో 2 నుంచి 4 సైనిక్ స్కూళ్లను మంజూరు చేశారన్న సీఎం.. గడిచిన పదేళ్లలో తెలంగాణలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో తక్షణం సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. దేశ భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లో కేంద్రానికి, భారత సైన్యానికి సహకరించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వికారాబాద్ దామగుండం వద్ద లోఫ్రీక్వెన్సీ వీఎల్ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్‌కు 3 వేల ఎకరాలు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా , తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

## సంయుక్త కిసాన్ మోర్చా నిరసన కార్యక్రమం లో ఎస్ కే యం,టియు నాయకుల పిలుపు




**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఈరోజు (జనవరి 16న) నారాయణగూడ ఫ్లైఓవర్ దగ్గర జరిగిన నిరసన కార్యక్రమం లో సంయుక్త కిసాన్ మార్చా (ఎస్ కే యం), కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్,పశ్య పద్మ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,ఆర్ వెంకట్రాములు, జక్కుల వెంకటయ్య, తుకారాం నాయక్,విజయ్ లు మాట్లాడుతూ... 4 లేబర్ కోడ్ లు, విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టం, విబి జి రామ్ జి బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు పిలుపునిచ్చారు.విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని నల్ల జెండాలు ,నల్ల బ్యాడ్జీలతో జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.

గత 11 సంIIరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలారాయడమే కాక, రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసింది. ఒక వైపున ప్రజాసంక్షేమం వల్లిస్తూనే. మరో వైపున కార్పొరేట్లకు లక్షల కోట్లు దోచిపెడుతున్నది. మోడీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు రూ. 18 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చింది. చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నది. అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్లను అమలు చేసి కార్మికుల హక్కులను కాలరాసింది.

29 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మార్చింది. కార్మికులు ట్రేడ్ యూనియన్లు పెట్టుకోవడానికి ఆంక్షలు పెట్టడం, వృత్తి రక్షణ, ఆరోగ్యం, పని పద్ధతులు, కార్మికుల హక్కులు లేకుండా చస్తున్నది. పై 4 కోడ్ ల వలన గతంలో 100 మంది కార్మికులు పని చేసే రంగాన్ని ట్రేడ్ యూనియన్ చట్టాల కింద గుర్తించగా, మార్చిన విధానాల వల్ల ఆ సంఖ్యను 300లకు పెంచారు. 300 లోపు కార్మికులు పని చేసే కంపెనీ పై ప్రభుత్వానికి ఎలాంటి బాధ్యతక ఉండదు. జాతీయ విత్తన బిల్లు ద్వారా బిల్లు ద్వారా తెనాలి ఖండించే రైతాంగానికి విత్తనాలు పండించే రైతాంగానికి ఏ రకమైన ప్రయోజనం లేదు విత్తనాల రేట్లు గాని నష్టపోయిన సందర్భంగా పరిహారంగానే నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేకుండా కేంద్రమే తన ఇష్టానుసారంగా బడా కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**"వికసిత్ భారత్-జి రామ్ జీ" చట్టాన్ని రద్దు చేయాలి**

వామపక్షాల పోరాట ఫలితంగా "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టం 2005 రూపొందింది. రాష్ట్రాల వాటాని పెంచి కేంద్రం తన బాధ్యత నుంచి తప్పుకొని మహాత్మా గాంధీ పేరునే తొలగించడం దుర్మార్గమని అన్నారు.

విద్యుత్ ఉత్పత్తి రాజ్యాంగం రీత్యా రాష్ట్ర జాబితాలోనిది. ఇంత కాలం రాష్ట్రాల పోరాటం వల్ల కేంద్రం చట్టం చేయలేదు. గత పార్లమెంట్ సమావేశాల్లో " 2025 విద్యుత్ సవరణ చట్టం" ఆమోదించడం జరిగింది. ఈ చట్ట ప్రకారం ఇక నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలు కేంద్రం చూస్తుంది. విద్యుత్ చార్జీలు కేంద్రమే" విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్" ద్వారా నిర్ణయిస్తుంది. స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ ముందుగానే వసూలు చేస్తారు. ఉచిత విద్యుత్ రద్దు చేస్తారు. క్రాస్ సబ్సిటీ రద్దు చేయడం వల్ల వినియోగదారులందరు. ఉత్పత్తి ఖర్చు చెల్లించాలి. పార్లమెంట్ ఆమోదించిన విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి.

ప్రభుత్వ రంగ సంస్థల లోకి 100శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. ముఖ్యంగా ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించింది. ఈ నిర్ణయం విదేశీ బహుళ జాతి కంపెనీలకు మన ఇన్సూరెన్స్ రంగాన్ని అప్పగించడమే అవుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జె వెంకటేష్‌భూపాల్, వంగూరు రాములు, ఈశ్వర్ రావు,బొప్పని పద్మ,శంకర్ ,మూడ్ శోభన్, ఆర్ శ్రీరామ్ నాయక్, ఎం ధర్మానాయక్,కోట రమేష్, ఎం వెంకటేష్, యం దశరథ్, దితరులు పాల్గొన్నారు.

# ఎన్పీడీసీఎల్ కు 'ఇన్నోవేషన్ అవార్డు'




**మొదటి పేజీ తరువాత..**

రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ : సంస్థలోని 17 సర్కిళ్లలో దీనిని ఏర్పాటు చేశామని, దీని ద్వారా ఫీడర్ల పనితీరును క్షణక్షణం పర్యవేక్షిస్తూ అంతరాయాలను వెంటనే సరిదిద్దుతున్నామని చెప్పారు. ఫాల్ట్ పాసేజ్ ఇండికేటర్స్ : 33కేవీ, 11కేవీ సుదూర లైన్లలో వీటిని అమర్చడం ద్వారా లైన్ మొత్తం వెతకాల్సిన అవసరం లేకుండా ఎక్కడ సమస్య ఉందో వెంటనే గుర్తించి విద్యుత్ పునరుద్ధరణ చేపడుతున్నామన్నారు. వినియోగదారుల చెంతకు విద్యుత్ సేవలు: వినియోగదారులతో నేరుగా సత్ సంబంధాలు మరింత మెరుగుపరుచుకోవడానికి ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి , మంగళ , బుధ శని వారాల్లో ప్రజా బాట, పొలం బాట కార్యక్రమాలు చేపడుతూ వినియోగదారుల్లో విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు వివరిస్తూ చైతన్యం కల్పిస్తున్నామని వివరించారు.

# హాట్ ఎయిర్ బెలూన్‌లో విహారం

**మొదటి పేజీ తరువాత...**

ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బలూన్ అప్పోజి గూడ శివారులో దిగింది.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక కొత్త అధ్యాయమని మంత్రి అభివర్ణించారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకవైపు 'ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆతిథ్యాన్ని చాటుతుండగా, మరోవైపు 'హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్ల ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు. డెస్టినేషన్ తెలంగాణ ప్రపంచ పర్యాటక కేంద్రంగా.. తెలంగాణలోని సహజ సౌందర్యాన్ని, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "డెస్టినేషన్ తెలంగాణ" అనే బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ, కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించేలా ఇటువంటి సాహసోపేత క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా, ఒక గొప్ప అనుభూతిని పొందేలా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, భాగస్వామ్య పద్ధతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యమన్నారు. ఇదొక అద్భుత అనుభూతి. సంప్రదాయానికి గౌరవం, సాంకేతికతకు స్వాగతం పలుకుతూ పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం. నేడు ఆకాశంలో ఎగురుతున్న ఈ బెలూన్లు.. తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ స్థాయి ఎత్తులకు చేరుకోబోతోంది అనడానికి నిదర్శనం" అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, యువత, పిల్లలందరికీ ఈ ఫెస్టివల్ ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జస్టిస్ వర్మ అభిశంసన ఇక తప్పదు

**న్యూఢిల్లీ :** ఇంట్లో నగదు కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన ప్రక్రియకు మార్గం సుగమం అయింది. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పార్లమెంటరీ ప్యానెల్ చేస్తున్న దర్యాప్తు చట్టబద్ధతను సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారంనాడు సర్వోన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై జనవరి 8న తమ నిర్ణయాన్ని రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, ఎస్‌సి శర్మలతో కూడిన ధర్మాసనం శుక్రవారం తమ తీర్పును ప్రకటించింది.న్యాయమూర్తుల (దర్యాప్తు) చట్టం, 1968 కింద సంయుక్త కమిటీ అవసరమని, ఎగువ సభలో తొలగింపు మోషన్‌ను తిరస్కరించే అధికారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌కు లేదంటూ చేసిన జస్టిస్ వర్మ వాదనలను ధర్మాసనం స్పష్టంగా తిరస్కరించింది.

ప్రస్తుత కేసులో పిటిషనర్‌కు ఎలాంటి ఊరటను పొందే హక్కులేదని తాము భావిస్తున్నామంటూ, తన తీర్పును ప్రకటిస్తున్న సమయంలో జస్టిస్ దత్తా అభిప్రాయపడ్డారు. తదుపరి విచారణకు వ్యతిరేకంగా ఆయన చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించడం, ఇప్పుడు జస్టిస్ వర్మ పానెల్ ఎదుట హాజరవడమే కాదు, ఆయన అభిశంసన ప్రక్రియ కొనసాగనుంది. న్యూఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో మార్చి 14వ తేదీన కాలిపోయిన కరెన్సీ కట్టలు బయటపడడంతో జస్టిస్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు.నాటి ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణకు శ్రీకారం చుట్టి, పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీఎస్ సంధావాలియా, కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ, జస్టిస్ వర్మ దుష్ప్రవర్తనను నిర్ధారిస్తూ తన నివేదికను మే 4వ తేదీన సమర్పించింది.కాగా, అప్పుడు కూడా రాజీనామా చేసేందుకు జస్టిస్ వర్మ తిరస్కరించారు. అప్పుడు ప్రధాన న్యాయమూర్తి ఈ నివేదికను, న్యాయమూర్తి స్పందనను రాష్ట్రపతి, ప్రధానికి పంపారు, ఇది అభిశంసన ప్రక్రియలకు వేదికను సిద్ధం చేసింది. తదనంతరం, ఆగస్టు 12న జస్టిస్ వర్మ తొలగింపు కోసం బహుళ పార్టీల తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ బిర్లా ఆమోదించి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్యలతో కూడిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# మమత బెనర్జీ అడుగు జాడల్లో రాంచీలో ఈడీపై పోలీసుల దాడి

**మొదటి పేజీ తరువాత..**

డీఎస్పీ స్థాయి అధికారి, విమానాశ్రయ పోలీస్ స్టేషన్ ఇంఛార్జ్‌లు ఈ పోలీసు బృందంలో ఉన్నారు.కాగా, దాడి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాము ఈడీ కార్యాలయంలో సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని రాంచీ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐపాక్, దాని అధిపతి ప్రతీక్ జైన్ నివాసంపై ఈడీ దాడి సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత అక్కడకు బలవంతంగా ప్రవేశించి, పత్రాలను అపహరించారన్న ఆరోపణల నడుమ పశ్చిమ బెంగాల్ పోలీసులు, ఈడీ అధికారుల మధ్య ఘర్షణ నెలకొన్ని దరిమిలా ఈ పరిణామం చోటు చేసుకోవడం ఆసక్తికరంగా మారింది.

ఆరోపిత దాడి కేసులో ఈడీపై పోలీసులు దర్యాప్తు చేయడానికి వ్యతిరేకంగా జార్ఖండ్ హైకోర్టు శుక్రవారం స్టే ఇస్తూ, అక్కడ ఏదైనా భద్రతా లోపం ఏర్పడితే రాంచీ సీనియర్ సూపరింటెండ్ ఆఫ్ పోలస్ (ఎస్ఎస్‌పి) రాకేష్ రంజనే బాధ్యుడవుతాడని పేర్కొంది. ఈడీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారిస్తున్న క్రమంలో, కేసులో కేంద్ర హోం కార్యదర్శిని కూడా భాగం చేయమని జస్టిస్ సంజయ్ కుమార్ ద్వివేద్ ఆదేశించారు.ఈడీ కార్యాలయానికీ, అధికారులకు భద్రత కల్పించేందుకు సిఆర్‌పిఎఫ్/ బిఎస్ఎఫ్ లేదా ఏదైనా ఇతర పారామిలటరీ దళాన్ని డిప్యూట్ చేయవలసిందిగా కేంద్ర హోం కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. సంతోష్‌కు సంబంధించిన రూ.23 కోట్ల ఆరోపిత కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరుపుతోందని ఈడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ కేసులో ఈడీ ఇప్పటికే రూ. 9 కోట్లను తిరిగి రాబట్టిందని కూడా ఆయన కోర్టుకు తెలియజేశారు.

హేమంత్ సోరేన్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న ప్రతిపక్షం ఇదిలా ఉండగా, ఈడీ కార్యాలయంలో పోలీసు చర్య ముసుగులో, ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌కు చెందిన కేసులలో కీలకమైన ఆధారాలను మార్చి, ధ్వంసం చేసే యత్నాలు జరిగాయని జార్ఖండ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు బాబూలాల్ మరాండీ ఆరోపించారు. రాంచీలో ఎయిర్‌పోర్ట్ రోడ్డులో ఉన్న ఈడీ ప్రాంతీయ కార్యాలయాన్ని రాంచీ పోలీసులు చుట్టుముడుతున్నట్టు సమాచారం వచ్చింది, రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ జోక్యం ఉన్న వేలాది కోట్ల విలువైన అవినీతి కేసులకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని ఈడీ కార్యాలయం కలిగి ఉంది. పోలీసు చర్య ముసుగులో కీలకమైన ఆధారాలను మార్చడం లేదా విధ్వంసం చేసేందుకు ప్రయత్నాలు జరుగవచ్చు, అంటూ మరాండీ ఎక్స్‌పై పోస్టు చేశారు.కాగా, జనవరి 2024లో ఒక ఆరోపిత భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన ఢిల్లీ నివాసంలో ఈడీ అధికారులు నిర్వహించిన సోదాలపై సోరేన్ రాంచీలోని ఎస్సి/ ఎస్‌టి పోలీసు స్టేషన్‌లో సీనియర్ ఈడీ అధికారులకు వ్యతిరేకంగా పోలీసు ఫిర్యాదు దాఖలు చేశారు.తనను, తన సమాజాన్నీ, వేధించి, అపఖ్యాతి పాలు చేసేందుకే ఈడీ సోదాలను నిర్వహించిందని, ఆయన దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ సారాంశం. వారు చేసిన పనుల వల్ల నేను, నా కుటుంబ సభ్యులు అత్యంత మానసిక, భావోద్వేగపరమైన ఒత్తిడి, హానినీ అనుభవించామని, ఎఫ్ఐఆర్‌లో సోరేన్ పేర్కొన్నారు. జార్ఖండ్‌లో మాఫియాతో భూ యాజమాన్య హక్కులను అక్రమంగా మార్పిస్తున్న ఒక భారీ కుంభకోణంపై దర్యాప్తులో భాగంగా ముఖ్యమంత్రిని ఈడీ ప్రశ్నించింది.

# పచ్చదనంగా మేడారం ప్రాంగణం



**వుదయం, ములుగు:** మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణాన్ని పచ్చదనంగా సుందరీకరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులకు సూచించారు. ఈ నెల 18న సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన, కేబినెట్ భేటీ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఆర్టీసీ బస్టాండ్, జంపన్న వాగు, స్తూపం రోడ్లను వాహనంలో పరిశీలించి, సమ్మక్క సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులను పరిశీలించి, వన దేవతలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం లోని ల్యాండ్ స్కేపింగ్ పనులను, ప్రధాన ద్వారం ఫ్లోరింగ్ పనులను పరిశీలించి స్వయంగా ఫ్లోరింగ్ కింది భాగంలో ఇసుక ఎంత మేరకు నింపుతున్నారో పరిశీలించారు. పి టి భీమ్స్ పై అమర్చుతున్న బ్రాకెట్ లను, మీడియా టవర్స్ నిర్మాణాలను, క్యూ లైన్స్ షేడ్స్ లను పరిశీలించారు. అనంతరం హరిత హోటల్ లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మేడారం లో జరుగుతున్న పనుల పురోగతిని మంత్రులకు వివరించారు. తర్వాత మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణాన్ని పచ్చదనంగా సుందరీకరించాలని సూచించారు. రహదారులపై ఉన్న మట్టి, ఇతర వ్యర్థాలు వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల సెంట్రల్ లైటింగ్ డివైడర్ మధ్యలో సుందరీకరణ చెట్లను నాటాలని, అవసరం ఉన్న చోట కూలీల సంఖ్య పెంచుకొని పనులు జరిగేలా చూడాలన్నారు. పనుల విషయంలో అధికారులు, గుత్తేదారులు నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారిని ఐనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జాతర పరిసరాలను జోనల్ , యూనిట్ విధంగా విభజించి జోనల్ కు ఒక ప్రత్యేక అధికారిని నియమించి బాధ్యతలను అప్పజెప్పాలని ఆలయ ప్రాంగణ పరిసరాల్లో మిగిలిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు.

డివైడర్ పనులు పూర్తయ్యాక వెంటనే ఫైర్ ఇంజిన్లతో అన్ని రహదారుల పై క్లీనింగ్ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మేడారం జాతర రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమన్న మంత్రులు.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏటూరు నాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్ డి ఓ వెంకటేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## జీతాలు చెల్లించాలని ఉద్యోగుల పెన్డౌన్



**నారాయణపేట , వుదయం ప్రతినిధి :** 104 లో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు 8 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని జిల్లాలో పనిచేస్తున్న 22 మంది ఉద్యోగులలో 7 మంది ఫార్మాసిస్టలు ఒక ల్యాబ్ టెక్నీషియన్ లు నేటి నుండి పెన్ డౌన్ చేపడుతున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారి జయ చంద్ర మోహన్ కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర 104 ఉద్యోగ సంఘం పిలుపు మేరకు నేటి నుండి పెన్ డౌన్ చేపట్టామని గత 8 నెలలుగా మాకు జీతాలు ఇవ్వలేదని మేము పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంంది అని కావున ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి మాకు వెంటనే జీతాలు చెల్లించి మా జీవితాల్ని నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ గౌడ్, శ్రీనివాస్, సత్యకుమార్, కృష్ణయ్య, రేణుక ,స్వామి, రవికుమార్, వెంకటేష్, భాగ్య రేఖ లు పాల్గొన్నారు.

## విద్యార్థిని సన్మానించిన బండ్ల



**గద్వాల వుదయం ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలోని చిన్నోని పల్లి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి కుమారుడు మాధవరెడ్డి ఇటీవలే సిఐఎస్ఎఫ్ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం సాధించడం సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించి అభినందించారు. అదేవిధంగా భవిష్యత్తులో గ్రామంలో విద్యార్థులు మంచి ఉన్నత లక్ష్యాన్ని తో చదువుకొని భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం రంగాలలో ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు గోపాల్ రెడ్డి, కృష్ణ రెడ్డి, లక్ష్మన్న, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్లకు సన్మానం

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి



**గద్వాల , వుదయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లాకు నూతనంగా ఎంపిక కాబడ్డ ల్యాబ్ టెక్నీషియన్లు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపిక కాబడ్డ ల్యాబ్ టెక్నీషియన్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్. జే. సంధ్యా కిరణ్మయి కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డి ఎమ్ ఎచ్ ఓ. మాట్లాడుతూ 05 (ఐదు ) మంది ల్యాబ్ టెక్నీషియన్స్ శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేశారని, వీరిని ఒక్కొక్కరిని ఇటిక్యాల, ధరూరు, క్యాతురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పి పి యూనిట్, డీఎమ్ హెచ్ ఓ ఆఫీస్ లో నియమిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. జి. ప్రసూనా రాణి, కార్యాలయ వైద్య సిబ్బంది, కే. మధుసూదన్ రెడ్డి, జే. తిరుమలేష్ రెడ్డి, టి. వరలక్ష్మి, రామాంజనేయులు, నరసయ్య పాల్గొన్నారు.

## జాజాపూర్ దేవాంగ సమాజ నూతన కమిటీ ఎన్నిక

**నారాయణపేట, వుదయం ప్రతినిధి** నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలోని శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయంలో శుక్రవారం దేవాంగ సమాజ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కత్రి సుభాష్, మండికి శ్రీనివాసులు, కార్యదర్శులు బంక శ్రీధర్, మండికి ఆనంద్ తోపాటు కోశాధికారి కవ్వ శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకొని అభినందించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ దేవాంగ సమాజ అభివృద్ధి కోసం నిరంతరంగా కృషి చేస్తామని అన్నారు. దేవాంగ సమాజ సభ్యుల సహకారంతో ముందుకు వెళతామన్నారు. సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కార్యక్రమంలో తమ వంతు సహాయంతో పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. సభ్యుల సహకారంతో దేవాంగ సమాజ అభివృద్ధికి తోడ్పడుతామని వారు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను దేవాంగ సమాజం సభ్యులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాజాపూర్ దేవాంగ సమాజ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఐఎస్ఎఫ్–2026 విజయవంతానికి

# సమన్వయంతో పనిచేయాలి

### కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి :** సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ -2026 రాష్ట్ర, జిల్లా ప్రతిష్టకు కీలకమని, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈనెల 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (SISF)-2026 ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలు, సైనేజీ ఏర్పాటు, ఎగ్జిబిట్ల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అలాగే సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులకు అవసరమైన వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సౌత్ ఇండియా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ కనెక్షన్లు, బ్యాకప్ ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైన్స్ ఫెయిర్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వసతి, భోజనం, రవాణా, భద్రత, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, విద్యుత్, తాగునీరు తదితర కమిటీలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కమిటీ ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అధికారులు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రిజిస్ట్రార్, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, విజయ్ కుమార్, పటాన్చెరు తహసిల్దార్, వివిధ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్లను, నగర మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకోవాలి



**హైదరాబాద్:** రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల పదవీ కాలం ఈ నెల చివరి వారంతో పదవీ కాలం పూర్తయి సుమారు రెండు సంవత్సరాలు కావొస్తుందని ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే నగరానికి మేయర్‌ను, మున్సిపల్ పట్టణాలకు చైర్మన్లను ప్రజలే ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకొనేల చర్యలు తీసుకోవాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. గతంలో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని బహిరంగ లేఖ ద్వారా ఈమెయిల్ ద్వారా ముఖ్యమంత్రిని కోరామని అయినా ఈనాటి వరకు ప్రభుత్వం స్పందిచక పోవడం స్థానిక ప్రభుత్వాల పట్ల నిర్లక్ష ధోరణి స్పష్టమైందని ఆయన అన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానం కొత్తదేమి కాదని గతంలో మూడు సార్లు 1987 1992, 1992 1997 మరియు 1997 2002 వరకు మున్సిపల్ చైర్మన్ పదవికి గ్రామ సర్పంచ్ మాదిరిగా పట్టణ ప్రజలు ప్రత్యక్షంగా చైర్మన్ ని ఎన్నుకొనేవారని అదే విధంగా నగర మేయర్ ని ప్రత్యక్షంగా నగర ప్రజలు ఎన్నుకొనేవారని అయితే గత ప్రభుత్వాల కుట్ర, స్వార్థ, ధన రాజకీయాల మూలంగా అధికార క్రీడల నేపథ్యంలో చైర్మన్ పదవులు వేలం పాటలకు దారితీశాయని స్థానిక ప్రభుత్వాల మనుగడ ప్రష్నార్థకం అయ్యిందని ఇక ఎంత మాత్రం రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాల్సిన అవసరం లేదని త్వరలో జరిగే ఎన్నికలలో మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్లను, నగర కార్పొరేషన్ మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకొనేలా చర్యలు తీసుకోవాలని తుమ్మనపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో బహిరంగ లేఖ ద్వారా సైతం ముఖ్యమంత్రిని కోరామని ఈనాటి వరకు కూడా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డురంగా ఉందని ఆయన అన్నారు.

## మేడిపల్లి లో సంక్రాతి సంబురాలు



**మేడిపల్లి, వుదయం ప్రతినిధి:** బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి 10వ డివిజన్లో డబల్ బెడ్ రూమ్ కాలనీలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన ముగ్గుల కార్యక్రమంలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సవంగా పాల్గొని ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు..... పర్వతాపూర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసుల ఐక్యత జిహెచ్ఎంసి లోని ప్రతి ఒక్క డివిజన్ ప్రజలకు ఒక ఆదర్శంగా నిలుస్తుందని అటుగా వెళ్లిన ప్రతి ఒక్క నగరవాసి కొనియాడా సాగారు.

## 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి దరఖాస్తు



**నిజామాబాద్, వుదయం:** ఉల్లెంగ నాగరాజు 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మన నిజామాబాద్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఐన నాగరాజు బొబ్బిలి వీధి ఎల్లమ్మ గుట్ట మాజీ యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ గా పనిచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పి.ప్రదీప్ , కిరణ్ తదితరులు ఆయనకు మద్దర్తు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన నిజామాబాద్ నాయకులకు, ప్రజలకు, 47 డివిజన్ ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## 17-18న పీఎం పశ్చిమ బెంగాల్‌లో పర్యటన




- గౌరవ ప్రధానమంత్రి జనవరి 17న మాల్దాలో ₹3,250 కోట్లకు పైగా విలువైన వివిధ రైలు మరియు రోడ్డు ప్రాజెక్టులకు అంకితం మరియు శంకుస్థాపన చేయనున్నారు
- గౌరవ ప్రధానమంత్రి హౌరా మరియు గౌహతి (కామాఖ్య) మధ్య భారతదేశపు మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు
- వందే భారత్ స్లీపర్ రైలు పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ తో ఆధునిక, సౌకర్యవంతమైన మరియు సుదూర ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది
- గౌరవ ప్రధానమంత్రి హుగ్లీలోని సింగూర్‌లో ₹830 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు, శంకుస్థాపన చేయనున్నారు మరియు జెండా ఊపి ప్రారంభించనున్నారు
- బాలాగఢ్‌లో విస్తరించిన పోర్ట్ గేట్ వ్యవస్థకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు తద్వారా , ఇది అంతర్గత జల రవాణా మరియు ప్రాంతీయ అనుసంధానాన్ని పెంచుతుంది
- 7 అమృత్ భారత్ రైళ్లను ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీనితో ఇతర రాష్ట్రాలతో పశ్చిమ బెంగాల్ రైలు మెరుగైన అనుసంధానం.
- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జనవరి 1718 తేదీలలో అస్సాంలో పర్యటించనున్నారు
- జనవరి 17న బోడో సమాజం యొక్క గొప్ప వారసత్వాన్ని చాటిచెప్పే చారిత్రాత్మక సాంస్కృతిక కార్యక్రమం "బగురుంబా ద్వౌ 2026"లో ప్రధాన మంత్రి పాల్గొననున్నారు
- బోడో సమాజానికి చెందిన 10,000 మందికి పైగా కళాకారులు బగురుంబా నృత్యం ప్రదర్శించనున్నారు
- కలియాబోర్‌లో రూ. 6,950 కోట్లకు పైగా విలువైన కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి భూమి పూజ చేయనున్నారు
- ఈ ప్రాజెక్టు జంతువుల నిరంతర కదలికను నిర్ధారిస్తుంది, మానవవన్యప్రాణుల సంఘర్షణను తగ్గిస్తుంది మరియు ప్రాంతీయ అనుసంధానాన్ని కూడా మెరుగుపరుస్తుంది
- గౌహతి (కామాఖ్య)-రోహ్‌తక్ మరియు డిబ్రూగఢ్-లక్నో (గోమతి నగర్) మధ్య నడిచే 2 కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు

## 'సదర్మాట్' ద్వారా వేల ఎకరాలకు సాగునీరు

### రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి






**నిర్మల్లు, వుదయం ప్రతినిధి :** నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. 2016 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును 676.592 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించగా, ఇందుకోసం 1,176 ఎకరాల భూమిని సేకరించారని పేర్కొన్నారు. ఈ బ్యారేజీ ద్వారా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాల్లో 12 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో 5 వేల ఎకరాలు కలిపి మొత్తం 18,016 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో కడెం, ఖానాపూర్, కోరుట్ల మండలాల్లోని 34 గ్రామాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుందని వివరించారు. పాత సదర్మాట్ అనికట్, గంగానాలా ఆయకట్టు స్థిరీకరణకు 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా విడుదల చేస్తామని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో పాటు, పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 7వ వార్డు బీజేపీ టికెట్‌కు దరఖాస్తు



**నారాయణపేట టౌన్ , వుదయం ప్రతినిధి :** నారాయణపేట మున్సిపాలిటీ 7 వ వార్డు బిజెపి కౌన్సిలర్ టికెట్ కోసం గణేష్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డి.మల్లేష్ శుక్రవారం పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ కు దరఖాస్తు చేసుకున్నారు. వార్డు అభివృద్ధికి ఏ పదవి లేకున్నా అనేక సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడం జరిగిందన్నారు. పార్టీ టికెట్ ఇస్తే వార్డు ప్రజల అభిమానంతో తప్పక విజయం సాధిస్తానని పేర్కొన్నారు.

## పండుగలు...పూర్వీకులు మనకు ఇచ్చిన కానుకలు



**సంగా రెడ్డి , ఉదయం:** సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్ లో జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా తన చిన్ననాటి మిత్రులతో కలిసి పతంగులు ఎగరవేశారు. అనంతరం పాత పాటలకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. ఉదయం 12 గంటలకు మొదలుకుని సాయంత్రం 5 గంటల వరకు ఈ సంబరాలు కొనసాగాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు మనకు పూర్వీకులు ఇచ్చిన కానుకలని, కష్టాలను, బాధలను మర్చిపోయి పండుగ రోజు అందరూ కుటుంబాలతో సంతోషంగా గడుపుతారన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్, రామ్ మందిర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వీవీసీ పైప్‌లలో స్ట్రాబెర్రి

చలి కాలం లో మనకి మార్కెట్ లో ఎక్కువగా దొరికే పళ్లలో స్ట్రాబెర్రి ఒకటి. ఇంతకు ముందు ఈ స్ట్రాబెర్రి పంట కేవలం చలి ప్రాంతాల్లోనే పండించేవారు కానీ ఇప్పుడు కొత్త సాగు పద్ధతులను మరియు విభిన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే తగిన రకాలు ప్రవేశపెట్టడం ద్వారా వేరే ప్రాంతాలలో కూడా స్ట్రాబెర్రీని విజయవంతంగా సాగుచేస్తున్నారు. స్ట్రాబెర్రీ సాగు యొక్క అదనపు ప్రయోజనం ఏమిటంటే ఇది ఇతర పండ్లతో పోలిస్తే త్వరగా రాబడిని ఇస్తుంది.

స్ట్రాబెర్రీ పండ్లు రుచి మరియు పోషక విలువల కారణంగా ప్రపంచంలో అత్యంత విస్తృతంగా వినియోగించబడే పండ్లలో ఒకటి గా మారింది. స్ట్రాబెర్రీ పండ్లలో కాల్షియం, పొటాషియం, ఇనుము, సోడియం, ఏ, బీ, సీ, ఈ విటమిన్లు మరియు యాంటీఆక్సిడెంట్లు వంటి ఖనిజాల సమృద్ధిగా ఉంటాయి. పండిన పండ్లలో ఎలాజిక్ ఆమ్లం ఉంటుంది, ఇది క్యాన్సర్ మరియు గుండె జబ్బులను నివారిస్తుంది, అందువల్ల, స్ట్రాబెర్రీ ప్రపంచవ్యాప్తంగా ఒక ముఖ్యమైన పండు గా మారింది. కోవిడ్19 మహమ్మారి తర్వాత భారతీయ గృహాల్లో పండ్లు మరియు కూరగాయల వినియోగం గణనీయంగా పెరిగింది, ముఖ్యంగా విటమిన్ సి అధికంగా కలిగిన పండ్లపై దృష్టి పెట్టారు. ఈ వర్గంలోకి వచ్చే పండ్లలో స్ట్రాబెర్రీ ఒకటి.





మన దేశం లో స్ట్రాబెర్రి ప్రధానంగా హర్యానా, మహారాష్ట్ర, జమ్మూ & కాశ్మీర్, మిజోరం, మేఘాలయ, మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, జార్ఖండ్, నాగాలాండ్ మరియు కేరళ లలో సాగుచేస్తున్నారు. స్ట్రాబెర్రి తెలంగాణలో పండించడానికి సాపేక్షంగా కొత్త పంట కానీ వినియోగం మాత్రం రాష్ట్రం లో బాగా పెరిగింది ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఈ పండ్లను తినడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ పంట సాగు ని పట్టణ ఇంటి ఆవరణ లో మరియు బాల్కనీలలో ఈసీ గా పెంచొచ్చు.

పెరుగుతున్న ఆహార డిమాండ్‌ను తీర్చడానికి ప్రవేశపెట్టబడిన నూతన సాంకేతిక పరిజ్ఞానాలలో నిలువు వ్యవసాయం (వర్టికల్ ఫార్మింగ్) ఒకటి, ఇది ఎక్కువ స్థలం లేని చోట మరియు అందుబాటులో ఉన్న భూమి లో మొక్కలను పెంచడానికి ప్రభావవంతమైన మార్గం. పండ్ల పంటలలో, స్ట్రాబెర్రీ వేర్ల వ్యవస్థ 20 నుండి 30 సెం.మీ వరకు మాత్రమే విస్తరించి ఉంటుంది కావున నిలువు పద్ధతిలో (వర్టికల్ ఫార్మింగ్) తక్కువ విస్తీర్ణంలో స్ట్రాబెర్రి ని పెంచడం ద్వారా ఉత్పత్తిని పెంచవచ్చు, ఇది స్ట్రాబెర్రీల పోషక విలువల కారణంగా పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో సహాయపడుతుంది మరియు రైతులకు లాభాలను అందిస్తుంది.

వర్టికల్ ఫార్మింగ్ అనేది ఆహారాన్ని పండించడానికి, నిలువు స్థలాన్ని ఉపయోగించుకుని వ్యవసాయం చేసే పద్ధతి. పంట ఉత్పత్తి పెరుగుదల, వనరుల పరిరక్షణ, మానవ ఆరోగ్యంపై మంచి ప్రభావం, పట్టణ వృద్ధి, శక్తి స్థిరత్వం మొదలైన వాటి పరంగా ఇది సాంప్రదాయ వ్యవసాయం కంటే అనేక ప్రయోజనాలను అందిస్తుంది. సరిగ్గా రూపొందించబడితే, వర్టికల్ ఫార్మింగ్ అదనపు వ్యవసాయ భూములను సృష్టించాల్సిన అవసరాన్ని తొలగించవచ్చు, పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించడానికి మరియు పెరుగుతున్న నగరాలకుఆహార సంక్షోభాన్ని పరిష్కరించడానికి సహాయపడుతుంది.

తక్కువ కర్చు తో తయారు చేయబడిన పైపులను వర్టికల్ ఫార్మింగ్ గా పంట ఉత్పత్తికి ఉపయోగించవచ్చు. ఈ పద్ధతిలో, డాక్టోరియల్ పరిశోధనలో భాగంగా జీడిమెట్లలోని సీఓఈ లో ప్రయోగం నిర్వహించబడింది, ఇక్కడ పీవీసీ నిలువు టవర్లలో స్ట్రాబెర్రీని పెంచే ప్రయత్నం విజయవంతమైంది.

ఇందుకు కాను, 6 ఇంచుల డయమేటర్ కలిగిన ఆరు అడుగుల నల్లటి పీవీసీ పైపు కి 24 పౌచ్‌లు/రంధ్రాలు తయారు చేసి నిలవు టవర్ గా మార్చారు. టవర్‌లను 3 అడుగుల దూరంలో ఏర్పాటుచేసి, నీరు మరియు ఎరువుల అందించటం కోసం టవర్ల పైన డ్రిప్ లాటరల్‌ను /డ్రిప్పర్ ఏర్పాటు చేయడం జరిగింది. అవసరమైన నిష్పత్తులలో మీడియా ని కలిపి టవర్ లోపల ఖాళీలు లేకుండా నింపి, ప్రతి స్ట్రాబెర్రీ మొలకను నిలువు టవర్ యొక్క రంధ్రం లో నాటాలి.

ఈ పద్ధతిలో, ఒక టవర్‌కు సుమారుగా 4.79 కిలోల దిగుబడి తీసుకోవొచ్చు, కావున, పరిమిత స్థలం ఉన్న పట్టణ గృహాల్లో పీవీసీ టవర్లను ఉపయోగించి స్ట్రాబెర్రీని సౌకర్యవంతంగా పెంచవొచ్చు.





ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీ కూడా అధికార పార్టీ అయిన బీజేపీ కూల్చివేసినన్ని దేవాలయాలను కూల్చలేదు. తమ చారిత్రిక నగరాన్ని పరిరక్షించుకున్న దేశాల నుంచి భారత్ దేశం స్ఫూర్తి పొందాలి. ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఐరోపా వ్యాప్తంగా అనేక పురాతన నగరాలు ఉన్నాయి, వారు తమ వారసత్వ సంపదను పరిరక్షించుకున్నారు. అటువంటి పనినే ఇక్కడ కూడా చేయాలి. బెనారస్ ప్రజలు తమ నగరంలో అనేక ప్రాచీన ఆలయాలు ఉన్న విషయాన్ని తెలుసుకోవాలి. కానీ బీజేపీకి డబ్బు పట్ల తప్ప మరి దేని పట్లా విశ్వాసం లేదు. డబ్బు చేసుకునేందుకు మాత్రమే బీజేపీ నాయకులకు అధికారం కావాలి.

- సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్

## వేమన పద్యం



తామసించి చేయదగ దెట్టికార్యంబు
వేగిరింప నదియు విషమెయగును
పచ్చికాయదెచ్చి బడవేయ ఫలమౌన ?
విశ్వదాభిరామ! వినురవేమ!

## సంపాదకీయం

పరిపూర్ణ న్యాయ అధికారం నిబంధన (రాజ్యాంగం) కింద గతంలో ఇచ్చిన తీర్పును సిజెఐ మారిన తర్వాత

స్వేచ్ఛలకు ప్రాధాన్యం ఇచ్చే రాజ్యాంగం కింద బెయిల్ ను ఎక్కువ కాలం నిరాకరించరాదని సుప్రీం కోర్టు

# వ్యక్తి స్వేచ్ఛకు ముప్పు

ఒకే వివాదంలో ఒకే కోర్టు పరస్పర విరుద్ధ తీర్పులు ఇవ్వడం అరుదు. కింది ధర్మాసనం తీర్పును పై బెంచ్ కొట్టివేయడం సాధారణం. కాని సుప్రీం కోర్టు దేశ ప్రజాస్వామిక లౌకిక పునాదులకు సంబంధించిన అత్యంత కీలక అంశాలపై తన అభిప్రాయాలకు వ్యతిరేకంగా తానే మరొక తీర్పు లో చెప్పడం వల్ల గందరగోళం ఏర్పడుతుంది. దేశ దిశ ఏది అనే అనుమానం కూడా కలుగుతుంది. ఇలా అనిపించిన సందర్భాలు ఇటీవల జరిగాయి. రాష్ట్రాల మంత్రివరాలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా నిరవధికంగా జాప్యం చేస్తూ వేధిస్తున్న గవర్నర్లకేకాదు, రాష్ట్రపతికి కూడా గడువు విధిస్తూ సవరించారు. అలాగే పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా 2020 లో ఢిల్లీ లో చోటుచేసుకొన్న ఆందోళన అల్లర్ల కేసులో ఐదేళ్ళుగా జైల్లో ఉన్న ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ లకు బెయిల్ నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది. వీరిద్దరిని టెర్రరిస్టులుగా భావించి ఆ అల్లర్ల సూత్రదారులను చేసి వారికి స్వేచ్ఛను శాశ్వతంగా నిరాకరించారు. పౌర గతంలో అనేకసార్లు కింది కోర్టుల చెవిలో ఇల్లు కట్టుకొని చెప్పింది. బెయిల్ పిటిషన్లను తమ సాయిలో ఆమోదించకుండా పై కోర్టుల పైకి నెట్టివేయడం మంచిది కాదని హితవు చెప్పింది. బెయిల్ నిరవధిక నిరాకరణ రాజ్యాంగం ఆర్టికల్ 21 కి వ్యతిరేకమని స్పష్టం చేసింది. దానిని వెక్కిరిస్తూ దుర్మార్గమైన ఉపా చట్టం కింద సుప్రీం కోర్టు ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ లకు బెయిల్ నిరకరణను సమర్థించడం బాధాకరం. బెయిల్, ముందస్తు బెయిల్ నిరాకరణ వ్యక్తి స్వేచ్ఛను బలి తీసుకొంటాయని, వీటిపై సకాల నిర్ణయాలు తీసుకోడం రాజ్యాంగ విధి అని సుప్రీం కోర్టు తానే చెప్పుకొన్నదానికి ఇప్పుడు ఈ కేసులో స్వస్తి చెప్పడం అనేక భయాలు కలుగడం సహజం, స్వ ఐదేళ్లు అయినా ఇంకా విచారణే ప్రారంభం కాని కేసులో బెయిల్ తిరస్కరించడం కంటే అన్యాయం మరొకటి ఉండదు. ఈ తప్పుడు అడుగును సవరించుకోడం జాతీయ అవసరం. లేని పక్షంలో రాజ్యాంగానికి తెలియకుండానే దేశం దిశ మారుతున్నదేమో అనే అభిప్రాయం ఏర్పడుతుంది. ఇదిజాతికి దేశ ప్రజాస్వామిక సంప్రదాయానికి పెను ముప్పును కలిగిస్తుంది. ఇప్పటికైనా వైఖరిని మార్చుకోవడం అవసరం అని అత్యున్నత న్యాయస్థానానికి చెప్పనక్కరలేదు.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# జారుడుబండ మీద వ్యవసాయం

వ్యవసాయంలో మొత్తం విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్-జివిఎ) మార్చినెలతో ముగిసే 2025-26 ఆర్థిక సంవత్సరంలో పెరుగుదల రేటు కేవలం 0.8శాతమే అని గతేడాది 10.4శాతం ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ద్రవ్యోల్బణం తగ్గటమే అని చెబుతున్నారు. దేశమంతటా దాదాపు అన్ని ప్రాంతాలలో మంచి వర్షాలు పడి పంటల ఉత్పత్తులు పెరిగినప్పటికీ జివిఎ తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. రైతాంగ ఆదాయాల రెట్టింపు, కనీస మద్దతు ధరల పెంపుదల, ఎగుమతి అవకాశాల కల్పన వంటి ఎన్నికబుర్లు చెప్పినా నరేంద్రమోడీ పాలనలో పరిస్థితి దిగజారింది. రైతాంగం మీద కక్షగట్టినట్లుగా అనుసరిస్తున్న విధానాల ఫలితంగా మొత్తంగా రైతుల ఆదాయాలు పడిపోయాయి, కనీస మద్దతు ధరల నిర్ణయమే లోపభూయిష్టమైతే ఈ ఏడాది ప్రతి పంటనూ అంతకంటే తక్కువ ధరలకే రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. వివిధ రంగాల జివిఎల తీరు తెన్నులు చూసినపుడు యుపిఏ పాలనలో 2011-12లో వ్యవసాయ రంగ వాటా 18.53 శాతం ఉండగా 2019-20 నుంచి 2023-24 మధ్య కాలంలో ఐదేండ్ల సగటు 18.57 శాతం ఉంది, తరువాత ఇంకా పడిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భరత అన్నప్పటికీ * పారిశ్రామిక రంగ జివిఏ ఐదేండ్ల సగటు 27.56 శాతం ఉంది, అదే 2011-12లో 32.5 శాతం ఉంది. సేవారంగంలో ఐదేండ్ల సగటు 53.85కాగా 2011-12లో 48.97శాతం ఉంది, ఒక్క సేవారంగంలో మాత్రమే పెరుగుదల ఉంది. అత్యధిక జనాభాకు ఉపాధి కల్పించే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల దిగజారుడు కారణంగానే ఏటా రెండు కోట్ల కొత్త ఉద్యోగాల గురించి మోడీ మౌనంగా ఉంటున్నారు.

ప్రభుత్వ విధానాలు అటు వినియోగదారులు, ఇటు ఉత్పత్తిదారుల ప్రయోజనాలను కాపాడేవిగా ఉండాలి. మొత్తంగా చూసినపుడు ద్రవ్యోల్బణం తగ్గించేందుకు అనుసరిస్తున్న పద్దతుల మీద ఏకాభిప్రాయం లేదు. ఇదే సమయంలో తగ్గుదల రైతాంగాన్ని, యావత్ గ్రామీణ ప్రాంతాన్ని దెబ్బతీస్తున్నది, వ్యవసాయదారులను ఫణంగా పెడుతున్నది. ప్రపంచంలో బియ్యాన్ని అధికంగా ఉత్పత్తి చేస్తున్న చైనా(14.5 కోట్ల టన్నులు)ను వెనక్కు నెట్టి మనదేశం(15 కోట్ల టన్నులు) ప్రథమ స్థానానికి చేరటం తమ ఘనతే అని కేంద్ర ప్రభుత్వం, అధికార బిజెపి స్వంతడబ్బా కొట్టుకుంటున్నాయి. రైతులకు దక్కిందేమిటన్నది ప్రశ్న. విదేశాలకు బియ్యం ఎగుమతి చేసే కంపెనీలు కిలో రు.33కు అటూ ఇటూగా ధరల ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వార్తలు. నిజంగా కనీస మద్దతు ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తే ఈ ధర గిట్టుబాటు అవుతుందా ? ఎగుమతులకు గ్రేడ్ ఏ రకాలే ఉంటాయన్న సంగతి తెలిసిందే, వర్తమాన సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలు కనీస మద్దతు ధర రు.2,389గా ఉంది. మరోవైపు వినియోగదారులు 45 నుంచి 55 రూపాయలకు కిలోబియ్యం కొంటున్నారు. అంటే అటు రైతులను ముంచి ఇటు వినియోగదారుల జేబులు కొట్టి విదేశాలకు చౌకగా బియ్యం ఎగుమతి చేస్తున్నాం.

పప్పు, నూనె గింజల్లో స్వయం పోషకత్వం సాధించాలని సంకల్పాలు చెప్పుకోవటం తప్ప తగిన ప్రోత్సాహం, అధిక దిగుబడి వంగడాల మీద పరిశోధనా లేదు. మూడు దశాబ్దాల క్రితం నామమాత్రంగా ఖాద్య తైలాలను దిగుమతి చేసుకొనే వారం, ఇప్పుడు 60 శాతం అవసరాలు విదేశాల నుంచే తీర్చుకుంటున్నాం. అదానీ వంటి దిగుమతి కంపెనీల లాభాలను కాపాడటానికే ఈ రంగంపై మోడీ సర్కార్ శ్రద్ద చూపటం లేదు. నూనెగింజల ఉత్పత్తి పెంచాలంటూ 2024లో జాతీయ పథకాన్ని ప్రారంభించారు, కళ్లు తెరవటానికి పదేండ్లు పట్టింది. మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియాల మాదిరే ఇది కూడా మారనుందా ? 2021 ఆగస్టులో ఖాద్య తైలాలు-పామాయిల్ ఉత్పత్తి పెంపు పథకాన్ని ప్రకటించి 2025-26 నాటికి అదనంగా పామాయిల్ 6.64లక్షల హెక్టార్ల సాగు చేయిస్తామని చెప్పారు, కానీ 1.89లక్షలే పెరిగింది, ఇదే కాలంలో ఆవనూనె సాగు, ఉత్పత్తి రెండూ తగ్గాయి. దీనికి కూడా జవహర్ లాల్ నెహ్రూ, కాంగ్రెస్ నేతలే కారణమని చెప్పినా నమ్మే జనాలున్నారు మరి ! మరోవైపు ముడి పామాయిల్ దిగుమతులపై పన్ను మొత్తాన్ని 20 నుంచి పది శాతానికి తగ్గించారు. కొనుగోలు శక్తి లేక తలసరి ఖాద్యతైల వినియోగం తక్కువగా ఉండబట్టి గానీ లేకుంటే దిగుమతులు మరింతగా పెరిగి ఉండేవి. వేరుసెనగ దేశం మొత్తంలో మూడోవంతుకు పైగా గుజరాత్‌లో సాగు చేస్తారు. మొత్తం నూనె గింజల సాగులో మూడు దశాబ్దాల క్రితం 38శాతంగా ఉన్న వేరుశనగ ఇప్పుడు 28శాతానికి పడిపోయింది. పొద్దుతిరుగుడు ఆరు నుంచి 0.5శాతానికి దిగజారింది. సోయాబీన్, ఆవ నూనె సాగు పెరిగింది. వేరుశనగలో నూనె 48-50శాతం వరకు ఉంటుంది, అదే సోయాలో 18-20శాతమే, అందువలన సోయా పెరిగినా పెద్దగా ప్రయోజనం లేదు. ఆవు పేడ, మూత్రాల్లో ఏముందని పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యత రైతాంగానికి మేలు చేసే నూనె గింజల దిగుబడిని పెంచే రకాల అభివృద్ధి పట్ల లేదు. వేరుశనగ దిగుబడి హెక్టారుకు మన దేశంలో 2.08టన్నులు(2023) కాగా చైనాలో 3.98, అమెరికాలో 4.19 టన్నులు ఉంది. ఇటు ధరలు లేక అటు అధిక దిగుబడి వంగడాలు లేకుండా దేశం కోసం ధర్మం కోసం పాలన అంటే ప్రయోజనం ఏముంది ! గుజరాత్ వేరుశన సాగులో ఒక నిలకడ లేదు. గడచిన రెండు దశాబ్దాలలో అక్కడ కూడా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ఎందుకు రైతులు వేరే పంటలకు వెళతారంటే వేరుశెనగ గిట్టుబాటు కాకపోవటమే. నిజానికి నరేంద్రమోడీకి గుజరాత్ రైతుల మీద అయినా శ్రద్ధ, రైతాంగానికి గిట్టుబాటయ్యే చర్యలు తీసుకొని ఉంటే మొత్తంగా సాగు ఇంకా పెరిగి ఉండేది, దిగుమతుల భారాన్ని తగ్గించి ఉండేది, అధిక దిగుబడి వంగడాల అభివృద్ధి జరిగి ఉండేది. ఇటీవలి కాలంలో బిజెపి రెండింజన్ల పాలిత రాష్ట్రాలతో సహా అన్ని చోట్లా రైతాంగం యూరియా కొరతను ఎదుర్కొన్నది. అంతర్గత పరిస్థితి ఇలా ఉంటే అమెరికా కత్తి మన రైతాంగం మీద వేలాడుతున్నది. 2030 నాటికి ఇరుదేశాల వాణిజ్యాన్ని 128 బిలియన్ డాలర్ల నుంచి 500బి.డాలర్లకు తీసుకుపోతామని మన నేతలు చెప్పిన సంగతి తెలిసిందే. అందుకు గాను తమ దేశంలో వినియోగించని కోడికాళ్లు, మిగులుగా ఉన్న వెన్న, జున్ను వంటి పాడి ఉత్పత్తులను, సోయా, మొక్కజొన్నలు, పత్తి తదితర ఉత్పత్తులను దిగుమతి చేసుకొనేందుకు అనుమతితో పాటు పన్ను భారాన్ని తగ్గించాలని అమెరికా వత్తిడి చేస్తున్నది. ఏటా 20 బిలియన్ డాలర్ల మేర అక్కడి రైతాంగానికి అమెరికా సబ్సిడీలు ఇస్తున్నది. షరతులను అంగీకరిస్తే ఆ వస్తువులన్నింటినీ మన దేశంలో కుమ్మరిస్తారు, మనకు వ్యవసాయం వాణిజ్యం కంటే జీవనాధారంగా ప్రాధాన్యత కలిగి ఉంది. అమెరికా వస్తువులకు మార్కెట్‌ను తెరిస్తే నరేంద్రమోడీతో పాటు బిజెపి రాజకీయ పతనానికి నాంది పలికినట్లే. ట్రంప్‌ను సంతుష్టీకరించటానికి సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పత్తి దిగుమతి పన్ను రద్దు చేశారు. దాని ప్రభావం మన పత్తిమార్కెట్‌పై పడి కనీస మద్దతు ధరలకంటే తక్కువకే అమ్ముకోవాల్సి వచ్చింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. గ్రామీణ ఆదాయ పెరుగుదల 5.6, ఖర్చు పెరుగుదల 69.4శాతాల చొప్పున ఉంది. ఈ కారణంగా రుణ భారం పెరిగినందున రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేయాలి. 2016-17లో రుణ భారం ఉన్న గ్రామీణ కుటుంబాలు 47.4శాతం కాగా 2021-22 నాటికి 52శాతానికి చేరినట్లు నాబార్డు సర్వే తెలిపింది. వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులు 2020-21లో 3.53శాతం ఉండగా 2024-25లో 2.54శాతానికి తగ్గాయి. వ్యవసాయ వృద్ధి రేటు 2023-24లో 1.4శాతానికి తగ్గింది, ఇది ఏడు సంవత్సరాల్లో కనిష్టం. రెండు ఎకరాలలోపు రైతాంగానికి విధిగా అందిరికీ పంటల బీమా చేయించాలి. వ్యవసాయ కార్మికులకు జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలి. వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖగా ఉన్న పేరును వ్యవసాయం, రైతులు, వ్యవసాయ కార్మిక సంక్షేమ శాఖగా మార్చాలి. పంటల సేకరణ పరిమితంగానే ఉన్నందున కనీస మద్దతు ధరలను కేవలం ఆరుశాతం మంది రైతులు మాత్రమే 2021-22లో లబ్ది పొందినట్లు తేలింది. చట్టబద్ద హామీ ఉంటే ఎక్కువ మంది లబ్ది పొందుతారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఎంఎస్‌పి నిర్ణయించాలి. బలహీనమైన మార్కెట్ సంబంధాలు ఉన్న రాష్ట్రాలలో రైతులు ఎంఎస్‌పి కంటే తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పిస్తే ప్రభుత్వం మీద భారం పెరుగుతుంది. మొత్తం 23 పంటలకు అమలు జరపాలంటే ఏడాదికి ఆరులక్షల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడి కావాలి. కనీస మద్దతు ధరలు పెంచితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది, వినియోగదారులకు ధరలు పెరుగుతాయి. గోధుమలు, బియ్యానికి ఒక శాతం కనీస మద్దతు ధర పెంచితే చిల్లర ధరలు 0.22శాతం పెరుగుతాయి. రాష్ట్రాలలో ఉన్న పరిస్థితిని బట్టి ప్రత్యేక విధానాలను రూపొందించాలి. చట్టబద్ధత కల్పిస్తే ప్రైవేటు వ్యాపారులు ఆధరలకు కొనేందుకు ముందుకు రారు, ప్రభుత్వమే కొనాల్సి ఉంటుంది. నీరు ఎక్కువగా అవసరయ్యే వరి, గోధుమ, చెరకు వంటి పంటల ధరలకు చట్టబద్ధత కల్పిస్తే భూగర్భ జలాల వాడకం ఎక్కువ అవుతుంది, భూసారం దిగజారుతుంది. చట్టబద్ధత కల్పించటం ప్రపంచవాణిజ్య సంస్థ నిబంధనకు విరుద్ధం, మొత్తం వ్యవసాయ ఉత్పత్తి విలువలో పదిశాతానికి మించి సబ్సిడీలు ఇవ్వటానికి ఉండదు. బియ్యం ఎగుమతులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను మద్దతు ధరలతో ప్రోత్సహించాలి. పార్లమెంటరీ కమిటీ చేసిన ఈ సిఫార్సులలో అదియును సూనృతమే ఇదియును సూనృతమే అన్నట్లుగా ఉన్నాయి, కానీ ప్రతికూలంగా ఉన్న అంశాలను మాత్రమే పట్టించుకొని అనుకూలంగా ఉన్నవాటిని విస్మరించటం రైతాంగం మీద ఉన్న కక్ష, వివక్షగాక మరేమిటి ?





- ఎం కోటేశ్వరరావు

# యూఎస్ వ్యవస్థాపక పితామహుడు 'బెంజమిన్ ఫ్రాంక్లిన్'

స్వతంత్ర అమెరికా చరిత్రలో అత్యంత బహుముఖ ప్రతిభాశాలి, పేరెన్నికగల అమెరికా సంయుక్త రాష్ట్రాల "వ్యవస్థాపక పితామహుడు"గా బెంజమెన్ ఫ్రాంక్లిన్ ప్రపంచవ్యాప్త ఖ్యాతిని పొందారు. ఒక సాధారణ వ్యక్తి ఎలాంటి పై చదువులు చదవకుండానే అనేక రంగాల్లో తన ప్రతిభను ప్రదర్శించారు. కవి, రచయిత, పబ్లిషర్, ప్రింటర్, రాజకీయ తత్వవేత్త, సామాజిక చైతన్యశీలి, దౌత్యవేత్త, శాస్త్రవేత్త, సంగీత విద్వాంసుడు, మ్యాప్‌మేకర్, ఆవిష్కర్త, రాజకీయవేత్త, పోస్ట్‌మ్యాన్ అయిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ అమెరికా చరిత్రలో చెరగని ముద్ర వేశారు. 1776లో బ్రిటన్ వలసపాలనలో ఉన్న 'అమెరికా స్వాతంత్ర్య ప్రకటన' రచనా కమిటీ ఐదుగురిలో ఒక సభ్యుడిగానే కాకుండా మరో నాలుగు ముఖ్యమైన పత్రాలపై సంతకం చేసిన ఘనుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్.

**సాధారణ జీవితంతో అసాధారణ సాఫల్యత:**

17 జనవరి 1706న ఒక సాధారణ సబ్బులు-కొవ్వత్తులు తయారు చేసే కుటుంబంలో జోసియ్య ఫ్రాంక్లిన్-అభిషా ఫోల్గర్ దంపతులకు పదవ సంతానంగా జన్మించారు. తన 10వ ఏటనే బడికి వెళ్ళడం మానేసి తండ్రికి సహాయకుడిగా సబ్బులు, కొవ్వత్తుల తయారీలో చేయూతను ఇచ్చారు. అలాంటి ఒక అతి చిన్న స్థాయి నుంచి స్వయంకృషితో ఎదిగి అమెరికాలో ఎవరూ సాధించలేని అసాధారణ ఉన్నత స్థాయికి చేరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. స్వతంత్ర యూఎస్ ఉనికికి, మనుగడకు గట్టి పునాదులు బెంజమెన్ ఫ్రాంక్లిన్ పుట్టిన రోజు 17 జనవరి నాడు "బెంజమెన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం"గా ప్రతి ఏట నిర్వహించడం సముచితంగా ఉన్నది.

**బెంజమెన్ ఫ్రాంక్లిన్ బహుముఖీన ప్రతిభ:**

## రీతి-ఖ్యాతి

వైజ్ఞానిక శాస్త్ర రంగంలో 'లైటెనింగ్ రాడ్', 'బైఫోకల్ కళ్లఅద్దాలు', 'ఫ్రాంక్లిన్ స్టౌవ్' లాంటి పలు ఉపకరణాలను కనుకొన్నారు. నేటి ఎలక్ట్రానిక్ రంగం మనం నిత్యం వాడుతున్న పదాలు 'బ్యాటరీ', 'చార్జ్', 'కండక్టర్', 'ఎలక్ట్రిఫై' లాంటి ప్రధాన పదాలను ప్రవేశ పెట్టిన ఘనత బెంజమెన్ ఫ్రాంక్లిన్‌ది మాత్రమే. ఇవే కాకుండా 'స్విమ్ ఫిన్స్', 'ఫ్లెగ్జిబుల్ కాతెటర్', 'గ్లాస్ అర్మోనికా', 'లాంగ్ ఆర్మ్', '24-గంటల గడియారం' లాంటి పలు పరికరాలను ఆవిష్కరించారు. 'అమెరికన్ ఫిలాసాఫికల్ సొసైటీ' స్థాపకుడిగా చరిత్రలో నిలిచారు. విద్యారంగంలో 'లైబ్రరీ కంపెనీ ఆఫ్ ఫిలడెల్ఫియా'తో పాటు 'ఫిలడెల్ఫియా యూనివర్సిటీ' స్థాపనకు ప్రేరణగా నిలిచిన ఫ్రాంక్లిన్ సామాజికశాస్త్ర రంగంలో 'ఫిలడెల్ఫియా ప్రతినిధి'గా సేవలు అందించి, ఫ్రాన్స్‌కు తొలి అమెరికా రాయబారిగా అనుభవం గడించారు. అమెరికా తొలి 'పోస్ట్‌మ్యాన్ జనరల్'గా, మరణానంతరం తొలి పోస్టల్ స్టాంప్‌పై బెంజమెన్ ఫ్రాంక్లిన్ ఫోటో ముద్రించడం జరిగింది. పలు పుస్తకాల రచయితగా నేటికీ తన రచనలతో మార్గనిర్దేశనం చేస్తున్న బెంజమెన్ ఫ్రాంక్లిన్ నేటి అభివృద్ధి చెందిన అమెరికాకు గట్టి పునాదులు వేశారు.



సాంప్రదాయ విద్యాభ్యాసం చేయకుండానే ఒక వ్యక్తి ఇన్ని రంగాల్లో ప్రపంచ ప్రఖ్యాత స్థాయి వ్యక్తిగా ఎదగడం నమ్మశక్యంగా ఉండదు. తన 84వ ఏట 17 ఏప్రిల్ 1790న తుది శ్వాస విడిచిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా విశ్వ యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నది. బెంజమెన్ ఫ్రాంక్లిన్ సూచనలతో పలు నగరాలు, విద్యాలయాలు, యూనివర్సిటీలు, దేశాలు, కార్పొరేషన్లకు పేర్లను ఖరారు చేయడం జరిగింది. స్వతంత అమెరికా వ్యవస్థాపక పితామహుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం మనందరికీ దారి దీపం కావాలని కోరుకుందాం, వారి జీవితం నుంచి ప్రేరణను పొందుదాం.



- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
+919949700037

**(17 జనవరి "బెంజమిన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం" సందర్భంగా)**

## నూతన క్రాంతిని నిర్మిద్దాం

బంధాల మధ్య
అపార్థాలు
అవమానాలు గోడలపై
అంటిన మరకల
లాంటివి

వాటిని అనురాగం
ఆప్యాయత అనే కొత్త
రంగులు అద్ది
పూరించవచ్చు

అవగాహన ఆర్ధతతో
కడిగేయవచ్చు
బంధాలు అనుబంధాల
గోడల్లో రక్షించవచ్చు

మమత సమతతో
సంతోషాలను
సంబరాలను
పండించ వచ్చు

శాంతి సహనం
సమన్వయము
సౌహార్దత
బహుమానాలతో
భంధాలను
భలోపేతం చేద్దాం

సౌభ్రాతృత్వం
సంఘీభావానికి
బాటలు వేద్దాం

పగలు ప్రతీకారాలకు
చరమగీతం పాడుదాం

ద్వేషాన్ని ప్రేమగా
విరోధాన్ని స్నేహంగా
చీకటిని వెలుతురుగా
మార్చుదాం

ఈర్ష్య ద్వేషాలను
విడనాడి
ప్రేమానురాగాలను
పండిద్దాం

సహనం పాటిస్తే
సమస్తం పొందగలం
అసహనం చూపిస్తే
ఒంటరిగా మిగులుతావు

ఒంటరితనం వదులుకో
కలిమిడితనం పెంచుకో
మానవీయ పరిమళాలతో
సమాజంలో నూతన
క్రాంతిని నిర్మిద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు,
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్, 9440245771

# కెస్లాపూర్ నాగోబా జాతర

నాగోబా జాతర ప్రపంచంలోని అతి పెద్ద గిరిజన జాతరల్లో ఒకటి. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతరలో సర్ప జాతిని పూజించడమే పండగ ప్రత్యేకత. ఈ అమావాస్య రోజు తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేష నారాయణ మూర్తి) పురి విప్పి నాట్యమాడు తాడని గిరిజనుల నమ్మకం. అమా వాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడనీ, వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్య మవుతాడని గిరిజనులు విశ్వసి స్తారు. ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా గోండుల దేవత. నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. కెస్లాపూర్‌లో జరిగే ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కెస్లాపూర్ జనాభా 400కు మించదు. కాని పండగ నాడు లక్షలాది మందితో అది జనారణ్యంగా మారుతుంది. జనవరి 18 నుంచి 24 వరకు నిర్ణీత రోజుల పాటు గిరిజనులు ఈ పండుగ జరుపు కుంటారు. ఏటా పుష్యమాస అమావాస్య రోజున జాతర ప్రారంభ మవుతుంది. నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, శాంతి విరాజిల్లుతుందని, రోగాలు మటుమాయమ వుతాయని గిరిజనుల నమ్మకం. నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పు కుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయి



మోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుం పూరైందని చెపుతారు. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్ఠలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చు కోమనగా గౌరి సంప్రదాయాలను లెక్క చేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తరువాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతని కోసం వెతికిన గౌరి గోదావరి లోనే సత్యవతి గుండంలో కలిసి పోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్లి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడు సన్నిధిలో పరిచయం చేయాలని (పేఠికొరి యాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లి పోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారి పోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా పుష్య మాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమవుతాడని గిరిజనుల నమ్మకం. నాగోబా దేవతకు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్క, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలో వస్తారు.



- సంగనబట్ల

# గురుకుల దివ్యాంగ గురువుల సమస్యలు

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ. ఎస్టీ. బీసీ. మైనారిటీ. గురుకులాలలో పనిచేస్తున్న దివ్యాంగులైన గురువుల యొక్క సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సందర్భంగా పరిష్కరించాలని గురుకుల దివ్యాంగులైన గురువుల మనవి.

నైట్ స్టడీ డ్యూటీల నుండి మినహాయించాలి. టీచింగ్ డైరీ రాయడం నుంచి మినహాయించాలి. హౌస్ మాస్టర్ డ్యూటీలో నుండి మినహాయించాలి. డిప్యూటీ వార్డెన్ డ్యూటీలో నుండి మినహాయించాలి. 2025 ఆగస్టు 7 వ తేదీన తీసిన జీవ 34 ప్రకారంగా ఉద్యోగ దివ్యాంగులకు బదిలీలు. డిప్యూటేషన్ వారు కోరుకుంటేనే చేయాలి. వారు అనుకూలమైన ప్రాంతంలో విధులు నిర్వహించే విధంగా చూడాలి. హాలిడే డ్యూటీల నుండి మినహాయించాలి. రీడర్ అలవెన్స్ దృష్టిలోపంకలిగిన అంధులైన లెక్చరర్స్, టీచర్స్ కు ప్రస్తుతం ఇస్తున్న మొత్తం ను పెంచాలి. ఇతరుల కన్న 10 సెలవులను దివ్యాంగులైన గురువులకు పెంచాలి. అందుబాటులో ఉన్న గృహ వసతి క్వార్టర్స్ ఉచితంగా కేటాయించాలి. ఉచిత రవాణా సౌకర్యం. ఉచిత ఆరోగ్య వైద్య సదుపాయాలు కల్పించాలి. దివ్యాంగులకు ఒక సంవత్సరం లో మిగిలిన సెలవులు లెక్కించి మరో సంవత్సరంలో వారికి అవసరం వచ్చినప్పుడు వాడుకొనే విదంగా ఆదేశాలు జారీ చేయాలి. ప్రమోషన్ లలో దివ్యాంగులకు రిజర్వేషన్ ప్రాధాన్యత కలిపించాలి.



- డాక్టర్. ఈదునూరి. వెంకటేశ్వర్లు,
+91 9966336457



# జాతీయం-అంతర్జాతీయం



## ఇరాన్ గగనతలం మూసివేత?

**ఎయిరిండియా, ఇండిగో అడ్వైజరీ**




హింసాత్మక నిరసనల నేపథ్యంలో వాణిజ్య విమానాల రాకపోకలకు ఇరాన్ గగనతలాన్ని మూసివేసింది. దీంతో భారత విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. ఉద్రిక్తతల దృష్ట్యా కొన్ని విమానాలను దారి మళ్లిస్తున్నామని, కొన్ని సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఇరాన్ దుగా వెళ్లాల్సిన కొన్ని విమాన సర్వీసులను దారి మళ్లిస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలు సాధ్యం కాని కొన్ని విమాన సర్వీసులను రద్దు చేస్తున్నాం. ప్రయాణికులు అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. ఈ అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. కానీ.. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం'' అని ఎయిరిండియా సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించింది. మరో విమానయాన సంస్థ ఇండిగో కూడా ఇదే తరహా అడ్వైజరీ జారీ చేసింది. ఇరాన్ గగనతలం మూసివేయడంతో కొన్ని అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడిందని తెలిపింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు సక్షిస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో సర్వీసులు నడుపుతున్నామని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులు తమకు సహకరించాలని కోరింది.

## అలా భూమిని చేరడం ఇదే తొలిసారి



నాసా యొక్క క్రూ 11 బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి భూమికి తిరిగి చేరింది. ఒక వ్యోమగామి ఆరోగ్య సమస్యను ఎదుర్కొవడంతో ఈ మిషన్ చేపట్టినట్లు నాసా పేర్కొంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యొక్క 25 సంవత్సరాల చరిత్రలో వ్యోమగాములు ఆరోగ్య కారణాల వల్ల భూమికి తిరిగి రావడం ఇదే మొదటిసారి. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.11 గంటలకు కాలిఫోర్నియా తీరంలోని సముద్రంలో వారు సురక్షితంగా దిగారు. ఎలోన్ మస్క్ యొక్క స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక సహాయం కోసం అక్కడ ఉంది. ఈ చారిత్రాత్మక ల్యాండింగ్‌ను నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది. మిషన్ కమాండర్ సేనా మరియా కార్డ్‌మాన్, మిషన్ పైలట్ మైక్ ఫింకే (నాసా), మరియు మిషన్ స్పెషలిస్ట్‌లు కిమియా యుయి (జపాన్) మరియు ఒలేగ్ ప్లాటోనోవ్ (రష్యా) లతో కూడిన బృందం తిరిగి వచ్చింది. గత ఆగస్టులో స్టేషన్‌కు చేరుకున్న బృందంలో ఒకరికి ఆరోగ్య సమస్య ఉంది. అనారోగ్యంతో ఉందో లేదా అనారోగ్యం ఏమిటో అనే వివరాలు నాసా వెల్లడించలేదు.

## థాయిలాండ్‌లో కూలిన మరో క్రేన్



థాయిలాండ్‌లో మరో క్రేన్ కూలిపోయింది. ఈ ఘటనలో రెండు వాహనాలు ధ్వంసం కాగా, ఇద్దరు వ్యక్తులు మరణించారని గురువారం పోలీసులు తెలిపారు. క్రేన్ ప్రమాదంలో 32 మంది రైలు ప్రయాణికులు మరణించిన 24 గంటల్లోనే మరో క్రేన్ కూలడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది. తాజా సంఘటన రాజధాని బ్యాంకాక్ సపంలోని సముత్ సఖోన్ ప్రావిన్స్‌లో జరిగింది. అక్కడ ఎలివేటెడ్ హైవే నిర్మాణంలో పాల్గొన్న ఒక క్రేన్ రోడ్డుపై పడిపోయిందని స్థానిక జిల్లా పోలీస్ స్టేషన్ సూపరింటెండెంట్ పోలీస్ కల్నల్ సిత్తిపోర్న్ కాసి తెలిపారు. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు కూడా గాయపడ్డారని మరో పోలీసు అధికారి రాయిటర్స్‌తో చెప్పారు. థాయిలాండ్‌లో నిర్మాణ ప్రాజెక్టుల వల్ల సంభవించిన ప్రాణాంతక ప్రమాదాల శ్రేణిలో ఇది తాజాది. బుధవారం ఈశాన్య నఖోన్ రాట్చసిమా ప్రావిన్స్‌లో ఎలివేటెడ్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టులో పాల్గొన్న క్రేన్ కూలిపోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 32 మంది మృతి చెందడంతో పాటు, రైలులోని 195 మంది ప్రయాణికుల్లో 66 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోంది.

## దాడి చేస్తే ప్రతీకారమే
## ట్రంప్‌నకు ఇరాన్ హెచ్చరిక



తమ దేశంపై అమెరికా దాడి చేస్తే ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దీనితో వాషింగ్టన్ ఓ అడుగు వెనక్కి వేసింది. అమెరికా మధ్యప్రాచ్యంలోని వైమానిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని బుధవారం అమెరికా అధికారవర్గాలు ధ్రువీకరించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ ఎదుర్కొంటున్న దేశీయ అశాంతిని అణచివేయడానికి ఇరాన్ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారుల తరపున జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే బెదిరింపు ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అమెరికాకు గట్టి సమాధానం ఇచ్చేందుకు టెహ్రాన్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన ప్రాంతాల్లోని కీలక స్థావరాల నుంచి అమెరికా కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సైనిక జోక్యం జరిగే అవకాశం ఉందని యూరోపియన్ అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో దీనిపై ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని ఓ ఇజ్రాయిల్ అధికారి తెలిపారు. అయితే దాని పరిధి, సమయాన్ని స్పష్టంగా చెప్పలేదు.

## కామన్వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సు

### ప్రారంభించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ సంవిధాన్ సదన్‌లో కామన్వెల్త్ దేశాల స్పీకర్ల సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ప్రారంభించారు. గ్లోబల్ పార్లమెంటరీ లీడర్స్ 28 వ సదస్సుకు భారత్ నేతృత్వం వహిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలోపేతం అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ప్రధాని ప్రసంగిస్తూ ? ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి లాంటిదని.. భారత్ ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేసిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో పార్లమెంటరీ వ్యవస్థ మరింత పారదర్శకంగా తయారవుతుందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి గ్లోబల్ సౌత్, కామన్వెల్త్ దేశాలకు ఉపయోగపడుతుందన్న మోడీ.. కరోనా సంక్షోభ సమయంలో భారత్ ప్రపంచానికి మందులు, వ్యాక్సిన్లు సరఫరా చేసిందన్నారు. ప్రజాస్వామ్య సంస్థల బలోపేతానికి భారత్ కట్టుబడి ఉందని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కామన్వెల్త్ దేశాల స్పీకరులతో బిర్లా ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. కామన్వెల్త్ దేశాల సమాఖ్యలోని 42 దేశాల నుంచి దాదాపు 61 మంది స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. వీరితో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 4 పాక్షిక స్వయంప్రతిపత్తి కలిగిన పార్లమెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, బలోపేతంలో స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల బాధ్యత ఎంత ?. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్లమెంటరీ వ్యవహారాల్లో కృత్రిమ మేధను ఎలా వాడుకోవాలి ?. పార్లమెంట్ సభ్యులపై సామాజిక మాధ్యమాల ప్రభావం ఎలా ఉంది ?. చట్టసభల పనితీరుపై సామాన్యుల్లో అవగాహన పెంచడం ఎలా ?'' అంశాలపై సదస్సులో ప్రధానంగా చర్చించనున్నారు.

## ఆ అబద్ధాలు ఆపితేనే పాక్‌కు మంచిది

అంతర్జాతీయ వేదిక ద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాది దేశానికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. ఐరాస సమావేశంలో పాకిస్థాన్ శాశ్వత రాయబారి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. అతడి ఆరోపణలను భారత శాశ్వత మిషన్ కౌన్సిలర్ ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ ఖండించారు. తన అసత్య వాదనలు, విభజన అజెండాతో పాక్ అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగంగా ఉందని, ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. ఆ ప్రాంత ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్నారని తెలిపారు. జమ్మూకశ్మీర్ విషయంలో అనవసరమైన సూచనలు చేయాల్సిన అవసరం పాకిస్థాన్‌కు లేదన్నారు. ఈ విషయంలో పాక్ నిరాధారమైన ఆరోపణలు, అబద్ధాలను ప్రచారం చేయకుండా వాస్తవాలను గ్రహిస్తే మంచిదని హితవు పలికారు.

## ఏ భారతీయ కంపెనీకీ సాధ్యం కాదు

**అమెరికా సుంకాలపై థరూర్**



**న్యూఢిల్లీ:** ఇరాన్‌తో వ్యాపారం చేసే అన్ని దేశాల పైనా 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. అమెరికా విధిస్తోన్న సుంకాల వల్ల మన ప్రాంతీయ పోటీదారులతో పోలిస్తే భారత్ ఇప్పటికే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనివల్ల ఏ భారతీయ కంపెనీ కూడా అమెరికాకు 75 శాతం సుంకాలు చెల్లించి ఎగుమతి చేయడం సాధ్యం కాదన్నారు. భారత్‌అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందాలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు యూఎస్ రాయబారి సెర్గియో గోర్ సహకరిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. అమెరికా విధిస్తోన్న ఈ సుంకాలు ఆందోళనకరంగా ఉన్నాయని థరూర్ పేర్కొన్నారు. ఎందుకంటే ఇప్పటికే రష్యాతో వాణిజ్యం చేస్తున్నందుకు భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారని.. మళ్లీ ఇరాన్‌తో వ్యాపారం విషయంలో 25 శాతం సుంకాలు విధిస్తున్నారన్నారు. ఇన్ని టారిఫ్‌లను తట్టుకొని 75 శాతం సుంకాలతో అమెరికాకు మన ఉత్పత్తులను ఎగుమతి చేయడం ఆచరణీయం కాదన్నారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం విషయంలో ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

## బ్రిటన్ దౌత్యవేత్తను బహిష్కరించిన రష్యా



గూఢచర్యం ఆరోపణలతో మాస్కోలోని బ్రిటన్ దౌత్యవేత్తను దేశం నుంచి బహిష్కరించినట్లు రష్యా భద్రతాధికారులు వెల్లడించారు. మాస్కోలోని బ్రిటిష్ రాయబార కార్యాలయంలో కార్యదర్శిగా ఉన్న గారెత్ శామ్యూల్ డేవిస్ యూకేలోని రహస్య నిఘా సంస్థల కోసం పనిచేస్తున్నట్లు గుర్తించామని ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ పేర్కొంది. దీంతో రెండు వారాల్లోగా రష్యాను వీడి వెళ్లిపోవాలని ఆయనకు సమన్లు జారీ చేసింది. రష్యా భూభాగంలో ఉంటూ.. జాతీయ భద్రతా విషయాలను విదేశాల నిఘా సంస్థలకు చేరవేయడాన్ని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని రష్యన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ చర్యలకు ప్రతిగా పరిస్థితులను తీవ్రతరం చేయడానికి యూకే ప్రభుత్వం ప్రయత్నిస్తే.. ప్రతీకార చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. ఇప్పటివరకూ లండన్, రష్యా మధ్య ఉన్న స్నేహపూర్వక చర్యల కారణంగా సదరు దౌత్యవేత్తపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. కాగా 2025లోనూ ఇదే విధంగా గూఢచర్యం ఆరోపణలతో మాస్కో ఇద్దరు బ్రిటన్ దౌత్యవేత్తలను దేశం నుంచి సాగనంపింది.

## 52 మంది మావోయిస్టులు లొంగుబాటు



**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 52 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. లొంగిపోయిన 21 మంది మహిళలు సహా లొంగిపోయిన కార్యకర్తలు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్రఒడిశా బోర్డర్ డివిజన్, భమ్రాఘర్ ఏరియా కమిటీ (మహారాష్ట్ర) మావోయిస్టులలో చురుకుగా ఉన్నారని వారు తెలిపారు. "పూనా" మార్గెమ్ చొరవ కింద వారు ఇక్కడ సీనియర్ పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పీఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం (జనవరి 14, 2026) పొరుగున ఉన్న సుక్మా జిల్లాలో 29 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అంతకుముందు, జనవరి 8న పొరుగున ఉన్న దంతెవాడ జిల్లాలో 63 మంది మావోయిస్టులు లొంగిపోగా, జనవరి 7న సుక్మాలో 26 మంది కార్యకర్తలు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలోకి చేరారు. 2025లో రాష్ట్రంలో 1,500 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నుండి నక్సలిజాన్ని నిర్మూలించాలని కేంద్రం సంకల్పించింది.

## కోల్‌కతా బ్యాంకు మోసం కేసులో సీబీఐ సోదాలు




**కోల్‌కతా:** కోల్‌కతాలోని బ్యాంకు మోసం కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు వివిధ ప్రదేశాలలో గురువారం సోదాలు నిర్వహించారని అధికారులు తెలిపారు. నగరంలోని న్యూ అలిపోర్ ప్రాంతంలోని ఒక వ్యాపారవేత్త నివాసంలో, నగరానికి సపంలోని న్యూ టౌన్‌తో పాటు ఇతర ప్రదేశాలలో సోదాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏజెన్సీకి చెందిన ఐదు బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయని వారు వెల్లడించారు. దర్యాప్తుకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలు, ఇతర వస్తువులను సేకరించడం సమన్వయ ఆపరేషన్ లక్ష్యమని ఒక అధికారి తెలిపారు. ఆర్థిక మోసంలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వాటిని గుర్తించడం ప్రాథమిక లక్ష్యమని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకోవడానికి పెద్ద సంఖ్యలో కేంద్ర దళాల సిబ్బంది సీబీఐ అధికారులతో పాటు ఉన్నారని ఆయన తెలిపారు. కేసుకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం అందిన తర్వాత సోదాలు ప్రారంభించినట్లు అధికారి తెలిపారు.

## మహానగరంలో పులి మళ్లీ గర్జించలేదు




**ఇంటర్నెట్ డెస్క్ :** ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేనకు ముంబయి మహానగరం కీలకమైనది. దశాబ్దాల క్రితం ఇక్కడే బాల్‌ఠాక్రే సారథ్యంలో శివసేన ఆవిర్భవించింది. అనంతరం దేశ ఆర్థిక రాజధానిపై వారి హవానే కొనసాగింది. అయితే తాజా ఎన్నికల్లో ఉద్ధవ్‌కు ఆయన సోదరుడు రాజ్ అండగా నిలిచినా .. విజయం అందుకోలేక చతికిలపడింది. భాజపాశివసేన కూటమి ఘనవిజయం సాధించింది. ప్రస్తుత ఫలితాల సరళి ప్రకారం.. బీఎంసీలోని 227 వార్డుల్లో భాజపా, శివసేనలతో కూడిన మహాయుతి కూటమి 116 వార్డుల్లో ముందంజలో ఉంది. శివసేన (యూబీటీ) కూటమి 85 వార్డుల్లో ఆధిక్యం సాధించింది.

**ఉద్ధవ్ వైఖరితో నష్టం..**

బాల్‌ఠాక్రే ఉన్న సమయంలో భాజపాతో సత్సంబంధాలు ఉండేవి. ఉద్ధవ్ పగ్గాలు చేపట్టిన అనంతరం రెండు పక్షాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. తమకే మహారాష్ట్ర సీఎం పదవి కావాలని కోరడం..అందుకు కమలనాథులు అంగీకరించకపోవడంతో కూటమి విచ్ఛిన్నమైంది. అంతకు ముందే బాల్‌ఠాక్రే సోదరుడి కుమారుడైన రాజ్‌ఠాక్రే పార్టీ నుంచి వేరుపడి మహారాష్ట్ర నవ నిర్మాణ సేన ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అప్పుడే పార్టీ బలహీనపడింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాతో శివసేన కలిసి పోటీ చేసింది. అనంతరం కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి ఉద్ధవ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత పరిణామాల్లో శివసేన నుంచి ఏకనాథ్ శిందే ఫిరాయించి భాజపాతో చేతులు కలపడంతో ప్రభుత్వం పడిపోయింది. దీంతో శిందే సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ప్రాభవం తగ్గిపోయింది.

## గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి నాటో సహాయం చేయాలి

గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడంలో నాటో సహాయం చేయాలని , అమెరికన్ నియంత్రణ కంటే తక్కువ ఏదైనా ఆమోదయోగ్యం కాదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ చర్చల కోసం డానిష్ , గ్రీన్‌ల్యాండ్ అధికారులకు ఆతిథ్యం ఇవ్వడానికి కొన్ని గంటల ముందు పై విధంగా వ్యాఖ్యానించారు.ట్రంప్ తన సోషల్ డియా సైట్‌లో ఒక పోస్ట్‌లో.. అమెరికాకు ఉజాతీయ భద్రత కోసం గ్రీన్ల్యాండ్ అవసరం'' అనే తన వాదనను పునరుద్ఘాటించారు. ఉమనం దానిని పొందడానికి నాటో దారి చూపాలి'' , లేకుంటే రష్యా లేదా చైనా ఆధీనమే అంటూ పేర్కొన్నారు. ''గ్రీన్‌ల్యాండ్ యునైటెడ్ స్టేట్స్ చేతుల్లో ఉండటంతో నాటో మరింత ప్రభావవంతంగా మారుతుంది'' అని ట్రంప్ రాశారు. ఉఅంతకంటే తక్కువ ఏదైనా ఆమోద యోగ్యం కాదు.'' అని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా వెనక్కి తగ్గాలని గ్రీన్‌ల్యాండ్ నివాసితులు కోరుకుంటున్నారు. నూక్‌లోని ఇరుకైన, మంచుతో కప్పబడిన ప్రధాన వీధి వెంబడి, అంతర్జాతీయ జర్నలిస్టులు , కెమెరా సిబ్బంది ప్రతి కొన్ని టర్ల (అడుగుల) గుండా వెళ్ళేవారిని ఆపుతున్నారు. ఇది నాటో ముగింపునకు దారితీస్తుందని డెన్మార్క్ ప్రధాన మంత్రి హెచ్చరించిన సంక్షోభంపై వారు ప్రశ్నిస్తున్నారు.22 ఏండ్ల విద్యార్థిని టుటా మికాయెల్సెన్, నూక్‌లోని అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ, అమెరికన్ అధికారులు ఉవెనక్కి తగ్గేలా'' సందేశాన్ని పొందుతారని తాను ఆశిస్తున్నానని చెప్పారు.

## గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా ఫ్రాన్స్ రాయబార కార్యాలయం



గ్రీన్‌ల్యాండ్‌కి మద్దతుగా రాయబార కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు ఫ్రాన్స్ తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌కి మద్దతుగా ఫిబ్రవరి 6న అక్కడ తమ రాయబార కార్యాలయాన్ని ప్రారంభించనున్నామని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్‌నోయెల్ బారోట్ పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని అమెరికా నుండి పదేపదే వస్తున్న బెదిరింపుల నేపథ్యంలో ..ఆ దేశానికి మద్దతును ప్రకటించేందుకు ఇది ఒక నిర్దిష్ట చర్య కానుందని అన్నారు. సైన్యం జోక్యం చేసుకునే అవకాశం ఉందని సూచిస్తూ, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఫ్రాన్స్ డియాకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా పాలనకు, స్వాధీనంలో ఉండేందుకు, విలీనం కావడానికి గ్రీన్‌ల్యాండ్ ఇష్టపడదని అన్నారు. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) , యూరోపియన్ యూనియన్‌లో భాగమైన డెన్మార్క్ పరిధిలోనే ఉండాలని ఈ ద్వీపం ఎంచుకున్నట్టు స్పష్టం చేశారు.అమెరికా వ్యాఖ్యలు అసంబద్ధమైనవి అని పేర్కొంటూ.. ఒక నాటో సభ్యుడు మరో కరిపై దాడి చేయడంలో అర్థం లేదని అన్నారు. ఇటువంటి చర్య అమెరికా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. అంతర్జాతీయ చట్టాలు తుంగలో తొక్కుతున్నారని, 2026 ప్రారంభంలో దేశాల మధ్య సంబంధాలను ఇప్పుడు బలమైన చట్టం నియంత్రిస్తోందని స్పష్టంగా చూపించాయని అన్నారు. అమెరికా ఒత్తిడి దృష్ట్యా డెన్మార్క్‌కు సంఘీభావాన్ని ప్రకటించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఇటీవలి రోజుల్లో ఫ్రాన్స్ అధికారులు తమ డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ సహచరులతో చర్చలు జరిపారని అన్నారు.

## అన్ని ఎన్నికలలోనూ ఒంటరిగా పోటీ




లక్నో: వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలతో సహా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎన్నికలలో బహుజన్ సమాజ్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి అన్నారు. గురువారం ఆమె 70వ పుట్టినరోజు సందర్భంగా లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. చిన్నా పెద్దా అన్ని ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేయడం మరింత సముచితమని, ప్రస్తుత పరిస్థితిలో ఏ పార్టీతోనూ ఎలాంటి పొత్తు పెట్టుకోకూడదని నిర్ణయించుకుందని కూడా ఆమె వెల్లడించారు. ఏ ఇతర పార్టీ కూడా బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేయకపోవడమే ఈ నిర్ణయానికి కారణమని వివరించారు. భవిష్యత్తులో బీఎస్పీ అటువంటి ఓట్లను సమర్థవంతంగా బదిలీ చేయగలదని తాము పూర్తిగా నమ్మితే, కూటమి పార్టీలతో పోటీ చేయడం గురించి సానుకూల నిర్ణయం తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అయితే, దేశంలో అలాంటి పరిస్థితి ఏర్పడటానికి సంవత్సరాలు పడుతుందని మాయావతి అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు 2027లో బీఎస్పీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారని కూడా ఆమె పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆమె అన్నారు.

## ఐప్యాక్ సోదాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశం



**న్యూఢిల్లీ:** ఐప్యాక్ ఆఫీసులో సోదాలపై సుప్రీంకోర్టులో ఈడీ అధికారులకు ఊరట లభించింది. కొద్దిరోజుల క్రితం ఐప్యాక్ ఆఫీసులో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించగా.. ఆ సోదాలను వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారు. ఈడీ అధికారులు.. తమ నుంచి కీలక ఫైల్స్ ను తీసుకెళ్లినట్లుగా ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో బెంగాల్ సీఎం మమత, పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈడీ విధుల్లో జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై రెండువారాల్లో సమాధానమివ్వాలని ఆదేశాల్లో పేర్కొంది. అలాగే ఐప్యాక్ ఆఫీసులో సీసీపుటేజీని భద్రపరచాలని ఆదేశించింది. దాడుల సమయంలో తీసిన వీడియోలు ఉన్న సీసీటీవీ ఫుటేజ్ తో పాటు ఇతర స్టోరేజ్ పరికరాలను భద్రపరచాలని ప్రతివాదులను కోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వీ, దర్యాప్తు బలవంతపు చర్యలు లేకుండా కొనసాగించాలని కోర్టును కోరారు. అలాగే స్టే కొనసాగితే.. అవసరమైతే మరిన్ని దరఖాస్తులు దాఖలు చేసేందుకు అదనపు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈడీ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్ పై రెండు వారాల వరకూ స్టే విధించింది. బెంగాల్ డీజీపీని సస్పెండ్ చేయాలన్న ఈడీ పిటిషన్ పై విచారణ చేసిన సుప్రీంకోర్టు.. కేంద్ర హోంశాఖకు నోటీసులు పంపింది.

## కోల్‌కతా బ్యాంకు మోసం కేసులో సీబీఐ సోదాలు

కోల్‌కతా: కోల్‌కతాలోని బ్యాంకు మోసం కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు వివిధ ప్రదేశాలలో గురువారం సోదాలు నిర్వహించారని అధికారులు తెలిపారు. నగరంలోని న్యూ అలిపోర్ ప్రాంతంలోని ఒక వ్యాపారవేత్త నివాసంలో, నగరానికి సపంలోని న్యూ టౌన్‌తో పాటు ఇతర ప్రదేశాలలో సోదాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏజెన్సీకి చెందిన ఐదు బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయని వారు వెల్లడించారు. దర్యాప్తుకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలు, ఇతర వస్తువులను సేకరించడం సమన్వయ ఆపరేషన్ లక్ష్యమని ఒక అధికారి తెలిపారు. ఆర్థిక మోసంలో పాల్గొన్నట్లు




ఆరోపణలు ఎదుర్కొంటున్న వాటిని గుర్తించడం ప్రాథమిక లక్ష్యమని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకోవడానికి పెద్ద సంఖ్యలో కేంద్ర దళాల సిబ్బంది సీబీఐ అధికారులతో పాటు ఉన్నారని ఆయన తెలిపారు. కేసుకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం అందిన తర్వాత సోదాలు ప్రారంభించినట్లు అధికారి తెలిపారు.

# సిద్దిపేటలో సంక్రాంతి సంబురాల్లో హరీశ్ రావు



**వుదయం, సిద్దిపేట :**

సిద్దిపేటలో నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొని స్థానికులు, యువతతో కలిసి పతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారుసంక్రాంతి రైతుల పండుగ, అన్నదాతల పండుగ అని పేర్కొన్న హరీశ్ రావు.. మన పండుగల వెనుక సంప్రదాయంతో పాటు సైన్స్ కూడా ఉందన్నారు. సంక్రాంతి పూట గాలిపటాలు ఎగురవేయడం వల్ల శరీరానికి విటమిన్ డి లభించి ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వివరించారు.

చైనా మాంజా వల్ల ప్రాణ నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన హరీశ్ రావు, దానిని "కిల్లర్ మాంజా"గా పేర్కొన్నారు. నిషేధం ఉన్నా అక్రమంగా విక్రయాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎక్కడైనా చైనా మాంజా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఎంత ఎత్తుకు ఎదిగినా కుటుంబం, సమాజమే ఆధారం అని హరీశ్ రావు యువతకు సూచించారు. పతంగుల్లా జీవితాల్లో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం సిద్దిపేట పట్టణం 34వ వార్డులో యువతతో కలిసి సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్నారు. అలాగే చిన్న కొడుర్ మండలం గంగాపూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు హాజరై టాస్ వేసి ప్రారంభించారు. కొంతసేపు యువతతో కలిసి క్రికెట్ ఆడారు.

యువత అన్ని రంగాల్లో పోటీ పడాలని, క్రీడలు, చదువుల్లో రాణించాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటను క్రీడా హబ్‌గా అభివృద్ధి చేశామని తెలిపారు.

# ధర్మపురి అభివృద్ధికి సర్కార్ కట్టుబడి ఉంది

- అట్టహాసంగా కాంగ్రెస్‌లోకి గులాబీ నేతల వలస
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి అడ్లూరి
- ఈ నెల 20న డిప్యూటీ సీఎం భట్టి రాక.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఆధ్యాత్మిక కేంద్రంగా క్షేత్ర పునర్నిర్మాణం మంత్రి వెల్లడి





**ధర్మపురి, వుదయం :**

ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని,నియోజకవర్గ రూపు రేఖలు మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు మేళతా లలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నేను కార్యకర్తగా, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా కొనసాగుతున్న నాకు జెడ్పిటిసి సభ్యుడిగా,జిల్లా పరిషత్ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్ గా క్యాబినెట్ మంత్రిగా కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించిందని మంత్రి తెలిపారు.నియో జకవర్గంలో కాంగ్రెస్ హవా కొనసా గుతోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలు సాగుతున్నాయని మంత్రి తెలిపారు.బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మాజీ కౌన్సిలర్లు అయ్యోరి.వేణు,యూనుస్,సాంబు,కొమురయ్య, సయ్యద్. అలీమ్, రమేష్ పలువురు సహా వందలాది మంది కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది.ఇప్పటికే నియోజకవర్గం లోని149 గ్రామాల్లో 108 మంది సర్పంచులను గెలిపించుకున్నాం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ధర్మపురి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.ధర్మపురి అభివృద్ధికి అంకురార్పణ చేస్తూ ఈ నెల 20న రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇక్కడ పర్యటించనున్నారని మంత్రి వెల్లడించారు.

ఈ పర్యటనలో భాగంగా డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాల నిర్మాణానికి, గోదావరి సివరేజ్ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.2027లో జరగనున్న పుష్కరాల నాటికి ధర్మపురిని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు.బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి తీర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని,దానికోసం పలువురు మంత్రులతో కలిసి ప్రత్యేక కమిటీ వేసి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.ఎల్లంపల్లి ముంపు బాధితులకు అందాల్సిన రూ.18 కోట్ల పరిహారాన్ని త్వరలోనే పంపిణీ చేస్తామని,ధర్మపురి ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు

**నారాయణపేట టౌన్ , వుదయం:**



సంక్రాంతి సంబరాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు.మకర సంక్రాంతి పర్వదినాన రంగళ్లులుబంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో పల్లెలు కళకళలాడాయి.ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులు,మధ్యలో గొబ్బెమ్మల పసిడి కాంతి,

తలుపులపై మామిడి తోరణాల హరిత సౌందర్యం

ఇవన్నీ కలిసి మన సంప్రదాయ వైభవాన్ని

మరింత అందంగా,గర్వంగా ప్రతిబింబించారు.జంగమ దేవరుల జేగంటల నాదం,

హరిదాసుల కీర్తనల భక్తి రసం,డూడూ బసవన్నల ఆటపాటల ఆనందం... ఇవ న్నీ కలిసి మన తెలుగు సంస్కృతీ వైభవాన్ని లోకమంతా చాటారు.ఈ మకర సంక్రాంతి మీ జీవితాల్లో కొత్త వెలుగులు, కొత్త ఆశలు, కొత్త విజయాలు నింపాలని మన సారా కోరుకుంటూ ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపు కు న్నారు.

బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శుభా కాంక్షలు....

నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి

ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇల్లు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కొత్త ఆశలు కొత్త వెలుగులు మకర సంక్రాంతి జీవితాల్లో నింపాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

# మాచాపూర్ గ్రామస్తుల ఆవేదన



**వుదయం , సిద్దిపేట :**

సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామ చావడి వద్ద గ్రామ పెద్దలు, వృద్ధులతో మాజీ మంత్రి హరీష్ రావు ఆత్మీయంగా ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, కేసీఆర్ పాలనలో ఉన్న సంక్షేమం ఇప్పుడు కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.పెన్షన్లు పెంచకపోవడం, కొత్త పెన్షన్లు మంజూరు కాకపోవడం, రైతుబంధులో కోతలు, రుణమాఫీ పూర్తిగా అమలు కాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్ ఉండేదని, ప్రస్తుతం తరచూ విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎరువుల కొరత, బతుకమ్మ చీరలు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు నిలిచిపోయాయని గ్రామస్తులు పేర్కొన్నారు.గ్రామస్తుల మాటలను శ్రద్ధగా విన్న హరీష్ రావు, వారి సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తానని హామీ ఇచ్చారు. బోర్లకు సంబంధించి ఈ నెలలోనే టెండర్లు పూర్తయ్యేలా, నెల రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తలు చూపు

# టిఆర్ఎస్ వైపు

**మల్హారావు,వుదయం :**




తాడిచెర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని, వారి చూపు టిఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా తాడిచెర్ల ఎంపీటీసీ–1 పరిధి నుంచి దాదాపు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా టిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.తరతరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కుటుంబాలకు చెందిన ఈ యువ కార్యకర్తలు, ఇకపై కాంగ్రెస్‌లో కొనసాగలేమని స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. తాతలు, తండ్రుల కాలం నుంచే కాంగ్రెస్ జెండా మోసినా, తమకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని, కనీస గుర్తింపుకూడా దక్కలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అవసరాల సమయంలో తమ సేవలను వినియోగించుకొని, ఫలితాల ర్వాత మాత్రం తమను పక్కకు నెట్టేస్తున్నారని కాంగ్రెస్ నాయకత్వంపై ఆరోపణలు చేస్తున్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ఎన్నో ఏళ్లుగా కృషి చేసినప్పటికీ, స్థానిక నాయకత్వం నుంచి సరైన స్పందన లేకపోవడం, యువ కార్యకర్తలకు అవకాశాలు కల్పించకపోవడం వల్ల తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో కీలకంగా పనిచేసిన కార్యకర్తలను విస్మరించడం పార్టీపై నమ్మకం కోల్పోయేలా చేసిందని వారు పేర్కొన్నారు.

గ్రామంలోని కొందరి సీనియర్ నాయకుల ప్రవర్తన తో యువ నాయకులు మనస్థాపన చెందినట్లు సమాచారం.మరోవైపు టిఆర్ఎస్ పార్టీ గ్రామస్థాయిలో కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో చురుకైన పాత్ర పోషిస్తోందని ఈ కార్యకర్తలు చెబుతున్నారు. కార్యకర్తల కృషికి గుర్తింపు ఇవ్వడం, రాజకీయంగా ఎదగడానికి అవకాశాలు కల్పించడమే తమను టిఆర్ఎస్ వైపు ఆకర్షిస్తున్నదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ–1 పరిధి నుంచి దాదాపు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు త్వరలోనే టిఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశం ఉందని సమాచారం.

ఈ పరిణామం తో కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి, కార్యకర్తల వలసలు కొనసాగితే భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# మున్సిపల్ సమరానికి ధర్మపురి సిద్ధం

- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ఓటర్లకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి
- అధికారులకు కీలక ఆదేశాలు





**ధర్మపురి, వుదయం :**

రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది.ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ధర్మపురి పురపాలక పరిధిలోని పలు పోలిం గ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎన్నికల రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.గదుల్లో వెలుతురు,ఫ్యా న్లు,తాగునీరు,మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను పరిశీలించారు. ముఖ్యంగా వృద్ధులు,దివ్యాంగుల కోసం ఏర్పాటు చేయాల్సిన ర్యాంపుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని,ప్రతీ పోలింగ్ కేంద్రం ఎన్నికల నిబంధనలకు అనుగు ణంగా ఉండాలని స్పష్టం చేశారు.భద్రతపై రాజీ వద్దుఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణకు అత్యం త ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, అక్కడ అదనపు నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.అధికా రులు సమన్వయంతో పనిచేసి, ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్,శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్,

తహశీల్దార్ శ్రీనివాస్,ఎంపిడిఓ రవీందర్,రెవెన్యూ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

–ధర్మపురిలో నిర్మాణాల పరిశీలన

–జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**ధర్మపురి వు దయం:**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్ణీ త గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధి కారులను ఆదేశించారు.శుక్రవారం ధర్మపురి మండల కేంద్రంలో బేస్మెంట్,స్లాబ్ స్థాయిలో ఉన్న పలు నిర్మాణాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి,లబ్ధిదారు లతో మాట్లాడారు.ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు నిర్మించుకునే ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం రూ. 5 లక్షలు అందజేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇటుక, కంకర వంటి నిర్మాణ సామాగ్రి ధరలు పెరగకుండా, లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక బజార్ ద్వారా ఇసుక పొందేలా లబ్ధిదారులకు అవగాహ న కల్పించాలన్నారు.నిర్మాణ పను ల పురోగతిని బట్టి బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాల్లో జమ అవుతా యని స్పష్టం చేశారు.నిధుల కొరత ఉన్న లబ్ధిదారులు ఐకేపీ, మెప్మా సంఘాల ద్వారా రుణాలు పొందే వెసులుబాటు ఉందని తెలిపారు.వెనుకబడిన పనులను వెంటనే వేగవంతం చేసి, కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, హౌసింగ్ డీఈ భాస్కర్,తహశీల్ ల్దార్ శ్రీనివాస్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో టీజీమ్రేస్ అడ్మిషన్ల వెబ్‌సైట్,

# పోస్టర్ ఆవిష్కరణ




**వుదయం, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో 2026–27 విద్యాసంవత్సరానికి సంబంధించిన టీజీమ్రేస్ అడ్మిషన్ల వెబ్‌సైట్ మరియు పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు.ఈ వెబ్‌సైట్ ద్వారా సిద్దిపేట జిల్లా పరిధిలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌తో పాటు ఇతర తరగతుల బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అడ్మిషన్లు నేటి నుంచే ప్రారంభమయ్యాయని, అర్హులైన అభ్యర్థులు (టీజీమ్రేస్ తెలంగాణ. చాగ్. గోవిన్), వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, ఇది విద్యార్థులకు గొప్ప అవకాశంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్ఎల్‌సీ శ్రీమతి బహుమతి, విజిలెన్స్ అధికారి శ్రీ ఎం.డి. గౌస్ పాషా, సిద్దిపేట జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు విమల రెడ్డి (దుబ్బాక బాలురు–1), సుధారాణి (గజ్వేల్ బాలికలు–1), కిరణ్ కుమార్ (గజ్వేల్ బాలురు–1), శ్రీవాణి (సిద్దిపేట బాలికలు–1), సత్యలక్ష్మి (హుస్నాబాద్ బాలికలు–1), శ్రీనివాస్ (సిద్దిపేట బాలురు–1) తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## పురపాలిక ఎన్నికల రిజర్వేషన్లను

# పకడ్బందీగా ఖరారు చేయాలి

జిల్లా కలెక్టర్ బి.ఎమ్.సంతోష్

**గద్వాల ,వు దయం:**



పురపాలిక ఎన్నికల నిర్వహణకు ఆయా వర్గాల జనాభా, ఓటర్ల సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లను పకడ్బందీగా ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో పురపాలిక ఎన్నికల రిజర్వేషన్లపై జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ, బీసీ, తదితర వర్గాల ఓటర్ల సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు ఆయా మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా మహిళ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు వార్డుల వారీగా ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు,

ఇతర ప్రక్రియ మొత్తం నిర్దేశిత సమయం లోగా పూర్తి కావాలన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రిటర్నింగ్, ప్రిసైడింగ్, ఇతర అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది అదే మున్సిపాలిటీకి సంబంధించిన వారు కాకుండా ఇతర మండలాల వారిని తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు విధులు నిర్వర్తించే ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు జానకి రామ్ సాగర్, శంకర్ నాయక్, సైదులు, రాజయ్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకే తన జీవితం అంకితం

## క్యాతన్ పల్లి లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**రామకృష్ణాపూర్ ,వుదయం :**



క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధితోపాటు ప్రజలకు సేవ చేయడానికి తన జీవితం అంకితమైనట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వెంకటస్వామి తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మంత్రి వివేక్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పర్యటించారు.ఆ సందర్భంగా మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో 45 కోట్ల రూపాయల టి యు ఐ ఎఫ్ డి సి, సి ఎస్ ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేసారు.కాగా క్యాతన పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1,2,7,8,9,12,13,14,17 వార్డులలో రోడ్లు,డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయడంతో ఆ పనులను ప్రారంభించారు.ఆ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామితో పాటు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్,క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్ జి.రాజు, మందమర్రి ఎమ్మార్వో సతీష్ కుమార్ తో పాటు సంబంధిత అధికారులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,అక్కడి వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో బారీగా చేరికలు

**కోరుట్ల ,వుదయం :**

కోరుట్ల పట్టణ కల్లూరు రోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారత రాష్ట్ర సమితి పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణ 22వ వార్డుకు చెందిన టేకుల నరేష్ తో సహా 100 మంది యువకులు భారత రాష్ట్ర సమితి పార్టీ లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన భారత రాష్ట్ర సమితి పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు యువత భాగస్వామ్యంతో పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని అందుకే యువత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతుండటం హర్షణీయమన్నారు అనంతరం పార్టీలో చేరిన యువ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నాయకత్వం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తమను ఆకట్టుకున్నాయని తెలిపారు

## మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో

# ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

**గద్వాల ,వు దయం:**




మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో 2026–2027 విద్యా సంవత్సరంలో అర్హులైన విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ గురుకులాల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించిన గోడపత్రికలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఒక్కో గురుకుల పాఠశాలతో పాటు, గద్వాల నియోజకవర్గంలో ఎంపీసీ, బైపిసి కోర్సులతో కూడిన, అలంపూర్ నియోజకవర్గంలో సిఈసి, హెచ్ఈసి కోర్సుల జూనియర్ రెసిడెన్షియల్ కళాశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ఒక్కో కోర్సులో 40 సీట్లు చొప్పున విద్యార్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతితో పాటు, 6, 7, 8 వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీ విద్యార్థులతోపాటు ఇతర వర్గాల విద్యార్థులకు కొన్ని సీట్లు కేటాయించడం జరుగుతుందని అర్హులైన వారందరూ ఈనెల 18 నుంచి సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా డిప్ ద్వారా విద్యార్థులకు సీట్లను కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, ఆయా గురుకులాల ప్రిన్సిపల్స్ పార్వతి, ఎలిజిబెత్ సుహాసిని, రిజ్వానా, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

# గణితంలో ఆదుర్తి శ్రీవల్లికి పీహెచ్.డీ

**సంగారెడ్డి జిల్లా/ రుద్రారం వు దయం:**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఆదుర్తి శ్రీవల్లి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'మైక్రోఫ్లూయిడ్ అప్లికేషన్ల కోసం మైక్రోఛానల్ లో విద్యుదయస్కాంత ప్రవాహం యొక్క గణిత నమూనా, విశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోతాహర్ రెజా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన మైక్రోఛానల్లలో సంక్లిష్ట ద్రవాల యొక్క విద్యుదయస్కాంత హైడ్రోడైనమిక్ ప్రవాహాలపై సైద్ధాంతిక అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు. ల్యాబ్–ఆన్–చిప్ సిస్టమ్ లు, లక్ష్య ఔషధ పంపిణీ వంటి అధునాతన మైక్రోఫ్లూయిడ్ వినియోగానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు.

డాక్టర్ శ్రీవల్లి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సీఐఎస్ఎఫ్ కార్యాలయంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

**సంగారెడ్డి జిల్లా, భానూర్:**



తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" – తెలంగాణలో సురక్షిత రహదారుల కోసం ప్రచారం కార్యక్రమంలో భాగంగా బీడీఎల్ భానూర్‌లోని సీఐఎస్ఎఫ్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర వ్వహించారు. క్యాంపెయిన్‌లో భాగంగా కార్యక్రమాన్ని ప్రభుత్వ విభాగంలో నిర్వహించేలా సీఐఎస్ఎఫ్ కార్యాలయంలో అవగాహన సెషన్ రూపంలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బందికి రోడ్డు భద్రతా నియమాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై అవగాహన కల్పించారు.ప్రమాదాల నివారణకు హెల్మెట్/సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం నివారణ, లేన్ డిసిప్లిన్ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివ రించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది కార ్యక్రమ ంలో చురుకుగా పాల్గొని రోడ్డు భద్రతపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ఈ క్యాంపెయిన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# జిల్లాలో పర్యటించిన కేంద్ర ప్రభుత్వ బృందం

## కేంద్ర బృందంతో పాటు జిల్లా కలెక్టర్

**వరంగల్, జనవరి 16 (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జరిగిన నష్టం అంచనా వేసేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ బృందం శుక్రవారం వరంగల్ జిల్లాతో పాటు వరంగల్ నగరం జిడబ్ల్యుఎంసి పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. నలుగురు ప్రతినిధులు పొన్ను స్వామి, నిశాంత్ మిశ్రా, శశివర్దన్, రాహుల్ బఖేటి లతో కూడిన కేంద్ర బృందం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయి లతో కలసి వరంగల్ నగరంలోని ఎన్ ఎన్ నగర్, ఎన్టీఆర్ నగర్, మైసయ్య నగర్ , కాలనిలలో పర్యటించి క్షేత్ర స్థాయిలో నీట మునిగిన ఇండ్లు, గృహాలకు వాటిల్లిన నష్టం, వాహనాలు, ఇంటి సామగ్రి నష్టం, నీటి మునిగిన ట్రాన్స్ఫార్మర్స్, పడిపోయిన విద్యుత్ స్తంభాల ప్రాంతాలను కేంద్ర బృందం పరిశీలించి అధికారులకు, స్థానికులను తుఫాను వల్ల జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని చంద్రుగొండ, బొగ్గులకుంట తండా, దీక్ష కుంట గ్రామాల్లో తుఫాను ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్లు



కల్వర్టులు, బ్రిడ్జిలకు వాటిల్లిన నష్టం, నీట మునిగిన వరి పంట, దెబ్బతిన్న పంట పొలాలు పశువుల నష్టం, దీక్ష కుంటలో కూలిన ప్రభుత్వ పాఠశాల భవనం లను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. తుఫాను వల్ల వాటిల్లిన పంట నష్టం గురించి కేంద్ర బృందానికి స్థానిక రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ విజయలక్ష్మి , ఎన్ పిడిసిఎల్ ఎస్ ఈ గౌతమ్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలరాజు, ఆర్డీఓ సుమ, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి, జిడబ్ల్యు ఎంసీ ఎస్ ఈ సత్యనారాయణ, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి యూకే ఫౌండేషన్ ఆర్థిక సహాయం..

**రాయపర్తి, వుదయం ప్రతినిధి:**



మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనికి చెందిన ఐత దాసుబాబు కుమారుడు ఐత భగవాన్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం ఆయన చిత్రపటానికి యూకే ఫౌండేషన్ ఛైర్మన్ గారే వెంకటేష్ పూల మాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూకే ఫౌండేషన్ సభ్యులు గారే సందీప్, ఐత సాయిలు, ఐత యాకయ్య, ఐత కుమార్, ఐత సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**రాయపర్తి వుదయం ప్రతినిధి:**



మండలం పేర్కవేడు గ్రామంలో కనుమ పర్వదిన వేడుకలలో భాగంగా శ్రీ అమృత లింగేశ్వర మల్లికార్జున స్వామి వారిని మండల పార్టీ అధ్యక్షులు ఈదుల కంటి రవీందర్ రెడ్డి దర్శించుకుని, భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించి,ప్రత్యేక పూజలు చేసి, మండల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రాయపర్తి మండల ప్రజలందరికీ కనుమ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు, సంక్రాంతి పండుగ సాంప్రదాయాలు మన సంస్కృతి చిహ్నం, మల్లన్న స్వామి ఆశీస్సులతో పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మాజీ టీపీసీసీ సెక్రెటరీ బిల్లా సుధీర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లు తీగల సాయిలు, పెండ్లి మహేందర్ రెడ్డి బాలునాయక్ తండా సర్పంచ్ భూక్య సమ్మయ్య శ్రీదేవి,మండల ముఖ్య నాయకులు:- రెంటాల గోవర్ధన్ రెడ్డి,మాందాటి సుదర్శన్ రెడ్డి,వర్ధనపేట ఏఎంసీ డైరెక్టర్ పుల్లూరి దామోదర్, మండల మహిళా అధ్యక్షురాలు ఊగా మునిత, ఉప సర్పంచ్ దూరిశెట్టి రమేష్, సుతారి యాదగిరి, తీగల సాయిలు, ఇల్లందుల భగవాన్, ఐరెడ్డి ఎల్లారెడ్డి, కిషన్ నాయక్, గోపాల్ నాయక్, డీజేశ్రీను, సేనాధిపతి,ర హీమ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటన

**హనుమకొండ, జనవరి 16 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

అక్టోబర్ నెలలో మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపు, కోతకు గురైన రోడ్లు, కూలిన ఇండ్లను కేంద్ర అధికారుల బృందం హనుమకొండ జిల్లాలో శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన పంట నష్టం, రోడ్లు, విద్యుత్, ఇండ్ల నష్టం పై అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలోకేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ డైరెక్టర్ కె.పొన్నుస్వామి నేతృత్వంలో కేంద్ర బృందం పర్యటించింది. ముందుగా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామ ప్రధాన రహదారి వరద ధాటికి దెబ్బతిన్న రోడ్డును కేంద్ర అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు, స్థానికులను కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. రైతులు స్థానికులతో మాట్లాడి ఏయే పంటలకు ఎంత నష్టం వాటిల్లింది, ఎంత మేరకు రోడ్లు దెబ్బతిన్నాయనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను, స్థానికులను అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. వరద ధాటికి దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలకు సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం పరిశీలించింది. దేవునూరు నుండి ముప్పారం గ్రామం మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి సమీపంలో పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరి



శీలించారు. ముప్పారం గ్రామంలో భారీ వర్షాల కారణంగా తోట కమలమ్మకు చెందిన ఇల్లు కూలిపోగా ఆ ఇంటిని పరిశీలించి ఆ మహిళతో మాట్లాడారు. అక్కడనుండి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీలో వరదలకు దెబ్బతిన్న కాలువను పరిశీలించారు. కొప్పూరులో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హనుమకొండ సమ్మయ్య నగర్, గోపాల్ పూర్ ఊర చెరువు కట్ట, వరద ముంపునకు గురైన అమరావతి నగర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యు ఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర అధికారుల బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, ఆర్ అండ్ బి అధికారులు గోపికృష్ణ, ఉదయ్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండూరు శాలివాహన సంఘం సర్పంచ్ ని సన్మానం..

**రాయపర్తి వుదయం ప్రతినిధి:**



మండలంలోని కొండూరు గ్రామ సర్పంచ్ రాయినియాకన్న ని శాలివాహన సంఘం శాలువాతో ఘనంగా సన్మానించారు. శాలివాహన సంఘం అభ్యర్థన మేరకు సంఘానికి అవసరమైన ఇందిరమ్మ ఇండ్లు, శాలివాహనులకు కుండలకు అవసరమయినా మట్టి కోసం దేవుని కుంట 8 ఎకరాల 18 గుంటలు, సంఘ అవసరాలకు చిన్న, పెద్ద పండుగలు జరుపుకొనుటకు చిన్న ఫంక్షన్ హాల్ ఇప్పించగలరని సర్పంచ్ ని వినతి పత్రం ద్వారా తెలియజేశారు .వారు కూడా చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ అధ్యక్షులు కల్పగిరి జనార్ధన్, కల్పగిరి చిన్న ఎల్లయ్య, జనరల్ సెక్రెటరీ ఆకారపు సుధాకర్, ఏనుగుతల రాము,కోశాధికారి కల్పగిరి శ్రీను , సభ్యులు ఎల్లయ్య,సోమయ్య, ఉప్పలయ్య,వెంకటయ్య, సోమయ్య, సాంబయ్య, శోభ, అరుణ లు తదితరులు పాల్గొన్నారు.

# టి ఆర్ పి పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**భూపాలపల్లి జనవరి 16 వుదయం ప్రతినిధి**




తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదినం జనవరి 17 సందర్భంగా శుక్రవారం భూపాలపల్లిలో రవి పటేల్ నివాసం వద్ద టిఆర్పీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ స్థాయిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేయాలని పాల్గొన్నవారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ భూపాలపల్లిలో ప్రతి సంవత్సరం తీన్మార్ మల్లన్న జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ రక్తదానం ద్వారా అనేకమంది ప్రాణాలు కాపాడబడాలని కోరుకుంటున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో టిఆర్పీ పార్టీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపులు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మధ్య నిరంతరం ఉంటామని తెలిపారు. అన్ని దానాల్లో రక్తదానం అత్యంత గొప్పదని తీన్మార్ మల్లన్న ఎప్పుడూ ప్రేరణనిస్తూ ఉంటారని పేర్కొన్నారు. భవిష్యత్తులో భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని మరింత బలోపేతం చేస్తూ గడపగడపకు సేవా కార్యక్రమాలు చేపడతామని, 2028లో తెలంగాణరాజ్యాధికార పార్టీ అధికారంలోకి వచ్చి తీన్మార్ మల్లన్న బహుజనుల పక్షాన ముఖ్యమంత్రిగా పరిపాలన చేపడతారని రవి పటేల్ ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్పీ పార్టీ నాయకులు ఎస్‌పీ కే సాగర్, ఇనుగాల ప్రణయ్ రాజ్, పిట్టల వెంకటేష్, గంధం సతీష్, జినుకల శ్రీను, మడే సంతోష్, రొడ్డ శ్రీనివాస్, మేనం సంతోష్, పింగిడి శంకరయ్య, నవీన్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే తీన్మార్ మల్లన్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# మినీ మేడారం జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి జనవరి 16(వుదయం జిల్లా ప్రతినిధి):**




జిల్లాలో నిర్వహించనున్న మినీ మేడారం జాతరలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర శాఖల అధికారులతో మినీ మేడారం జాతరల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతర ప్రాంగణంలో పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, మరుగుదొడ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన త్రాగు నీరు అందించాలని ఆదేశించారు. జాతరలు జరిగే మార్గాల్లో రోడ్లకు ఇరువైపుల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, మూల మలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీఓలు జాతర జరిగే ప్రదేశాలను పరిశీలించి చేయా ల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతరలు నిర్వ హించే మండలాల్లో మండల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, భూపాలపల్లి మ ండలం లో క మ లా పూర్, గుర్రంపేట ప్రాంతాల్లో రెండు జాతరలు జరుగుతున్నందున ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మినీ మేడారం జాతరలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , సీపీఓ బాబురావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు సునీల్, బాబురావు, విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# జనం సాక్షి క్యాలెండరు ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల జనవరి 16 (వుదయం ప్రతినిధి)**



జనం సాక్షి దినపత్రిక నూతన క్యాలెండర్ను జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనం సాక్షి దినపత్రిక ప్రజాదరణ పొందుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుచుందని తెలిపారు. సామాన్య ప్రజల గొంతుకగా నిలిచి జనం సాక్షి పత్రిక విలువ కాపాడుతున్నదని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనం సాక్షి సీనియర్ రిపోర్టర్ పెద్ద ఇస్మాయిల్, టౌన్ రిపోర్టర్ సుదర్శన్ గౌడ్, సీనియర్ రిపోర్టర్ ముకుందరావు, రాజ్ న్యూస్ రిపోర్టర్ తీర్థ చారి, సూర్య రిపోర్టర్ సుధాకర్, ఓరుగల్లు రిపోర్టర్ రాఘవ గౌడ్, శ్రావ్య రిపోర్టర్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేత

**జయశంకర్ భూపాలపల్లి జనవరి 16 (వుదయం జిల్లా ప్రతినిధి):**



మహాదేవపూర్ మండలకేంద్రంలోని గడి హనుమాన్ దేవాలయం అవారణలో మకర సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహిళాలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు ముగ్గుల పోటి లో పాల్గొన్న మహిళలు విజేతలుగా గెలుపొందడంతో గెలుపొందిన విజేతలకు క్యాష్ ప్రైజ్ గా మొదట బహుమతి 2016 సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ చేతుల మీదుగా రెండవ బహుమతి1116/- ఉప సర్పంచ్ తుంగళ శ్రీజ సంతోష్, చేతుల మీదుగా మూడవ బహుమతి 516/- నాల్గవ బహుమతి516/- ఐదో బహుమతి 516/-రూపాయలను గ్రామపంచాయతీ వార్డు సభ్యుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు అదే క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రంథాలయజిల్లా చైర్మన్ కోట రాజబాబు, సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్, ఉపసర్పంచ్ శ్రీజ సంతోష్, తోపాటు గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులను శాల్వలతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు అస్రార్ ఖురేషి, పడాల రాజమౌళి, గడ్డం స్వామి, మహమ్మద్, నయిముద్దీన్, చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుతోట సుధాకర్, పోత రామకృష్ణ కదార్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# 3.90కోట్ల కుంభకోణం నిందితులు అరెస్ట్

## ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ అదాయానికి గండికొట్టిన 15 మంది నిందితుల అరెస్టు, మరో 9 మంది పరారీ

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ క్రైమ్, జనవరి 16 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్లలో 3.90కోట్ల రూపాయల కుంభకోణంలో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ ముఠా సభ్యుల నుండి పోలీసులు 63.19 లక్షల నగదు, బ్యాంక్లో 1లక్ష రూపాయలు, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్లు, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో వసునూరి బసవ రాజు, యాదాద్రి జిల్లా, జెల్లా పాండు, యాదాద్రి జిల్లా, మహేశ్వరం గణేష్ కుమార్, ఇయాదాద్రి జిల్లా, ఈగజుల పాటి శ్రీనాథ్, జనగామ, యెనగంధుల వెంకటేష్, జనగామ,కోదురి శ్రవణ్, జనగామ,కొలిపాక సతీష్ కుమార్, కొడకండ్ల (ఎం), జనగామ,తదూరి రంజిత్ కుమార్, నర్మెట్ట, జనగామ, దుంపల కిషన్ రెడ్డి, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, దశరథ మేఘావత్ , తుర్కపల్లి, నారా భాను ప్రసాద్, యాదగిరిగుట్ట, గొపగాను శ్రీనాథ్, యాదాద్రి జిల్లా ఒగ్గు కర్నాకర్ , యాదాద్రి జిల్లా, కమల్ల శివ కుమార్,అమంగల్, నల్లగొండ, అలేటి నాగరాజు, యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ ఈకుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో అన్లైన్ సర్వీస్ నిర్వహించేవారని, ఇందులో



నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను అన్ లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చేల్లించాల్సన మొత్తాన్ని ఏన్.ఆర్.ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించి అట్టి వసూలు చేసిన డబ్బు నుండి అన్లైన్ సర్వీస్ వ్యక్తులకు మరియు మధ్య వర్తులకు కమిషన్ చోప్పున డబ్బు అందజేస్తూ ఇ చాలాన్ని ప్రధాన నిందితుడుకి పంపిచేవాడన్నారు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు అట్టి ధరణీ /భూభారతీ వెబ్సైట్లో ఇన్ స్పెక్ట్ ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చాలన్ రుసుము తగ్గించేవాడని, అనంతరం అట్టి ఛలాన్ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడని, ఇదే క్రమంలో నిందితులు మొబైల్ ఆప్లికేషన్ ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుము కు సంబంధించి వెబ్సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించిన నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయములో మద్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మోసాలకు పాల్పడేవారన్నారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటుపడి జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మద్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారని, ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది శాతం నుండి 30శాతం వరకు కమిషన్ చెల్లించేవారన్నారు. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబంధించిన లావా దేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారరని, ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయని, ఇందులో జనగామ జిల్లాలో 7కేసులు, యాదాద్రి జిల్లాలో 15కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.ఈ ముఠా పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఎ.ఎస్పీ పండరి చేతన్, జనగామ ఇన్స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ్పల్లి సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఇతర ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి బారి చేరికలు

**వరంగల్ టౌన్, జనవరి 16 (వుదయం ప్రతినిధి):**



వరంగల్ నగరంలోని ఏనుమాముల బాలాజీ నగర్ లో వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు గారు మరియు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎండీ అయూబ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు నేడు అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ..ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ విధానాలపై విశ్వాసంతోనే బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరుతున్నారని, ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీని విడిచి పెట్టి కాంగ్రెస్ లోకి వస్తున్న ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక స్వాగతం తెలియజేశారు. భవిష్యత్తులో ఏనుమాముల బాలాజీ నగర్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో కొత్తగా చేరిన కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇంతియాజ్, పురాణం రవి, కడెం కుమార్, పస్తాం శంకర్, పత్రి రాజేష్ ముఖ్య నాయకులు అందరూ పాల్గొన్నారు.

# సిద్దిపేట గణేష్‌నగర్‌లో ఏకలవ్య విగ్రహ స్థాపనకు భూమి పూజ

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



సిద్దిపేట పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఏకలవ్య విగ్రహ స్థాపన కోసం ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఏకలవ్య సంఘం అధ్యక్షులు రాజేష్ ఖన్నా అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పాల్గొన్న సంఘ సభ్యులు, స్థానిక నాయకులు ఏకలవ్యుని త్యాగం, క్రమశిక్షణ, ఆత్మగౌరవం వంటి మహోన్నత విలువలను స్మరించుకున్నారు. ఏకలవ్య జీవితం సమాజానికి, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. గణేష్‌నగర్‌లో ఏకలవ్య విగ్రహం త్వరలోనే ఏర్పాటు కావాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఆకాంక్షించారు.ఈ భూమి పూజ కార్యక్రమంతో ఏకలవ్య విగ్రహ స్థాపన దిశగా ఒక కీలకమైన, చారిత్రాత్మక అడుగు పడిందని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడంపై పాల్గొన్న వారందరూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ నర్సింలు, మాజీ అధ్యక్షులు పోచయ్య, మజ్జి కౌన్సిలర్ దుర్గయ్య, సంతోష్, బీజేపీ సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు శ్రావణ్, రాజేందర్, శ్రీనివాస్, ఎన్టీఎఫ్ నేషనల్ ట్రైబల్ నాయకులు కెమ్మసారం అరుణ, సౌందర్య, వెంకట్, విజయ్, పెంటయ్య, సాత్విక్, చంద్రం, భగవాన్, రాజు, కరుణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**కరీంనగర్, జనవరి 16**

**(వుదయం ప్రతినిధి)**



కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యాంప్ కార్యాలయంలో గురువారం సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో అలంకరించగా, సిబ్బంది పండుగ వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసే ముఖ్యమైన పర్వదినమని తెలిపారు. వ్యవసాయం, ప్రకృతి, కుటుంబ బంధాల ప్రాధాన్యతను ఈ పండుగ ప్రతిబింబిస్తుంద న్నారు. అ ధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ ఆత్మీయంగా మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల మధ్య ఐక్యత మంచి వాతావరణం పెంపొందించేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భోగి–సంక్రాంతి–కనుమ పండుగల్లో మహిళల ముగ్గుల కళా వైభవం

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు అంటేనే మహిళలకు ఎంతో ప్రత్యేకమైన ఆనందం. పండుగ ఉదయాన్నే లేచి ఇంటి ముందు శుభ్రంగా చల్లి, రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పండుగ శోభను పెంచుతారు. నవధాన్యాలతో అమ్మవారిని తలుచుకుంటూ భక్తిశ్రద్ధలతో మహిళలు ముగ్గులు వేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ పండుగల సందర్భంగా మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ చక్కటి కళాత్మక ముగ్గులు వేస్తారు. కొందరు సంప్రదాయ శైలిలో, మరికొందరు ఆధునిక శైలిలో ఆకట్టుకునే విధంగా ముగ్గులు వేసి చూసేవారిని మంత్రముగ్ధులను చేస్తున్నారు. ముఖ్యంగా గొబ్బెమ్మలతో కూడిన ముగ్గులు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.పలువురు మహిళలు ముగ్గుల ప్రదర్శనల్లో కూడా పాల్గొని తమ కళకు గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అందమైన ముగ్గులతో మన్నన పొందుతూ, సమాజంలో మహిళల సృజనాత్మకతను చాటుతున్నారు. ఇంటి ముందు వేసే ఒక ముగ్గుతోనే పండుగ ఆనందం, ఆధ్యాత్మిక భావన, సంప్రదాయం అన్నీ కలిసివచ్చేలా మహిళలు పండుగలను మరింత వైభవంగా మార్చుతున్నారు. మహిళలు అంటేనే ఒక శక్తి. కుటుంబాన్ని, సంప్రదాయాలను కాపాడుతూ కళను, సంస్కృతిని తరతరాలకు అందిస్తూ పండుగలకు ప్రాణం పోస్తున్న మహిళల పాత్ర అపూర్వమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో విశ్వకర్మల పాత్ర కీలకం

**కరీంనగర్, జనవరి16**
**(వుదయం ప్రతినిధి)**



"విశ్వకర్మ బ్రాహ్మణులు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మల అభివృద్ధి, సంక్షేమం కోసం దాదాపు రూ.13 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. శుక్రవారం కరీంనగర్ లోని మొగ్దుంపూర్లో విశ్వబ్రాహ్మణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ ద్వార నిర్మాణపనుల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరై శంకుస్థాపన చేశారు. గత 11 సంవత్సరాల్లో భారత ప్రభుత్వం విశ్వకర్మ సమాజానికి చెందిన సంప్రదాయ వృత్తిదారుల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించిందన్నారు. స్కిల్ ఇండియా, డీడీయూ జీకేవై వంటి కార్యక్రమాల ద్వారా విశ్వకర్మలకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు బండి సంజయ్ 41 డివిజన్ వావిలాలపల్లి లో కరీంనగర్ జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అట్లాగే 46వ డివిజన్ లో కేబీ బ్యాంకెట్ హాల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ కార్పొరేటర్ బండారు వేణుతోపాటు స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# పాలమాకుల గ్రామంలో ప్రాచీన దత్తాత్రేయ స్వామి దేవాలయం

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో కొలువై ఉన్న దత్తాత్రేయ స్వామి దేవాలయం ప్రాచీన కాలం నుంచి విశేష మహిమలు కలిగిన ఆలయంగా పేరు గాంచింది. సిద్దిపేట జిల్లా పరిసర ప్రాంతాల్లో దత్తాత్రేయ స్వామి వెలసిన ప్రధాన ఆలయంగా ఈ దేవాలయాన్ని భక్తులు భావిస్తున్నారు. ఎంతో మహిమగల దేవుడిగా, భక్తుల కోరికలు తీర్చే స్వామిగా దత్తాత్రేయ స్వామిపై అపారమైన నమ్మకం ఉందని భక్తులు పేర్కొంటున్నారు.ప్రతి నిత్యం ఈ ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించబడుతున్నాయి. ఇప్పటివరకు చీకోటి వంశీకులు తరతరాలుగా నిత్య పూజలు చేస్తూ ఆలయ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా తేదీ: 18-01-2026 మాఘమాసంలో అమావాస్య రోజున నిర్వహించే జాతర ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ జాతరకు సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి కాకుండా పరిసర జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.జాతర సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించడంతో పాటు, వచ్చిన భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేపడుతుంటారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటూ తమ కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, ఉద్యోగం, విద్య వంటి కోరికలు కోరుకుంటారు. అనేక సందర్భా ల్లో తమ కోరికలు నెరవేరాయని భక్తులు ఆనందంతో వెల్లడిస్తున్నారు. ఇంతటి చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాచీన దేవాలయాన్ని రాష్ట్ర ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకుని మరింత అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆలయానికి వచ్చిన భక్తులు కోరుతున్నారు. ఆలయ సౌకర్యాల అభివృద్ధి, భక్తులకు మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఈ దేవాలయం మరింత ఖ్యాతిని పొందుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# నాగుర్ల పరామర్శ...

**పరకాల జనవరి 16 (వుదయం ప్రతినిధి)**



హనుమకొండ జిల్లా నడికుడా మండలం, నర్సక్కపల్లి గ్రామానికి చెందిన నాగూర్ల బాపూరావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగూర్ల వెంకటేశ్వర్లు నర్సక్కపల్లి గ్రామానికి చేరుకుని, స్వర్గీయ నాగూర్ల బాపూరావు పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నాగూర్ల బాపూరావు మృతి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి కుటుంబానికి పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం గెలుపు పై సంబరాలు

**కరీంనగర్, జనవరి 16**

**(వుదయం ప్రతినిధి)**



మహారాష్ట్రలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన నేపథ్యంలో ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం రాత్రి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు టపాసులు కాల్చి, బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మొన్న జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ 5గురు ఎమ్మెల్యేలను సీమాంచల్ ప్రాంతంలో గెలుచుకుందని, నేటి ఫలితాలలో మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో వందలాది కార్పొరేటర్ లను, కౌన్సిలర్లను గెలుచుకుందని, ఇదే ఊపును కొనసాగిస్తూ, రేపటి రోజున తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తెలంగాణ వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను కైవసం చేసుకుని సత్తా చాటుతుందని చెప్పారు ఎంఐఎం పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఏరాజకీయ పార్టీతో పొత్తు ఉండదన్నారు. సొంతంగా కరీంనగర్ పట్టణంలో పోటీ చేసి అత్యధిక కార్పొరేటర్ గెలుచుకొని మున్సిపల్ కార్పొరేషన్ పై ఎంఐఎం జెండా ఎగురవేస్తామన్నారు. ముస్లింల, దళితుల, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలకు తోడ్పాటు అందించడమే లక్ష్యంగా ఎంఐఎం పార్టీ కరీంనగర్లో గడచిన ఆరు సంవత్సరాలుగా విశేషమైన సేవలను, దారుస్సలాం వేదికగా అందిస్తుందన్నారు. ఒకే ఒక్క అవకాశాన్ని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో దళిత, బహుజన, బడుగులు, మైనారిటీలు అందరూ ఏకమై ఎంఐఎం పార్టీని అత్యధిక కార్పొరేటర్లను గెలిపిస్తే, కరీంనగర్ పట్టణాన్ని దేశంలోనే నెంబర్ వన్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతామన్నారు. కరీంనగర్ నగర వాసులకు అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి వంటి అన్ని పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చారు. ఈఒక్కసారి ఎంఐఎం పార్టీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని నగర ప్రజలకు వినబరపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మీద అబ్బాస్ సమీ, ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, ఖమరుద్దీన్, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, అలిబాబా, మొహసిన్ మోయిద్దిన్, అరిఫ్ అహ్మద్, సాజిద్, మజారోద్దీన్, సాజిద్ మజీద్, సమీ, జమ్మూ, అబ్దుల్లా అసిమ్ తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**లక్షెట్టిపేట, జనవరి 16 (వుదయం ప్రతినిధి):**



మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొప్పు తిరుపతి (44 ) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఎస్ఐ వివరాలు ఇలా ఉన్నాయి... మృతుని భార్య లక్ష్మికి గత పది సంవత్సరాల నుండి మానసిక పరిస్థితి బాగుండటం లేదని, ఆసుపత్రుల వైద్యులు ఇచ్చిన మందులు వాడిన మానసిక పరిస్థితి కుదుట పడకపోవడంతో మృతుడు తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిస అయ్యాడన్నారు. ఈనెల 15న సంక్రాంతి పండుగ ఉండగా చుట్టుపక్కల అందరూ సంతోషంగా కుటుంబ సభ్యులతో పండుగ జరుపుకుంటుండగా తన కుటుంబం మాత్రం ఇలా ఉందని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుని కుమారుడు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం రూ.1.80 కోట్ల మేజర్ డ్రైన్ నిర్మాణం

**బెజ్జూర్ జనవరి 16 ( వుదయం ప్రతినిధి)**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని కాపువాడలో స్థానిక ప్రజలు నిత్యం డ్రైనేజీ సమస్యలతో సతమతం అవుతున్నారు. సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మున్సిపల్ కమిషనర్ రాజేందర్ తో కలిసి శుక్రవారం కాపువాడలో డ్రైనేజీ సమస్య గురించి తెలుసుకున్నారు. రూ.1.80 కోట్ల అంచనాతో మేజర్ డ్రైన్ నిర్మాణం చేసి కాపువాడ డ్రైనేజీని మొత్తం మసాలా మోరీకి మళ్లించనున్నామని తెలిపారు. టెండర్ల ప్రక్రియ నడుస్తోందని, త్వరలోపనులు మొదలు పెడతామని తెలిపారు.

# అడుగుకో బెల్ట్ షాపు గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం.?

**జయశంకర్ భూపాలపల్లి జనవరి 16(వుదయం జిల్లా ప్రతినిధి):**



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోందని అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దందా జోరు పెరుగుతున్నదని గ్రామాల్లో మంచినీళ్లకైనా కొదవుటుందేమో కానీ, మద్యం మాత్రం ఎక్కడంటే అక్కడ దొరుకుతుందని ఎప్పుడో ఎలక్షన్లప్పుడో, కొన్ని సందర్భాల్లో నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్న సంబంధిత శాఖలు అధికారులు పట్టించుకోవడంలేదని వారి నిర్లక్ష్యంతోనే విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణలు కొనసాగుతున్నాయి అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహాదేవపూర్, పలిమేల,మహాముత్తారం, మండలాలలో ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన అధికారికంగా ఉన్న వైన్సులున్నాయి. వీటి ద్వారా మండలలో వినియోగదారులకు మద్యం సరాఫరా చేయాలి. అయితే వైన్సులకు వెళ్లలేనివారు, రాత్రి వైన్సులు లేని సమయంలో మద్యం అవసరం ఉన్నవారు బెల్టాపుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. వీరికి వైన్సు నిర్వహకులు కొండంత అండగా ఉంటున్నారని మీ దగ్గరికి ఎవరూ రారు మేము చూసుకుంటాం అని భరోసానిస్తు అందుకు గానూ ఒక్కో బీరుపై రూ.20, మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి 30 వసూలు చేస్తున్నారాని. బెల్ట్ షాప్ నిర్వహకులు వినియోగదారుల నుంచి ఒక్కో సీసాపై రూ.30-50 వసూలు చేస్తున్నారని బెల్ట్ షాపుల వద్ద మద్యం ప్రియులు చర్చించుకుంటున్నారు. బెల్ట్ షాపుల నిర్వహకులకు మద్యం అమ్మేందుకు వైన్సుల్లో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని సాధరణంగా వినియోగదారులకు ఇచ్చే కౌంటర్‌తో పాటు పక్కనే ప్రత్యేక షెట్టర్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారని బెల్ట్ నిర్వహకుల నుంచి అక్రమంగా వసూలు చేసుకుని ఎన్నంటే అన్ని కాటన్లు ఇచ్చేస్తున్నారని. వైన్ షాప్ నిర్వాహకులు ఇస్తున్న అండతో గ్రామాల్లో విచ్చలవిడి అమ్మకాలు యథేచ్చగా కొనసాగిస్తున్నారని పెద్ద గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో బెల్ట్ షాపులు ఉండగా చిన్న గ్రామాల్లో సైతం నాలుగైదు దుకాణాలలో మద్యం విక్రయిస్తున్నారని ప్రజలనుకుంటున్నారు. ఒకప్పుడు బెల్ట్ షాపులు గ్రామానికి రెండు మూడు భయంభయంగా నిర్వహించేవారు. కానీ నేడు విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారని. అయితే బెల్ట్ షాపులంటే మద్యం దుకాణాల్లా కనిపించవని గ్రామాల్లో ఉన్న కిరణాషాపుల్లోనే చాలావరకు మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని. ఏ రాత్రి వెళ్లినా వీరి వద్ద మద్యం లభిస్తుందని. ఎన్నికల సమయంలో అడపాదడపా దాడులు చేసే సంబంధిత శాఖ, అధికారులు మళ్లీ గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారీతిన అమ్మకాలు జరుగుతున్నాయని అధికారుల తీరుపై పలు రకాల ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.వైన్సులు రాత్రి వేళలో మూసివేశాక మందుబాబులు బెల్ట్ షాపుల్లో కొనుగోలు చేయడానికి వచ్చే సమయంలో ఆయా షాపుల పక్కనున్న కుటుంబాలకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్నారని బెల్ట్ షాపుల పరిధిలోని స్థానికులు అనుకుంటున్నారు. ఇదిలా ఉంటే కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బెల్ట్ షాపుల సంక్షేమ సంఘం ఏర్పాటుకు బెల్టు నిర్వాహకులు రూపకల్పన చేస్తున్నారని బెల్ట్ షాప్ నిర్వాహకులు అందరికీ ఏకతాటి పైకి తీసుకు వచ్చేందుకు జిల్లాలోని ఓ స్వచ్ఛంద సంస్థలోని ప్రముఖులు కార్యచరణ నిర్వహిస్తున్నారని కాటారం సబ్ డివిజన్ పరిధిలో ప్రచారం కొనసాగుతుంది వైన్ షాపుల నుండి బెల్ట్ షాపులకు మద్యం విక్రయించకుండా బెల్ట్ షాపులకు మద్యం విక్రయించే మద్యం షాపులపై చర్యలు తీసుకొని బెల్టాపులను నిర్మూలించి ప్రశాంతత కల్పించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# దంత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం



**బెజ్జూర్, జనవరి 16 (వుదయం ప్రతినిధి)**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో దంత వైద్య సేవలు అందించడానికి టీడీఎస్ఏ ముందుకురావడం అభినందనీయమని అన్నారు. గతంలో టీడీఎస్ఏ సంఘ ఆవిష్కరణ తన చేతుల మీదుగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లో జరిగిందని, ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలం గాణ డెంటల్ స్టూడెంట్ అసోసియేషన్ చైర్మన్ డా.మణిదీప్ బలుసాని, బెజ్జూర్ ప్రాథమిక ఆసుపత్రి డా.శ్రావణ్ కుమార్, డా.శ్రీనివాస్, డా.కీర్తి, సెక్రటరీ డా.సామల రసజ్ఞ, డా.హర్షిని, డా.సౌమ్య, డా.షఫియా, సర్పంచ్లు దుర్గం సరోజ తిరుపతి, కుమ్మరి రామకృష్ణ, ఉప సర్పంచ్ గూడ రాకేష్, మండల అధ్యక్షులు జాడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి సామల తిరుపతి, మాజీ ఎంపిపి కొండ్ర మనోహర్ గౌడ్, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు భాజపా పాల్గొన్నారు.

# ఇన్‌ఫ్లుయెంజా వ్యాధులు సంక్రమించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి: యశోద హాస్పిటల్ యాజమాన్యం

**నిర్మల్ జిల్లా 16 జనవరి 2026 (వుదయం ప్రతినిధి)**



ఫ్లూ (ఇన్‌ఫ్లుయెంజా) అనేది ఒక సాధారణ అంటువ్యాధి సంక్రమణ, వైరస్ వల్ల కలుగుతుంది. ఇది దగ్గు మరియు తుమ్ముల ద్వారా వ్యాపిస్తుంది.ఎదారిలో ఎప్పుడైనా ఫ్లూ సంక్రమించవచ్చు, కానీ సాధారణంగా శీతాకాలంలో సంభవిస్తుంది; అంతేకాకుండా దీనిని కాలానుగుణ (seasonal) ఫ్లూ అని కూడా పిలుస్తారు. ఇన్‌ఫ్లుయెంజా RNA వైరస్ పై కలిగిస్తుంది, ఇది ఊపిరితిత్తుల సంక్రమణకు (ఇన్‌ఫెక్షన్) కారణమవుతుంది.సాధారణ జనాభా అంతా ఇలాంటి వైరల్ సంక్రమణలతో పోరాడగలదు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్ తీవ్రమైన అనారోగ్యంతో పాటు 0.1% మరణ రేటును కూడా కలిగిస్తుంది. 65 ఏళ్ల పైబడిన పెద్దవారు మరియు 5 ఏళ్ల లోపు వయస్సు పిల్లలు ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వల్ల ప్రభావితమయ్యే ప్రమాదం ఎక్కువ. గర్భిణీ స్త్రీలు, గుండెరోగం లేదా బలహీనంగా ఉన్న వ్యక్తులు, ఆస్మా, సంక్రమణ కేంద్రంలో పని చేసేవారు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు కూడా ఇన్‌ఫ్లుయెంజా సంక్రమణ (ఇన్‌ఫెక్షన్) ఎక్కువ ప్రమాదంగా ఉంటుంది.దాని ప్రధాన సంకేతాలు మరియు లక్షణాలు ఏమిటి?మొదట్లో, ఫ్లూ ఒక తీవ్రమైన సాధారణ జలుబులా అనిపించవచ్చు. గొంతు నొప్పి, ముక్కు కారడం, మరియు తుమ్ములు వంటి సాధారణ లక్షణాలు ఉండవచ్చు. జలుబు మరియు ఫ్లూ మధ్య ప్రధాన తేడా ఏమిటంటే, ఫ్లూ జలుబులా కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతుంది.లక్షణాలు సాధారణంగా సంక్రమణ వ్యాపించిన 1 నుండి 3 రోజుల్లో అభివృద్ధి చెందుతాయి మరియు సాధారణంగా ఒక వారం లోపు లక్షణాలు తగ్గుముఖం పడతాయి.ఫ్లూ యొక్క లక్షణాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయి:★ 38°C (100.4°F) లేదా పైన ఉండే ఆకస్మిక జ్వరం★ గొంతు నొప్పి★ ఆకలి తగ్గుదల★ తలనొప్పి★ పొడి దగ్గు★ అలసరం★ వికారము★ ముక్కు దిబ్బడదీనికి ప్రధాన కారణాలు ఏమిటి?ఇన్‌ఫ్లుయెంజా వైరస్ పలు కలిగిన వైరస్ మరియు అది మూడు రకాలుగా ఉంటుంది – ఇన్‌ఫ్లుయెంజా ఏ (A), బి (B) మరియు సి (C). తరచుగా A మరియు B రకాలు, C రకం తో పోలిస్తే శ్వాస మార్గాలలో తీవ్రమైన సంక్రమణ (ఇన్‌ఫెక్షన్) కలిగిస్తాయి మరియు అధిక మరణ రేటును కలిగి ఉంటాయి.వైరస్ సంక్రమిత వ్యక్తి నుండి దగ్గు, తుమ్ములు లేదా మాట్లాడటం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. కనీసం, నేరుగా వైరస్ సంక్రమిత బిందువులను (droplets) పీల్చడం లేదా వైరస్ కలుషితమైన ఉపరితలాలను తాకడం వల్ల కూడా వైరస్ సంక్రమించవచ్చు. లక్షణాలు మొదలయ్యే ముందు కూడా సోకిన వ్యక్తులు బాగా సంక్రమకంగా (వ్యాధి వ్యాప్తి చేసేవారు) ఉంటారు (contagious) — మొదటి లక్షణం కనిపించే రెండు రోజుల ముందు నుంచే వారు సంక్రమకంగా ఉ ంటారు. ఇ న్ఫ్లుయెంజా వైరస్ కాలంతో పాటు సిరమ్యాన మార్పులను చెందుతుంటాయి, అంటే అవి మ్యూటేషన్ (mutation) చెందుతాయి. ఇది జీవితం కాలం పాటు వైరల్ ఇన్‌ఫెక్షన్ అవకాశాన్ని కలిగిస్తుంది.ఎలా నిర్ధారించాలి మరియు చికిత్స ఏమిటి?ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలి మరియు ఎక్కువ నీరు త్రాగాలి. పరీక్ష కోసం వైద్యులను కూడా సంప్రదించాలి.పాలిమరేస్ చైన్ రియాక్షన్ (polymerase chain reaction [PCR]), రాపిడ్ యాంటిజెన్ టెస్ట్ (rapid antigen test) లేదా ఇమ్యునోఫ్లోరెసెన్స్ అసే (immunofluorescence assay) వంటి పరీక్షలు మీ శ్వాస సంబంధిత నమూనాలను సేకరించి చేస్తారు.అప్పుడు, వైద్యులు యాంటీవైరల్ మందులను సూచిస్తారు. ఈ యాంటీవైరల్ మందులకు వికారం మరియు వాంతులు వంటి దుష్ప్రభావాలు ఉంటాయి.జ్వరం మరియు అసౌకర్యాన్ని తగ్గించేందుకు యాంటీపైరెటిక్ మందులు మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు సూచించబడతాయి. శిశువుల్లో అయితే, శిశువు శరీరంలో నీటి స్థాయి నిల్వచేందుకు తల్లి పాలివ్వడాన్ని పెంచాలి.

# నిర్మల్ "ప్రజా పాలన- ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నిర్మల్ జిల్లా 16 జనవరి 2026 (వుదయం ప్రతినిధి)**



నిర్మల్ ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే నాకు ప్రత్యేక అభిమానం అని జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు అందుకే పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇస్తానని చెప్పారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా అభివృద్ధి పథంలో సాగేది కానీ కారణాలు ఏవైనా ప్రాజెక్టులు పూర్తి కాలేదు. అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేస్తున్నాం ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు అయినా ఎవరికి వారు తమ ప్రాంతానికే రావాలనుకోవడంతో యూనివర్సిటీ ఏర్పాటు జాప్యమైంది. బాసర IIT లో యూనివర్సిటీకి ఏర్పాటు చేసుకుందాం ఇందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి సూచన చేస్తున్నా అని ఫిబ్రవరి మొదటి వారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షలు నిర్వహించాలని పెద్దలు సుదర్శన్ రెడ్డి గారికి సూచన చేస్తున్నా మీరు ఒక నివేదిక తయారు చేసి ఇవ్వండి... ఆదిలాబాద్ కు కావాల్సిన అభివృద్ధి, రావాల్సిన నిధులను మంజూరు చేసుకుందాం ఆదిలాబాద్ రైతాంగానికి నీళ్లు ఇవ్వాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాల్సిందే బడ్జెట్ సమావేశాల లోపు తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి సూచన చేస్తున్నా తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించుకుందాం.. ప్రతీ చుక్కను ఒడిసిపట్టుకుని ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసుకుందాం ఎర్రబస్సు తిరగని ఆదిలాబాద్ లో ఎయిర్ బస్ తిరిగేలా ఎయిర్ పోర్టును ఏర్పాటు చేసుకుందాం కేవలం ఎయిర్ పోర్టు ఒక్కటే ఏర్పాటు చేసుకుంటే సరిపోదు ఆదిలాబాద్లో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసుకుందాం పదివేల ఎకరాలు సేకరించి ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకుందాం ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసాక అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళదాం అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు... ప్రజలకు మంచి జరగాలన్నదే మా ఆలోచన ప్రజల కోసం.. ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలవడానికి వెనకాడను నేను పైరవీల కోసం ఎవరి దగ్గరకు వెళ్లను.. నాకు పర్సనల్ ఎజెండాలు లేవు ఆనాటి పాలకులు చేసిన అప్పులు.. ఉతితాడుగా మారి ప్రజల ఊపిరి తీసే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తా.. కేంద్రం నుంచి రావాల్సిననిధులను మంజూరు చేయించుకుందాం ఇందుకు బీజేపీ ప్రజా ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలి పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ఎజెండా ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నాం. సన్నాలకు బోనస్ అందిస్తున్నాం రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం.. ఆర్టీసీ బస్సులకు ఆడబిడ్డలని యజమానులను చేశాం మహిళా స్వయంసహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దుతున్నాం.. ప్రజలకు మంచి జరుగుతుంటే పదేండ్లు అధికారం అనుభవించినవాళ్లు చూసి ఓర్వలేకపోతున్నారు. నేను తప్పిపోయిన వారి గురించి, ఓడిపోయిన వారి గురించి మాట్లాడదలచుకోలేదు నాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు మంచి చేయడానికే కేటాయిస్తా... రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు మంచి చేసేవారిని, అభివృద్ధి చేసే వారినే గెలిపించుకోండి గత ఎన్నికల్లో గెలిచాం.. రాబోయే ఎన్నికల్లో గెలుస్తాం.. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాంచనాక- కొరటాకు సీ. రామచంద్రా రెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకి నర్సారెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించాం.

# గ్లోబల్ సమ్మిట్2026 లో టాప్ 10లో నిలిచిన శ్రీజా ఆవుల

**గద్వాల జనవరి 16 (వుదయం ప్రతినిధి)**



దుబాయ్ వేదికగా గ్లోబల్ జూనికార్న్ సమిట్–2026లో స్టార్టప్ ఐడియాతో టాప్–10లో నిలిచిన శ్రీజ అవులా ను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ను అభినందించారు. శుక్రవారం ఐడీఓసి ఛాంబర్ నందు జాతీయ స్టార్టప్ డే సందర్భంగా యువ ఆవిష్కర్త శ్రీజ అవులా రూపొందించిన పర్యావరణహిత ఆవిష్కరణను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత భూమి లక్ష్యంగా శ్రీజ అవులా చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రభుత్వ జెడ్పీహెచ్ ఎస్ పాఠశాల చింతల్‌కుంట విద్యార్థినిగా ప్రారంభమైన శ్రీజ, ప్రస్తుతం బీవీఆర్ఐటీ నిజాంపేట విద్యార్థినిగా తన ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు.శ్రీజ అవులా రూపొందించిన వేరుశెనగ తొక్కలతో తయారు చేసిన బయోపాట్స్, టీ కప్పులు, ప్లేట్లు ప్లాస్టిక్ నర్సరీ పాట్స్‌కు సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఇవి మట్టిలో సహజంగా కరిగిపోవడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం తో పాటు పర్యావరణ సంరక్షణకు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ వినూత్న ఆలోచనతో దుబాయ్‌లో జనవరి 9 నుంచి 11, 2026 వరకు నిర్వహించిన గ్లోబల్ జూనికార్న్ సమిట్–2026లో శ్రీజ పాల్గొని, ఐదు దేశాలు మరియు భారతదేశంలోని 18 రాష్ట్రాల నుంచి వచ్చిన మొత్తం 80 స్టార్టప్‌ల మధ్య పోటీలో టాప్– 1 0 లో స్థానం సాధించిందని తెలిపారు. ఇలాంటి వినూత్న ఆలోచనలు కలిగిన యువ స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు. అవసరమైన మార్గనిర్దేశం, ప్రోత్సాహం, సంబంధిత శాఖల సహకారం అందించి ఇలాంటి ఆవిష్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అగస్టీన్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లాస్థాయి ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలు

**జనవరి 16 భూపాలపల్లి వుదయం ప్రతినిధి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహముత్తారం మండలం స్తంభంపల్లి పి పిగ్రామంలో పసుల నాగయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. మొదటి బహుమతి పిఎన్ పంథార్స్20000, రెండవ బహుమతి 15000, 007 రైడర్స్ మూడవ బహుమతి 15000 సంయుక్త విజేతలుగా ములుకల వారియర్స్, రెడ్ బుల్స్ నిలిచాయి. విజేతలకు స్థానిక సర్పంచ్ జంగిడి కీర్తన, మరియు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మార్క రాముగౌడ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కన్వీనర్ జనగామ కరుణాకర్ రావు ,మాజీ సర్పంచ్ జాడి రాజయ్య మరియు వార్డు సభ్యులు, గ్రామస్తులు కలిసి అందించారు, కార్యక్రమంలో ఉపసర్పంచ్ జనగామ శంకర్, ఎస్.ఎస్.కె అంకుష్, పసుల రాంలక్ష్మన్, జాడి రాజబాపు, మడిగరాజు, జంగిడి శ్రీనివాస్, జనమూర్తి, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో అన్ని వర్గాలను మోసం చేసి పదవులు పొందిండ్లు.. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**జయశంకర్ భూపాలపల్లి జనవరి 16(వుదయం జిల్లా ప్రతినిధి):**



ప్రజల ఓట్లతో గెలిచిన మంథని ఎమ్మెల్యే రెండేళ్ల కాలంలో మహాముత్తారం మండలానికి కేవలం ఒక్కసారి కంటితుడుపుగా కనబడిపోయాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. శుక్రవారం మహాముత్తారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో మహాముత్తారం మండలం ఒక్క శాతం కూడా మెరుగుపడలేదన్నారు. ఆనాడు స్వర్గీయ ఎన్టీ రామారావు హయాంలో మండలాలు ఏర్పడితే అనేక మారుమూల మండలాలు నక్సల్స్ ప్రాభల్యంతో కార్యాలయాలు ఏర్పాటు కాలేదన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అనేక మండల కేంద్రాలకు ప్రభుత్వ కార్యాలయాలను తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అయితే ఈ రెండేళ్ల కాలంలోమాత్రం మహాముత్తారం మండలాన్ని అభివృద్ధిలో అమడదూరంలోనే నిలిపివేశారని ఆయన అన్నారు. ఇప్పటికే రెండేళ్లు వృధా చేశారని, మిగిలిన రెండేళ్లలో ఈ సమాజానికి ఏం చేస్తరో మంథని ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేశారని, అలాగే ఎమ్మెల్యే అతని సోదరుడు చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మభ్యపెట్టాడని ఆయన అన్నారు. ఆనాడు దేవాదుల నుంచి నీటి అలికేషన్ కోసం తాము ప్రయత్నం చేసి బోర్లగూడెం, రెడ్డిపల్లి, కనుకునూరు, మీనాజిపేట గ్రామాల్లో వాల్స్ ఏర్పాటు చేసి నీటిని అందించామని గుర్తు చేశారు. మూడు ఓట్లు ఉన్న ఎమ్మెల్యే కుటుంబానికి నియోజకవర్గంలో 80శాతం పైబడి ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలు ఓట్లు వేస్తే ఆ కుటుంబం పదవులు సంపాదించుకుంటుందన్నారు. వాళ్లకు పదవులతో కుర్చీలు మారుతుంటే మన తలరాతలు మాత్రం మారడం లేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌పార్టీలో నాయకులు ఆలోచన చేయాలని, 50ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ దుద్దిళ్ల కుటుంబానికి సేవలు అందిస్తుంటే ఏ ఒక్కరి కుటుంబానికైనా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పించాడా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రజల గురించి ఆలోచన చేయాలని, మూడుసార్లు మంత్రిగా అవకాశం కల్పించిన వారి అభివృద్ధికి ఆలోచన చేయాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మకర సంక్రాంతి సంబరాలలో అంబరాన్ని అంటిన జిల్లెడబండ గ్రామపంచాయతీ

**గద్వాల జనవరి 16 (వుదయం ప్రతినిధి)**



గద్వాల నియోజకవర్గం గద్వాల మండలంజిల్లెడబండ గ్రామపంచాయతీలో గురు వారం రోజు సంక్రాంతి పండగ సంబరాలలో మూడు రోజుల పాటు జరుపుకునే మహా పండుగగా అయిన టువంటి రెండవ రోజు మకర సంక్రాంతి పండుగ ఉన్నందున సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లెడబండ గ్రామపంచాయతీ సర్పంచ్ డి.నాగేష్ నాయుడు మాట్లాడుతూ రైతన్న చిరునవ్వే మకర సంక్రాంతి పండుగ జిల్లెడ బండ గ్రామ ప్రజలందరికీ సర్పంచ్ డి.నాగేష్ నాయుడు సంక్రాంతి శుభాకాం క్షలు తెలుపుతూ మకర సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు జరుపుకునే మహా పండుగగా గ్రామీణ జీవనాన్ని పండుగ వెలుగులతో నింపుతుందని జిల్లెడ బండ గ్రామ సర్పంచ్ డి.నాగేష్ నాయుడు తెలిపారు. రైతుల ఇళ్లలో ధాన్యరాశులు కళ కళలాడుతూ రైతన్న కంట ఆనందం వెల్లివిరిసే వేళే నిజమైన సంక్రాంతి పండుగ అని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటి ముందర రంగురంగుల ముగ్గులు గొబ్బెమ్మల విరసాలు హరిదాసుల కీర్తనలు ఇంటి ముంగిట భగవత్ సంకీర్తనలు గ్రామాలను ఆధ్యాత్మిక వాతావరణంతో నింపుతాయని తెలిపారు. గంగిరెద్దుల విన్యాసాలు చిన్నారుల్లో అపారమైన ఆనందం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయని చెప్పారు రకరకాల పిండి వంటల సువాసనలు కళాకారుల విన్యాసాలు, కోడిపందాల పౌరుషాలు కోలాటాల పరవళ్లు ప్రకృతి తో మమేకమైన మనిషి జీవనశైలికి నిదర్శనంగా నిలిచే పండుగే మకర సంక్రాంతి అని వివరించారు.ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంట భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు ఆనందాలతో నిండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు అదే విధంగా జిల్లెడ బండ గ్రామ పంచాయతీ గ్రామ మహిళలకు చాలా చక్కటి ఆనందాన్ని నింపిన గ్రామ సర్పంచ్ డి.నాగేష్ నాయుడు మహిళలకు చాలా ఇష్టకరమైన ఆనందకరమైన అయినటు వంటి ముగ్గుల పోటీలు భోగి మకర పండుగ సందర్భంగా మర్లపల్లి మరి జిల్లెడబండ గ్రామాల్లో గ్రామస్థాయి ముగ్గుల పోటీని నిర్వహించడం జరిగింది. రెండు గ్రామాల మహిళలు తమ అద్భుత టాలెంట్ ను ప్రదర్శించి చాలా చక్కటి అద్భుతమైన ముగ్గులు వేయడం జరిగింది ఈ పోటీల్లో జిల్లెడబండ గ్రామపంచాయతీ తరపున మొత్తం 21 టీమ్స్ పాల్గొనగా విజేతలుగా నలుగురిని గ్రామ పెద్దల సమక్షంలో జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం ఎంపీడీవో శైలజ సూచనలతో విజేతలను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో విజేతలకు సర్పంచ్ చేతుల మీద సంక్రాంతి సంబరాలలో భాగంగా షీల్డ్ డబ్బును బహుమతిగా ఇవ్వడం జరిగింది. మహిళలను కేవలం ఇంటికే పరిమితం చేయకుండా వారి కళానాయతున్యాలను వెతికి బయటకి తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్క మహిళ తన స్వేచ్ఛని వినియోగించుకుంటూ సమాజంలో ఉన్నత గౌరవాన్ని సంపాదించుకుంటూ ఆడ మగ తేడా లేకుండా అభివృద్ధిలో ముందుకు అడుగులు వేస్తూ ప్రతి ఒక్క మహిళ ధైర్యంతో అన్ని కార్యకలాపాలలో ముందు ఉండాలని తన కోరికన్నారు. దీనికి గాను తన వంతు సహాయం ఎల్లప్పుడూ తాను చేస్తానని చెప్పడం జరిగింది ఈ పోటీలను జిల్లెడబండ గ్రామపంచాయతీ సర్పంచ్ డి.నాగేష్ నిర్వహించినందుకు గ్రామ మహిళలు చాలా ఆనందంతో తమలో ఉన్న ప్రతిభను చూపిస్తూ పోటీలను విజయవంతం చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లెడబండ మర్లపల్లి గ్రామ ప్రజలు యువతకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడల్లో ఎదగాలి

**వెల్దండ జనవరి 16 (వుదయం ప్రతినిధి)**



గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడలకు ఎదగాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య కన్యాకుమారి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కంటోన్ పల్లి గ్రామంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు గ్రామ సర్పంచ్ మమతా లక్ష్మణ స్వామి మొదటి బహుమతి రూ.10 వేల 116 రూపాయలు, ఉప సర్పంచ్ శివకుమార్ రెండవ బహుమతి రూ.5 వేల 116 రూపాయలు అదేవిధంగా..బి ఆర్ ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు కానుగుల జోగయ్య కన్యాకుమారి తన వ్యక్తిగతంగా క్రీడాకారులకు మొదటి బహుమతి రూ. 6 వేలు, ద్వితీయ బహుమతి రూ. 3 వేలు, తృతీయ బహుమతి రూ.15 వందల రూపా యలు మరియు నాల్గవ బహుమతి 1000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో, ఉపసర్పంచ్ శివకుమార్, నాయకులు శ్రావణ్ కుమార్, మావిళ్ళ గణేష్, బాదేపల్లి గోపాల్ మరియు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా శివ దీక్షా స్వాముల శివ పూజ కార్యక్రమం..

**నాగర్ కర్నూల్ జనవరి 16**

**(వుదయం ప్రతినిధి)**



పట్టణంలోని మధుర నగర్ కాలనీ రూబీ గార్డెన్ దగ్గర కిషన్ నాయక్ శివ స్వామి నివాసంలో శివ పూజ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు శివదీక్షా స్వాములు ఘనంగా శివ పడి పూజ నిర్వహించారు.శివ స్వాముల పూజ కార్యక్రమాన్ని గురుస్వాములు బుజ్జన్న, వినోద్, సురేష్ ఆధ్వర్యంలో శివ పూజ నియమ నియమావళితో పరమశివలింగానికి అభిషేకం చేస్తూ, పూజా నియమావళిని ఘనంగా నిర్వహించారు.శివ స్వాములు శివపాటాలతో మారు మ్రోగించారు. శివ దీక్ష తీసుకున్న స్వాములకు భజన కీర్తనలతో కొనసాగించారు. అనంతరం తీర్థ ప్రసాదములతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా గురుస్వాములకు కండువాలతో సత్కరించారు.ఈకార్యక్రమంలో గురుస్వాములు కొండకింది మాధవరెడ్డి,కురుమూర్తి, శివ, అడివయ్య, అదేవిధంగా శివ స్వాములు చిట్యాల వెంకటేష్, గోపాల్ నాయక్, కాశి,నిరంజన్, చెర్రీ, శ్రీకాంత్, శివ, వెంకటేష్, రమేష్, నాగరాజు, అదిరేపల్లి శ్రీను, రవి, మల్లేష్, శివ, మధు, అశోక్ తో పాటు శివ స్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# రామాలయంలో కన్నుల పండుగగా గోదాదేవి కల్యాణం

**నాగర్ కర్నూల్ జనవరి 16**

**(వుదయం ప్రతినిధి)**



జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి (రామాలయం)లో ధనుర్మాసం ప్రత్యేక పూజల కార్యక్రమంలో భాగంగా శుక్రవారంనాడు గోదాదేవి కళ్యాణం వేదమూర్తులైన బ్రాహ్మణులచే కనుల పండుగగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.వేదమూర్తులైన బ్రాహ్మణులచే వేదమంత్రో చరణాల మధ్య శాస్త్రోక్తంగా గోదాదేవి కల్యాణంలో ప్రత్యేక క్రతువులు విశ్వక్ సేన ఆరాధన, వాసుదేవ పుణ్యా వచనం, యజ్ఞోపవీత ధారణ,మధుపర్కం,మంగళాష్టకాలు,కన్యాదానం,జిలకర బెల్లం, మహ సంకల్ప పఠనం,మాంగల్య పూజ, మాంగల్య ధారణ,పూల మార్పిడి,పుష్పయాగం,తలంబ్రాలు,వేద ఆశీర్వచనం వేదమంత్రచరణల మధ్య చేశారు. పాల్గొన్న దంపతులకు సంతానం ఐశ్వర్యం కొరకు,25 మంది శీఘ్ర కళ్యాణం కొరకు,వారు కోరిన కోరికలు గోదాదేవి, రంగనాథ స్వాముల ఆశీర్వాదంతో నెరవేరుతాయి అని అన్నారు. గోదా రంగనాయక స్వామి వార్లకు సమర్పించిన తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేశారు. కళ్యాణంలోపాల్గొన్న భక్తులందరికీ రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే, రామాలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని సామూహికంగా పంపిణీ చేశారు. పాల్గొన్న భక్తులందరికీ ప్రత్యేకంగా వేద ఆశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందాడై శ్రీనివాస ఆచార్యులు,గోమటం మురళీ మోహనాచార్యులు,కందాడై గోపాలచార్యులు,చక్రవర్తి శ్రీనివాసచార్యులు, వెంకట్రామన్,వేణుగోపాల్, గోమటం శ్రీనివాస చార్యులు, గోపికృష్ణ, అజయ్ కుమార్, కరుణశ్రీ,పద్మ, విజయలక్ష్మి, జయశ్రీ, రాధా, అర్థం రవీందర్, మల్లేష్, శివ,గొల్ల రాములు, నంద కిషోర్ భక్తులు, మహిళలు 600 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ కార్యకర్తల సమీక్ష సమావేశం

**మంథని జనవరి 16 (వుదయం ప్రతినిధి)**



బిజెపి నాయకులు రానున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు మంథని పట్టణం బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికలకు బిజెపి కార్యకర్తలు స ంసిద ్ధంగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి బిజెపిని గెలిపించుకోవాలని వారు తెలిపారు. ఈ కార ్యక్రమ ంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండ పాక సత్య ప్రకాష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోగోజు శ్రీనివాస్, మంథని నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్చార్జ్ వొజ్జల మురళీకృష్ణ, సీనియర్ నాయకులు బోయిని నారాయణ, నారమల్ల కృష్ణ నాగారం వార్డ్ సభ్యులు, సీనియర్ నాయకులు బూడిద తిరుపతి, పట్టణ ఉపాధ్యక్షుడు ఆకుల అరుణ్, దాసరి శ్రావణ్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సామల అశోక్ , ఎడ్ల సాగర్, పట్టణ కార్యదర్శి దూడపాక రోజా, పార్వతి విష్ణు, మాచిడి శ్రీధర్, పట్టణ కోశాధికారి వొడ్నాల శ్రీనివాస్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# బాధిత కుటుంబాలకు హరీష్ రావు పరామర్శ

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



సిద్దిపేట పట్టణ పార్టీ సీనియర్ నాయకురాలు పొన్నామల్ల సువర్ణలక్ష్మి తండ్రి ఇటీవల మృతి చెందడంతో, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతునికి నివాళులు అర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అలాగే మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, పార్టీ సీనియర్ నాయకుడు గంప రాంచందర్ తల్లి మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించిన హరీష్ రావు ఈ దుఃఖ సమయంలో పార్టీ శ్రేణులు కుటుంబానికి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.ఇక సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ తిరుపతి తండ్రి మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించిన హరీష్ రావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట పాల్గొన్నారు.

# సిద్దిపేటలో శర్వాణి ఆర్యవైశ్య ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సంబరాలు

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



సిద్దిపేట పట్టణంలో శర్వాణి ఆర్యవైశ్య ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి–సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భోగిమంటలు వేసి సంప్రదాయ పద్ధతుల్లో పండుగను జరుపుకున్నారు.భోగి సందర్భంగా తెల్లవారుజామున భోగిమంటలు వేసి, చెడు విడిచిపెట్టి మంచి ఆహ్వానించే సంప్రదాయాన్ని పాటించారు. అనంతరం రంగురంగుల ముగ్గులు వేసి పరిసరాలను కళకళలాడేలా చేశారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు.ఈ సందర్భంగా నిర్వహించిన ఆనందోత్సవాలు, పరస్పర శుభాకాంక్షలతో వాతావరణం ఉత్సాహంగా మారింది. సంఘ సభ్యులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అధ్యక్షులు అంబడి పల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శివకుమార్, ఈ భోగి–సంక్రాంతి వేడుకలు సిద్దిపేట పట్టణంలో పండుగ సందడిని మరింత పెంచాయని స్థానికులు పేర్కొన్నారు.

# గ్రామ ప్రజల ఆరోగ్యమే మా ధ్యేయం

**మంథని జనవరి 16(వుదయం ప్రతినిధి)**



గ్రామ ప్రజల ఆరోగ్యమే ముఖ్య ధ్యేయమని సూరయ్యపల్లి సర్పంచ్ ఆర్ల నాగరాజు పేర్కొన్నారు. శనివారం సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ ఆరెల్లి సుచిత వరుణ్, పాలకవర్గం సభ్యులతో కలిసి పల్లె దావఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు సహకరంతో గ్రామాన్ని మండలంలోని అగ్రగామిగా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. గ్రామస్తుల ఆరోగ్య దృష్ట్యా పల్లె దావఖానను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. గ్రామంలోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కలిగి ఉండాలని వారు తెలిపారు. గ్రామాన్ని సస్యశ్యామలంగా ఉంచేందుకు ప్రజలు పాలకవర్గానికి సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పంచాయితీ కార్యదర్శి జైపాల్, ఎమ్ ఎల్ హెచ్ పి శ్రావణి, ఏఎన్ఎం శ్వేత, ఆశా కార్యకర్తలు, మాజీ సర్పంచ్ ఆకుల కిరణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు రేపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జంజర్ల మల్లేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెల్లి కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఆర్ల లింగయ్య, ఆర్ల జ్ఞాని, జంజర్ల గట్టయ్య, జంజర్ల రాజు, తాటి సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు చంద్రు విజయ్, ఎరుకల సురేష్, రావుల నాగేష్, సుదర్శన్, శివ కిషోర్, ప్రజలు, పాల్గొన్నారు.

# రాజగోపాల్‌పేటలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగుల పంపిణీ

**వుదయం , సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ చేర్యాలవాని రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల పథక లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ హారిక రాజేష్, వార్డ్ మెంబర్లు ముక్క అనిల్, ముంద్రాతి లింగం, కాటం సాగర్, మహేష్, పద్మ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జి రాంజీ పథకాన్ని రద్దు చేయాల్సిందే

**మంథని జనవరి 16( వుదయం ప్రతినిధి )**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి జి రాంజీ పథకాన్ని రద్దు చేయాల్సిందే అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో వరి నాట్లు వేస్తున్న కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ,నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని ఆయన పేర్కొన్నారు. 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుం దని 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఈ పథకంలో చెప్పారని అన్నారు.. గ్రామీణ ప్రజలకు ఆసరగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం సరికాదన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్ రమేష్ తో పాటు కూలీలు పాల్గొన్నారు.

# భోగి పండ్ల పోసే కార్యక్రమంతో సంక్రాంతి సంబరాలు

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



సిద్దిపేట పట్టణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భోగి పండ్ల పోసే కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు ఆశీర్వాదాలు అందిస్తూ కుటుంబ సభ్యులు ఆనందంగా పాల్గొన్నారు.చిన్నారి యాసార తారకు అమ్మ నాన్నలు చైతన్య రాఘవ, సౌమ్య, తాతయ్యలు శ్రీనివాస్, లలిత, అలాగే వెంకటలక్ష్మి, దుండిగల్ లింగం, సత్యలక్ష్మి భోగి పండ్లు పోసి దీవించారు. చిన్నారి భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.ఇల్లు ముందు వాకిలిలో రంగురంగుల పూలతో, పసుపు–కుంకుమలతో అందంగా మొగులు వేసి సంక్రాంతి శోభను మరింత పెంచారు. సంప్రదాయం, సంస్కృతిని చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమం కుటుంబ సభ్యుల మధ్య ఆనందం, ఐక్యతను మరింత బలపరిచింది.ఈ భోగి పండ్ల కార్యక్రమం చిన్నారుల జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని, పండుగ యొక్క సాంస్కృతిక విలువలను భవిష్యత్ తరాలకు చేరవేసేలా ఉందని పాల్గొన్నవారు తెలిపారు.

# కనుమ సందర్భంగా గోశాలలో గోవులకు ఆహారం పంపిణీ

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 16:**



వాసవి క్లబ్, వాసవి క్లబ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు అయిత పురుషోత్తం ఆర్థిక సహకారంతో వైశ్యభవన్ గోశాల, రావిచెట్టు రాంరాజ్ హనుమాన్ గోశాలలోని గోవులకు ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా అందజేశారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్ మాట్లాడుతూ, కనుమ పండుగ విశిష్టతలో భాగంగా గోవులను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పూరాణాల్లో పేర్కొనబడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు అయిత పురుషోత్తం, యూత్ క్లబ్ అధ్యక్షుడు బుక్క శివకుమార్, ప్రధాన కార్యదర్శి నాగమల్ల కిషన్, కోశాధికారి బుక్క అరుణ్, గ్రీటింగ్స్ చైర్మన్ మర్యాల వీరేశం, కృష్ణమూర్తి, రాజు, దుర్గయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## ఆముదం నూనె సీక్రెట్..

ఆముదం నూనెలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి చాలా మంది దీనిని ఉపయోగిస్తారు. ఆముదం నూనెలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. ఆముదం నూనెను శతాబ్దాలుగా గృహ నివారణలలో ఉపయోగిస్తుంటారు. ఇది చర్మం, జుట్టు, జీర్ణ సమస్యలకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఆముదంలోని పోషకాలు శరీరంపై వివిధ ప్రభావాలను చూపుతాయి. అందుకే చాలా మంది



దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటారు. ఆముదం గింజల నుండి తీసే నూనె.. మాయిశ్చరైజింగ్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా పేగు సమస్యలకు ఇది తరచుగా ప్రస్తావించబడుతుంది. శరీరం నుండి వ్యర్థాలను తొలగించడంలో పేగులు కీలక పాత్ర పోషిస్తాయి. వాటి సరైన పనితీరు చాలా ముఖ్యం. పేగు పనితీరు ప్రభావితమైనప్పుడు, మలబద్ధకం, గ్యాస్, కడుపులో బరువు పెరగడం వంటి సమస్యలు సంభవించవచ్చు. అటువంటి పరిస్థితులలో, చాలా మంది గృహ నివారణగా ఆముదం నూనెను ఆశ్రయిస్తారు. అయితే, ఆముదం ప్రభావాలు వ్యక్తి నుండి వ్యక్తికి మారవచ్చు.. తప్పుడు మోతాదును ఉపయోగించడం లేదా సరైన జ్ఞానం లేకుండా ఉపయోగించడం వల్ల సమస్యలు తలెత్తవచ్చు.

అందువల్ల, దానిని ఉపయోగించే ముందు వెళ్లే ముందు ఆముదం ? ప్రేగుల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం . ఆముదం నిజంగా ప్రేగులను శుభ్రపరుస్తుందా.. లేదా..? ఎంత మోతాదు సురక్షితము..? ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన ఆయుర్వేద అధికారి డాక్టర్ ఆర్.పి. పరాశర్ వివరిస్తూ.. ఆముదంలో ప్రధానంగా రిసినోలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఈ మూలకం పేగు కదలికలను సక్రియం చేయడానికి సహాయపడుతుంది.. ఇది ప్రేగు కదలికను వేగవంతం చేస్తుంది. ఆముదం తీసుకోవడం వల్ల ప్రేగు కదలిక పెరుగుతుంది.. అంతేకాకుండా.. కదలికలు సులభతరం అవుతాయి. అదనంగా, దీనిలో ఉండే కొవ్వు ఆమ్లాలు జీర్ణ రసాలను సక్రియం చేస్తాయి. ఇది జీర్ణవ్యవస్థ ద్వారా ఆహారాన్ని తరలించడానికి సహాయపడుతుంది. అందుకే కొంతమంది దీనిని మలబద్ధకం కోసం ఉపయోగిస్తారు. అయితే, దీని ప్రభావాలు క్రమంగా కాకుండా సాపేక్షంగా వేగంగా ఉంటాయి. కాబట్టి మోతాదు, సరైన పద్ధతిని గుర్తుంచుకోవడం ముఖ్యం. సలహా లేకుండా అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల కడుపు తిమ్మిరి లేదా బలహీనత కూడా సంభవించవచ్చు. ఆముదం నూనెను ప్రధానంగా మలబద్ధకం చికిత్సకు ఉపయోగిస్తారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, ఉదర భాగాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. కొంతమందికి ఇది గ్యాస్, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగించడంలో కూడా సహాయపడుతుంది. కీళ్ల నొప్పులు, చర్మం పొడిబారడానికి కూడా దీనిని స్థానికంగా ఉపయోగిస్తారు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, నెత్తికి పోషణను అందించడానికి కూడా ఆముదం నూనె ప్రసిద్ధి చెందింది. అయితే, దీని ప్రభావం వ్యక్తి నుండి వ్యక్తికి మారుతుంది.. దీర్ఘకాలిక ఉపయోగం సిఫార్సు చేయబడదు.

## నల్లజీలకర్రతో కీళ్లనొప్పులకు చెక్!

చలికాలంలో పెరిగే బరువును చూసి ఆందోళన చెందుతున్నారా? కీళ్లనొప్పులు వేధిస్తున్నాయా? అయితే వంటగది



లోని నల్ల జీలకర్రను ఒకసారి నమ్మండి. పురాతన కాలం నుండి ఆయుర్వేదంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. చలికాలం వచ్చిందంటే చాలు.. వేడివేడి బజ్జీలు, సమోసాలు వంటి వేయించిన ఆహార పదార్థాలు తినాలనిపిస్తుంది. అదే సమయంలో చలి వల్ల శారీరక శ్రమ తగ్గిపోతుంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పేరుకుపోయి బరువు పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలన్నింటికీ వంటగదిలో ఉండే నల్ల జీలకర్ర ఒక అద్భుతమైన పరిష్కారం అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో వ్యాయామం తగ్గడం వల్ల శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. నల్ల జీలకర్ర శరీరంలో కొత్త కొవ్వు కణాలు ఏర్పడకుండా నిరోధిస్తుంది. ఇది సహజంగా బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని నియంత్రించడానికి సహాయపడుతుంది. చలికాలంలో రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. నల్ల జీలకర్ర శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీనివల్ల రక్త ప్రసరణ సాఫీగా జరిగి గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. సాధారణంగా ఈ సీజన్‌లో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. నల్ల జీలకర్ర జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల తీసుకున్న ఆహారం త్వరగా జీర్ణమవడమే కాకుండా శరీరానికి కావాల్సిన శక్తి అందుతుంది. చలికాలంలో చాలా మందిని వేధించే ప్రధాన సమస్య కీళ్ల నొప్పులు. నల్ల జీలకర్రలో ఉండే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలోని వాపులను తగ్గించి, కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. చలికాలంలో వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి ఇందులోని యాంటీఆక్సిడెంట్లు సహాయపడతాయి. ఇది శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. నల్ల జీలకర్రను దోరగా వేయించి పొడి చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం అర టీస్పూన్ పొడిని గోరువెచ్చని నీటిలో లేదా తేనెతో కలిపి తీసుకోవచ్చు. రు తాగే టీలో కూడా చిటికెడు పొడిని కలుపుకోవచ్చు.

## షుగర్ ఫ్రీ బిస్కెట్లు సైతం డయాబెటిస్‌కు కారణమవుతాయా?

ఈ రోజుల్లో డయాబెటిస్ అనేది సర్వసాధారణంగా మారిపోయింది. కానీ తీవ్రమైన వ్యాధిగా మారుతోంది. ఎవరికైనా డయాబెటిస్ ఉన్నట్లు నిర్ధారణ అయిన వెంటనే, వారు వెంటనే వివిధ రకాల ఆహార పదార్థాలను నివారించాలని



సలహా ఇస్తారు. మొదట, చక్కెరను నిషేధిస్తారు. తరువాత స్వీట్లు, బిస్కెట్లు, స్నాక్స్, బంగాళాదుంపలు, శుద్ధి చేసిన పిండి, గోధుమ పిండి కూడా తినకుండా కట్టడి చేస్తారు. ఈ రోజుల్లో డయాబెటిస్ అనేది సర్వసాధారణంగా మారిపోయింది. కానీ తీవ్రమైన వ్యాధిగా మారుతోంది. ఎవరికైనా డయాబెటిస్ ఉన్నట్లు నిర్ధారణ అయిన వెంటనే, వారు వెంటనే వివిధ రకాల ఆహార పదార్థాలను నివారించాలని సలహా ఇస్తారు. మొదట, చక్కెరను నిషేధిస్తారు. తరువాత స్వీట్లు, బిస్కెట్లు, స్నాక్స్, బంగాళాదుంపలు, శుద్ధి చేసిన పిండి, గోధుమ పిండి కూడా తినకుండా కట్టడి చేస్తారు. దీనివల్ల ప్రజలు ఏమి తినాలి. ఏమి తినకూడదు అని ఆలోచిస్తున్నారు. ఈ సందిగ్ధతను సద్వినియోగం చేసుకుని, మార్కెట్ చక్కెర రహిత ఉత్పత్తులతో నిండిపోయింది. బిస్కెట్లు, చాక్లెట్లు, ఐస్ క్రీం, స్వీట్లు ఇలా అందుబా దాదాపు ప్రతిదీ చక్కెర రహితంగా లేబుల్స్ టులోకి వచ్చాయి.మధుమేహ వ్యాధిగ్రస్తులు తరచుగా వీటిని సంకోచం లేకుండా తింటారు. వాటిలో చక్కెర లేనం దున, తమ రక్తంలో చక్కెర స్థాయిలను ఎలా పెంచుకోగలరని ఆలోచిస్తారు? అయితే, ''చక్కెర రహిత'' అనే పదం తరచుగా ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని వైద్యులు అంటున్నారు. ప్రజలు తరచుగా చక్కెర రహిత బిస్కెట్లను పూర్తిగా ఆరోగ్యకరమైనవిగా భావిస్తారు. ప్రతిరోజూ తినడం ప్రారంభిస్తారు. అయితే నిజం దీనికి విరుద్ధంగా ఉంటుందంటున్నారు వైద్యులు. చాలావరకు చక్కెర రహిత బిస్కెట్లు శుద్ధి చేసిన పిండితో తయారు చేయడం జరుగుతుంది. వాటిలో తెల్ల చక్కెర లేకపోయినా, శుద్ధి చేసిన పిండి రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతుంది. వాటిలో తరచుగా శుద్ధి చేసిన నూనెలు, ట్రాన్స్ ఫ్యాట్‌లు ఉంటాయి. ఇవి అనారోగ్యకరమైనవి. శుద్ధి చేసిన పిండిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. దీనివల్ల రక్తంలో చక్కెర శాతం పెరుగుతుంది. అందుకే చక్కెర రహిత బిస్కెట్లను ప్రతిరోజూ పెద్ద పరిమాణంలో తీసుకోవడం మధుమేహ వ్యాధిగ్రస్తులకు హాని కరం. మధుమేహం లేని వారు కూడా భవిష్యత్తులో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుకోవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రు చక్కెర లేని బిస్కెట్లు తింటుంటే, అవి మంచిదని భావించి వాటిని అతిగా తినకూడదని అర్థం చేసుకోవడం ముఖ్యం. వైద్యులు తీసుకోవడం రోజుకు ఒకటి లేదా రెండు బిస్కెట్ల కు పరిమితం చేయాలని, అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవాలని సలహా ఇస్తున్నా రు. ప్రతిరోజూ టీతో బిస్కెట్లు తినే అలవాటును మానుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చక్కెర లేని బిస్కెట్లు కొనుగోలు చేసేటప్పుడు, లేబుల్‌ను తప్పకుండా చదవండి. బిస్కెట్లు శుద్ధి చేసిన పిండితో తయారు చేయబడ్డాయా లేదా గోధుమలతో తయారు చేయబడ్డాయా అని తనిఖీ చేయండి. వాటిలో మంచి ఫైబర్ కంటెంట్ ఉండాలి. మాల్టో డెక్స్‌ట్రిన్ వంటి పదార్థాలను నివారించాలి. ఇది రక్తంలో చక్కెరను పెంచుతుందంటున్నారు వైద్యులు. అలాగే, ఉపయోగించిన కృత్రిమ స్వీటెనర్ రకాన్ని తనిఖీ చేయండి. లేబుల్ అస్పష్టంగా ఉంటే లేదా అధిక రసాయనాలను కలిగి ఉంటే, అటువంటి బిస్కెట్లను నివారించడం మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

## కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు వస్తున్నాయా?

చాలా మందికి ఉదయం లేవగానే చేతులు, కాళ్లల్లో తిమ్మిర్లు వస్తుంటాయి. అందుకు కారణాలు ఉన్నాయి. ఇలా ఉదయం లేవగానే ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటే జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. ఆరోగ్యంగా తినడం, సమయానికి వ్యాయామం చేయడం వంటివి. కానీ కొన్నిసార్లు అలాంటి కొన్ని లక్షణాలు శరీరంలో కనిపించడం ప్రారంభిస్తాయి. అసలు కారణం అర్థం చేసుకోవడం కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యలలో ఒకటి చేతులు, కాళ్ళలో జలదరింపు. తరచుగా ఈ సమస్య నిరంతరం కూర్చోవడం లేదా నిలబడి ఉండటం, శరీరంలోని ఏదైనా భాగంపై ఎక్కువసేపు బరువు పెట్టడం వల్ల సంభవిస్తుంది. కానీ రు దీన్ని చేయకపోతే, ఇప్పటికీ ఈ సమస్య సంభవిస్తుంది. చేతులు, కాళ్ళలో జలదరింపునకు అనేక కారణాలు ఉండవచ్చు. విటమిన్ లోపం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. నరాలు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని విటమిన్లు



అవసరం. విటమిన్12, విటమిన్ 6, విటమిన్ 1, విటమిన్ ఇ, విటమిన్ 9 లేదా ఫోలేట్ వంటివి. విటమిన్ 12 కణాలకు శక్తిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన మూలంగా పరిగణించబడుతుంది. శరీరంలో ఏదైనా విటమిన్ లోపం ఉంటే ఈ సమస్య రావచ్చంటున్నారు నిపుణులు. మధుమేహం వల్ల కాళ్లు, కాళ్లలో, కొన్నిసార్లు చేతులు, చేతుల్లో జలదరింపు ఉంటుంది. రక్తంలో చక్కెర అధిక మొత్తంలో నరాల నష్టం కలిగిస్తుంది. ఈ సమస్య వల్ల శరీరంలోని నరాలకు సరఫరా చేసే రక్తనాళాలు కూడా దెబ్బతింటాయి. నరాలకు తగినంత ఆక్సిజన్ లభించనప్పుడు. అవి సరిగ్గా పనిచేయవు. చుట్టుపక్కల కణజాలాల నుండి సిరలపై ఎక్కువ ఒత్తిడి ఉన్నప్పుడు, సిరలు ఎండిపోవడం జరగవచ్చు. శరీరంలోని అనేక భాగాలలోని నరాలు కుదించబడి చేతులు లేదా పాదాలను ప్రభావితం చేస్తాయి. దీనివల్ల జలదరింపు, తిమ్మిరి లేదా నొప్పి వస్తుందన్నారు.కిడ్నీలు శరీరానికి అనుగుణంగా సరిగా పనిచేయనప్పుడు కిడ్నీ ఫెయిల్యూర్ వస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు మూత్రపిండాల వైఫల్యానికి కారణమవుతాయి. మూత్రపిండాలు సరిగా పనిచేయనప్పుడు, ద్రవం, వ్యర్థ పదార్థాలు శరీరంలో పేరుకుపోతాయి.

## ముఖ కాంతికి 'ఓట్స్'..

ఓట్‌మీల్ మంచి ఫేస్‌వాష్‌గానూ పని చేస్తుంది. గోరువెచ్చటి నీటిలో కొన్ని ఓట్స్ వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనికి టీస్పూన్ తేనె కలిపి.. ఈ మిశ్రమంతో ముఖంపై మునివేళ్లతో గుండ్రంగా రుద్దాలి. తద్వారా చర్మ రంధ్రాల్లో పేరుకున్న దుమ్ము, ధూళి తొలగిపోయి ముఖం శుభ్రపడుతుంది. అలాగే తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల చర్మం కాంతివంతమవుతుంది అంటున్నారు నిపుణులు. మనం రోజూ ఎన్నో పనులతో అలసిపోతుంటాం.. ఇలాంటి సమయంలో గోరువెచ్చటి నీళ్లతో స్నానం



చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. అయితే ఇందులో ఒక కప్పు ఓట్స్, కొన్ని చుక్కల లావెండర్ నూనె వేయాలి. ఈ మిశ్రమంతో స్నానం చేస్తే మరింత మంచి ఫలితం ఉంటుంది. ఇందులో ఉపయోగించిన ఓట్స్ చర్మాన్ని శుభ్రం చేయడంతో పాటు తేమ నిలిచి ఉండేలా చేస్తుంది. అలాగే లావెండర్ చర్మాన్ని సువాసనభరితం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. దురద, అలర్జీ.. వంటివి క్రమంగా తగ్గుముఖం పడతాయని కూడా సూచిస్తున్నారు.

## పప్పుల్ని ఇలా తినాలట!

మనం ఏది తిన్నా ఆరోగ్యం కోసమే! అయితే ఆయా ఆహార పదార్థాల్ని తీసుకునే క్రమంలో కొన్ని కచ్చితమైన నియమాలు పాటిస్తేనే అందులోని పోషకాలు శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పప్పుల్ని తీసుకునే విషయంలో కొన్ని అంశాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు. పప్పుల్లో ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు.. వంటి పోషకాలే కాదు.. వీటి పనితీరుకు ఆటంకం కలిగించే యాంటీ న్యూట్రియంట్లు కూడా ఉంటాయి. ఇవి పోషకాల్ని శరీరం గ్రహించకుండా అడ్డుపడతాయి. తద్వారా అజీర్తి, కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్ సమస్యలు.. వంటివి తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే ఈ సమస్యలు రాకూడదంటే పప్పుల్ని ఆహారంగా తీసుకునే క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం ముఖ్యమంటున్నారు నిపుణులు. చాలా మందికి పప్పుల్ని నేరుగా వండుకోవడం లేదంటే వివిధ వంటకాల్లో భాగం చేసుకోవడం అలవాటు. కానీ ముందు వీటిని నానబెట్టి, మొలకలొచ్చాక వండుకునే వారు చాలా తక్కువ మంది ఉంటారు. కానీ ఇలా చేయడం వల్ల యాంటీ న్యూట్రియంట్లను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌లను ప్రేరేపించచ్చంటున్నారు నిపుణులు. ఎందుకంటే పప్పుల్లో ఉండే పోషకాల్ని శరీరం గ్రహించకుండా ఈ యాంటీ న్యూట్రియంట్లు అడ్డుపడతాయి. అదే నానబెట్టి, మొలకెత్తిన పప్పుల్లో వీటి శాతం తగ్గిపోతుంది. తద్వారా సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్.. వంటివి శరీరానికి అందుతాయి. ఫలితంగా జీర్ణశక్తి మెరుగుపడి వివిధ రకాల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. సాధారణంగా చాలామంది కంది, పెసర, శెనగ.. వంటి పప్పుల్నే రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటారు. కానీ మన దేశంలో ఎన్నో రకాల పప్పులు, కాయధాన్యాలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి వారానికి కనీసం ఐదు రకాలనైనా ఆహారంలో భాగం చేసుకుంటే అటు వాటిలోని పోషకాలు శరీరానికి అందుతాయి.. అలాగే వాటి రుచినీ ఆస్వాదించచ్చు.



## చపాతీ, రైస్ డిన్నర్‌లోకి ఏది మంచిది

మారుతున్న జీవనశైలితో జనాలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందులో డయాబెటిస్ కూడా ఒకటి. ఒకప్పుడు కేవలం వయస్సు మళ్లిన వారిలో మాత్రమే కనిపించే ఈ సమస్య ఇప్పుడు యువకుల్లో కూడా కనిపిస్తుంది. అయితే దీన్ని నియంత్రించేందుకు సరైన ఆహారం ఎంతో ముఖ్యం. మారుతున్న ఆహారపు అలవాట్లు, లైఫ్ స్టైల్ కారణంగా చాలా మంది అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇందులో చాలా మంది ఫేస్ చేసే ప్రధాన సమస్య డయాబెటీస్. దీన్ని నియంత్రణలో ఉంచుకోవాలం సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అయితే డయాబెటీస్ ఉన్నవారు నైట్ డిన్నర్‌లోకి చపాతీ, రైస్ తినే విషయంలో చాలా గందరగోళానికి గురవుతారు. వీటని తినడం వల్ల శరీరంలో చక్కెర స్థాయిలు పెరుతాయని భావిస్తారు. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ రెండు ఆహారాలు పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వీటిని సరైన క్రమంలో తీసుకుంటే రెండు ఆరోగ్యానికి ప్రయోజనకరంగానే ఉంటాయని వారు చెబుతున్నారు. ఒక కప్పు రైస్‌లో దాదాపు 50 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉండగా , చపాతీలో దాదాపు 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. బియ్యం కంటే చపాతీలో దాదాపు 2 గ్రాముల ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. గోధుమ పిండితో తయారు చేసిన చపాతీలో బియ్యం కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఒక చపాతీలో దాదాపు 71 కేలరీలు, 3 గ్రాము ల ప్రోటీన్, 0.4 గ్రాముల కొవ్వు, 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. బియ్యంలో గోధుమ కంటే భాస్వరం, మెగ్నీషియం తక్కువగా ఉంటుంది. ఇది ఫోలేట్, ఐరన్ రెండింటిలోనూ సమానంగా ఉంటుంది. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు రెండింటినీ తినవచ్చు.

కానీ వాటిని సరైన పరిమాణంలో తీసుకోవడం ముఖ్యం. చపాతీలు తినడం వల్ల అన్నం మోతాదును నియంత్రించడం సులభం అవుతుంది. రెండు చపాతీలతో భోజనం ముగించడం ఉత్తమం. జొన్నలు, సజ్జలు, రాగులు వంటి మిశ్రమ ధాన్యాలతో తయారు చేసిన చపాతీలలో తక్కువ



గ్లైసెమిక్ సూచిక ఉంటుంది. ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల అవి మధుమేహాన్ని అదుపులో ఉంచుతాయి. శుద్ధి చేయని, తక్కువ గ్లైసెమిక్ సూచిక కలిగిన తృణధాన్యాల పిండిని ఎంచుకోవడం మంచిదని నిపుణులు అంటున్నారు .

## పతంగి నేర్పే పాఠాలెన్నో..!

సంక్రాంతి వచ్చిందంటే చాలు.. నేల రంగురంగుల ముగ్గులతో మెరిసిపోతే.. ఆకాశం గాలిపటాలతో నిండిపోతుంది. అలా ఆ సప్తవర్ణాల గాలిపటాలు నింగిలో ఎగురుతుంటే.. ఆకాశానికి కూడా పండగ కళ వచ్చేసిందేమో అనిపిస్తుంది.

ఎక్కడ చూసినా 'గాలిపటమా పద పద పద' అంటూ వాటిని ఎగరేసే వారే కనిపిస్తారు.. ఎవరి నోట విన్నా 'ఖీంచ్', 'డీల్' వంటి పదాలే వినిపిస్తుంటాయి. సంక్రాంతి సంబరాల్ని రెట్టింపు చేయడంలో గాలిపటాలది కీలక పాత్ర! మనదేశంలో గుజరాత్‌లో గాలిపటాల సందడి ఎక్కువగా కనిపిస్తుంది. ఏటా అక్కడ గాలిపటాల పోటీలు, పండగలు నిర్వహిస్తుంటారు. దేశవిదేశాల నుంచి ఔత్సాహికులు, నిపుణులు ఇందులో పాల్గొని పోటాపోటీగా గాలిపటాలు ఎగరేస్తుంటారు. నిజాం నవాబుల ప్రోత్సాహంతో ఈ సంస్కృతి తెలుగు రాష్ట్రాలకూ విస్తరించింది. ఇప్పుడు ఒక ప్రాంతం, ప్రదేశమనే కాదు.. దేశవ్యాప్తంగా, వివిధ దేశాల్లోనూ గాలిపటాల సందడి కనిపిస్తుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొనడం చూస్తుంటాం. గాలిపటాలు ఎగరేయడానికి ప్రత్యేకంగా ఓ సమయమంటూ లేకపోయినా.. మన దేశంలో సంక్రాంతి సమయంలో పతంగులు ఎగరేయడం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే దీని వెనుక ఒక కారణం కూడా ఉందట! సంక్రాంతి చలికాలంలో వస్తుంది. ఈ కాలంలో వివిధ ఆరోగ్య సమస్యలు, ఇన్ఫెక్షన్ల బెడద ఎక్కువగా ఉంటుంది. శరీరం పైన ఎండ పడే అవకాశం కూడా తక్కువే. అందుకే ఉదయం పూట లేలేత సూర్య కిరణాలను ఆస్వాదిస్తూ పతంగులను ఎగరేయడం వల్ల సూర్యరశ్మి నుంచి విటమిన్ 'డి' ఎక్కువగా అందడమే కాకుండా.. ఎండ వల్ల కలిగే ప్రయోజనాలన్నీ పొందచ్చు. అంతేకాదు.. ఈ సమయంలో గాలి ఒకే దిశగా వీచడం వల్ల గాలిపటాలు ఎగరేయడానికి సులువుగా ఉంటుందని కూడా భావిస్తారు. చిన్నప్పుడు వార్తాపత్రికలను చింపి కొబ్బరి ఈనెలు, ఉడకబెట్టిన మైదాపిండిని ఉపయోగించి పతంగులు తయారుచేసుకునే వాళ్లం. కేవలం ఇంట్లో చేసుకోవడమే కాదు.. మార్కెట్లో కొని ఎగరేసే గాలిపటాల్లోనూ ఒకటీ, రెండు కాదు.. కొన్ని వేల రకాలున్నాయి. వాటిలో కొన్నింటికి విభిన్నమైన పేర్లు కూడా ఉన్నాయి. గుడ్లందార్, గుడ్డి లంగోటి, అద్దా వంటివి మన దగ్గర సాధారణంగా వినిపించే పేర్లు.. 'గుడ్లందార్' అంటే రెండు కళ్లున్న గాలిపటం. ఒంటికన్ను ఉన్న దాన్ని 'గుడ్డి లంగోటి' అంటారు. 'అద్దా' అంటే చాలా పెద్ద పతంగి అని అర్థం. ఇవే కాదు.. విభిన్నమైన రకాల్లో, వర్ణాల్లో ఎన్నో గాలిపటాలు మార్కెట్లో సందడి చేస్తాయి. అయితే కాలక్రమేణా ఇలాంటి సంప్రదాయ పతంగులు అరుదుగానే కనిపిస్తున్నా.. మోడ్రన్ గాలిపటాలు ఎక్కువమందిని ఆకట్టుకుంటున్నాయి. పగలే కాదు.. రాత్రి పూట ఎగరేయడానికి వీలుగా ప్రత్యేకమైన గాలిపటాలు రూపొందుతున్నాయి.



## గోల్డెన్ మిల్క్ రాత్రిపూట తాగితే..

గోల్డెన్ మిల్క్ శరీరంలో వాపులు, నొప్పులు తగ్గించేందుకు సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. పసుపు పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, జ్వరం, దగ్గు తగ్గిపోతుంది. దీని వల్ల జ్ఞాపకశక్తి పెరగడం సహా జీర్ణక్రియ మెరుగు అవుతుంది. బంగారు పాలలో ఉండే పదార్థాలు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. గోల్డెన్ మిల్క్ అంటే పాలలో పసుపు పొడి కలిపితే దాన్ని గోల్డెన్ మిల్క్ అని పిలుస్తారు. రాత్రివేళ పడుకునే ముందు గోల్డెన్ మిల్క్ తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. బాగా నిద్ర పడుతుంది. పసుపు పాలను తాగడం వల్ల శరీరానికి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్ కర్కుమిన్ పుష్కలంగా లభిస్తుంది. గోల్డెన్ మిల్క్ శరీరంలో వాపులు, నొప్పులు తగ్గించేందుకు సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. పసుపు పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, జ్వరం, దగ్గు తగ్గిపోతుంది. దీని వల్ల జ్ఞాపకశక్తి పెరగడం సహా జీర్ణక్రియ మెరుగు అవుతుంది.పసుపు పాలు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, కడుపు నొప్పి, ఫ్లూ వంటి వివిధ ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. చిటికెడు పసుపు పొడితో కలిపిన పాలు తాగడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు పసుపు పాలు తాగడం వల్ల ప్రయోజనం



పొందవచ్చు. కొన్ని అధ్యయనాలు కూడా పసుపు పాలు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని సూచిస్తున్నాయి. బంగారు పాలు తాగడం వల్ల బాగా నిద్రపోవచ్చు. పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పసుపు పాలు తాగడం వల్ల బాగా నిద్రపడుతుంది. రు నిద్రలేమితో బాధపడుతుంటే లేదా రాత్రిపూట చాలాసార్లు మేల్కొంటే, పసుపు పాలు తాగడం వల్ల ఈ సమస్యలు తగ్గుతాయి. పసుపు పాలు అంతర్గత గాయాలు, మంటలను కూడా నయం చేస్తాయి. శరీరానికి విశ్రాంతినిస్తాయి. బంగారు పాలలో ఉండే పదార్థాలు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. గరిష్ట ప్రయోజనాల కోసం, దీనిని అల్లం, దాల్చిన చెక్కతో కలిపి తీసుకోవచ్చు. రోజుకు 1-6 గ్రాముల దాల్చిన చెక్క తీసుకోవడం వల్ల ఫాస్టింగ్ షుగర్ స్థాయిలు 29శాతం తగ్గుతాయి. అదనంగా, దాల్చిన చెక్క ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. పసుపు పాలు తాగడం మధుమేహం ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. పసుపు పాలు శక్తివంతమైన శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. దీర్ఘకాలిక మంట, జీవక్రియ సిండ్రోమ్, అల్జీమర్స్ వ్యాధి, గుండె జబ్బులతో సహా అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో దీనిని తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఆర్థరైటిస్ ఉన్నవారు ఈ బంగారు పాలను తీసుకోవడం వల్ల ప్రయోజనం పొందవచ్చు. బంగారు పాలు మెదడుకు కూడా మంచిది. కర్కుమిన్ మెదడు నుండి ఉత్పన్నమయ్యే న్యూరోట్రోఫిక్ కారకం (ఃఆఔఈ) స్థాయిలను పెంచుతుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి.

# విదేశీ వాణిజ్యంలో చైనా రికార్డ్



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గతేడాది చైనా వాణిజ్యంపై అనేక ఆంక్షలు పెట్టడంతో పాటుగా భారీగా టారిఫ్‌లను పెంచినప్పటికీ రికార్డ్ విదేశీ వాణిజ్యాన్ని నమోదు చేసింది. 2025లో చైనా వస్తువుల విదేశీ వాణిజ్యం ఏడాది ప్రాతిపదికన 3.8 శాతం పెరిగి 45.47 ట్రిలియన్ యువాన్లకు (6.51 ట్రిలియన్ డాలర్ల) చేరుకుంది. ఇది సరికొత్త రికార్డును సృష్టించడమే కాకుండా, బలమైన వాణిజ్యానికి నిదర్శనమని చైనా జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ వెల్లడించింది. గత ఏడాది కూడా ప్రపంచంలోనే అతిపెద్ద వస్తువుల వాణిజ్య దేశంగా చైనా తన స్థానాన్ని నిలబెట్టుకుందని పేర్కొంది. 2025లో చైనా ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 6.1 శాతం పెరిగి 26.99 ట్రిలియన్ యువాన్లకు చేరుకోగా, దిగుమతులు 0.5 శాతం పెరిగి 18.48 ట్రిలియన్ యువాన్లుగా నమోదయ్యాయి. ఉఅంతర్జాతీయ వాతావరణం తీవ్రమైన మార్పులకు లోనవుతూ, ప్రపంచ ఆర్థిక, వాణిజ్య క్రమం ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటున్న సంక్లిష్ట పరిస్థితుల్లోనూ చైనా విదేశీ వాణిజ్య రంగం సాధించిన విజయాలు అసాధారణమైనవి. ఎంతో కష్టపడి సాధించినవి.'' అని జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ (జీఏసీ) డిప్యూటీ హెడ్ వాంగ్ జున్ పేర్కొన్నారు. సంక్లిష్టమైన బాహ్య వాతావరణం నుంచి ఒత్తిడి ఉన్నప్పటికీ సాధించిన ఈ విజయాలు.. చైనా విదేశీ వాణిజ్య సంస్థల నాణ్యతలో మెరుగుదలని, ఉత్పత్తుల పోటీతత్వాన్ని, అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా మారే సామర్థ్యాన్ని పూర్తిగా నిరూపిస్తాయని చైనీస్ అకాడ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ రీసెర్చ్ ఫెలో బాయి మింగ్ తెలిపారు.

## బిజినెస్

# అదరగొట్టిన యూనియన్ బ్యాంక్ ఫలితాలు




ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.5,017 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంత క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.4,604 కోట్ల లాభాలతో పోల్చితే 9 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన త్రైమాసికంలో సంస్థ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 1 శాతం పెరిగి రూ.9.328 కోట్లుగా నమోదయ్యింది. 2025 డిసెంబర్ త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 79 బేసిస్ పాయిం ట్లు తగ్గి 3.06 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 31 బేసిస్ పాయింట్లు తగ్గి 0.51 శాతానికి పరిమితమయ్యాయి. బ్యాంక్ మొత్తం వ్యాపారం 5.04 శాతం పెరిగ్గా.. స్థూల అడ్వాన్సుల్లోనూ 7.13 శాతం వృద్ధి చోటు చేసుకుంది. మొత్తం డిపాజిట్లు 3.36 శాతం పెరిగాయి. 2025 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.22,39,740 కోట్లకు చేరింది. ఆ బ్యాంక్ గ్లోబల్ డిపాజిట్లు 3.36 శాతం పెరిగి రూ.12,22,856 కోట్లుగా నమోదయ్యాయి. ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బుధవారం బీఎస్ఇలో యూనియన్ బ్యాంక్ బ్యాంక్ షేర్ ఓ దశలో రూ.180ని తాకింది. తుదకు 7.7 శాతం లాభంతో రూ.178.8 వద్ద ముగిసింది. 2023 మార్చి తర్వాత ఒక్క పూటలో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. గడిచిన ఏడాది కాలంలో యూనియన్ బ్యాంక్ షేర్ 70 శాతం లాభాలను అందించింది.

# ఇన్ఫోసిస్ లాభం రూ.6,654 కోట్లు




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికానికి (అక్టోబరు- డిసెంబరు) ఇన్ఫోసిస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.6,654 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.6,806 కోట్లతో పోలిస్తే 2.2 శాతం తగ్గింది. కొత్త కార్మిక చట్టాలను (లేబర్ కోడ్) అమలు చేసేందుకు ఉద్యోగుల గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం 143 మి. డాలర్ల(దాదాపు రూ.1,289 కోట్లు)ను కేటాయించడం వల్లే లాభం తగ్గిందని కంపెనీ చెబుతోంది. ఈ కోడ్‌ల వల్ల వార్షికంగానూ సుమారు 15 బేసిస్ పాయింట్ల మేర ప్రభావం పడొచ్చని తెలిపింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌లు కూడా వరుసగా రూ.2128 కోట్లు, రూ.718 కోట్ల మేర లేబర్ కోడ్ అమలుకు కేటాయించిన సంగతి విదితమే. ఇన్ఫీ కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.41,764 కోట్ల నుంచి 8.89 శాతం పెరిగి రూ.45,479 కోట్లకు చేరింది. 2025-26 జులై- సెప్టెంబరుతో పోలిస్తే అక్టోబరు- డిసెంబరులో సంస్థ నికర లాభం 9.6 శాతం తగ్గగా.. ఆదాయం 2.2 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి స్థిరకరెన్సీ రూపేణా ఆదాయ వృద్ధి అంచనాను 3- 3.5 శాతానికి పెంచింది. ఇంతకుమునుపు 2-3 శాతం వృద్ధిని అంచనా వేసింది. సక్షా త్రైమాసికంలో మొత్తంగా 4.8 బిలియన్ డాలర్ల విలువైన పెద్ద కాంట్రాక్టులను దక్కించుకుంది. బ్రిటన్‌కు చెందిన నేషనల్ హెల్త్ సర్వీస్ నుంచి అత్యధికంగా 1.6 బిలియన్ డాలర్ల కాంట్రాక్టును కంపెనీ పొందింది. కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్‌కు రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్స్ (ఆర్ఎస్‌యూ) రూపంలో రూ.3 కోట్ల మార్కెట్ విలువ చేసే స్టాక్ ఇన్సెటివ్స్‌ను మంజూరు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అక్టోబరు- డిసెంబరులో రూ.18,000 కోట్ల బైబ్యాక్ పక్రియను పూర్తి చేసింది. కంపెనీ చరిత్రలోనే ఇది అతి పెద్ద బైబ్యాక్.

# వాకీ టాకీ విక్రయాలు.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, షోకు జరిమానా

చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ



ప్రాధికార సంస్థ (అఅఖం) సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, షో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44 లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ-కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0-446.2 ఓఊళి బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ ప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, షో, జియో మార్ట్ తదితర ఈ-కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపింది.

# అశ్లీల డీప్‌ఫేక్‌లకు చెక్.. గ్రోక్ ఏఐపై 'ఎక్స్' కఠిన ఆంక్షలు

రోజుల క్రితం సోషల్ డియా ప్లాట్ ఫామ్ అయిన ఎక్స్‌లో గ్రోక్ ఏఐ సాయంతో అశ్లీల కంటెంట్ ఫీచర్ అందుబాటులో ఉంది. దీంతో ఎక్స్ వేదికగా ప్రముఖుల ఫొటోలను అశ్లీలంగా మార్చి పోస్టులు చేశారు.దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం, ప్రసార మంత్రిత్వ శాఖ తీవ్ర స్థాయిలో స్పందించి ఎక్స్ కు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్', తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ 'గ్రోక్' ద్వారా అసభ్యకరమైన ఏఐ చిత్రాల సృష్టిని అడ్డుకోవడానికి సాంకేతిక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా నిజమైన వ్యక్తులను తక్కువ దుస్తుల్లో చూపేలా రూపొందించే డీప్‌ఫేక్ చిత్రాల వల్ల ఎదురైన తీవ్ర విమర్శల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. అశ్లీల చిత్రాల సృష్టి చట్టవిరుద్ధమైన దేశాల్లో, ప్రాంతాల్లో, వ్యక్తులను బికినీలు, లోదుస్తులతో ఉన్నట్లుగా ఏఐ చిత్రాలను తయారు చేసే సదుపాయాన్ని 'జియోబ్లాక్' చేస్తున్నట్లు ఎక్స్ ప్రకటించింది. ఈ ఆంక్షలు పెయిడ్ సబ్‌స్క్రైబర్లతో సహా వినియోగదారులందరికీ వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. అంతేకాకుండా, గ్రోక్ ద్వారా చిత్రాలను సృష్టించడం, వాటిని ఎడిట్ చేసే సదుపాయాన్ని ఇకపై కేవలం పెయిడ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రమే




పరిమితం చేసింది. ప్లాట్‌ఫామ్ నిబంధనలను ఉల్లంఘించే వారు, చట్టవిరుద్ధమైన పనులకు ఏఐని వాడుకునే వారిని గుర్తించి, బాధ్యులను చేసేందుకు ఈ నిబంధన అదనపు రక్షణ కవచంగా పనిచేస్తుందని ఎక్స్ తన 'సేఫ్టీ' హ్యాండిల్ ద్వారా వెల్లడించింది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇతరుల ప్రైవసీకి భంగం కలిగించే చర్యలపై ఇకపై కఠినంగా వ్యవహరించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

# హైదరాబాద్‌లో రిచెస్ట్ పర్సన్స్ వీళ్ళే!

హైదరాబాద్ భారతదేశంలోనే అత్యంత ధనికులు ఎక్కువగా ఉన్న నగరాల్లో ఒకటిగా నిలుస్తోంది. 2025-2026 సంవత్సరాలకు సంబంధించిన హురున్ ఇండియా రిచ్ లిస్ట్, ఫోర్బ్స్ ఇండియా హైదరాబాద్‌లోని ధనికుల జాబితా విడుదల చేసింది. వీరి అంచనాల ప్రకారం.. డివీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన మురళి దివి కుటుంబం సుమారు రూ.91,100 కోట్ల నెట్ వర్త్‌తో హైదరాబాద్‌లోనే అత్యంత రిచెస్ట్ పర్సన్ గా ఉన్నారు. రెండవ స్థానంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఓఇఎఒ)కు చెందిన పి. పిచ్చి రెడ్డి రూ.42,650 కోట్లు, మూడవస్థానంలో పి.వి. కృష్ణ రెడ్డి రూ.41,810 కోట్లు, నాలుగవ స్థానంలో హెటెరో ల్యాబ్స్‌కు చెందిన బి. పార్థసారధి రెడ్డి రూ.39,030 కోట్లు, ఐదవ స్థానములో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన కే. సతీష్ రెడ్డి కుటుంబం రూ.39,000 కోట్లు, 6వ స్థానంలో రూ.35,000 కోట్లతో



ఔరోబిందో ఫార్మాకు చెందిన పి.వి. రామ్‌ప్రసాద్ రెడ్డి, బయాలజికల్ ఈ సంస్థను నడిపిస్తున్న మహిమ దత్ల ఉన్నారు. 7వ స్థానంలో సోలార్ ఎనర్జీ రంగంలో ప్రీమియర్ ఎనర్జీస్‌కు చెందిన సురేందర్ సలూజా కుటుంబం, 8వ స్థానంలో రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన జూపల్లి రామేశ్వర్ రావు, తరువాతి స్థానాల్లో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సుబ్రమణ్యం రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి నిలిచారు. మొత్తంగా చూస్తే హైదరాబాద్‌లో ధనికులు ఎక్కువగా ఫార్మా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్, సోలార్ ఎనర్జీ రంగాల నుంచి ఎదిగినవారే ఉండటం గమనార్హం. అంతేకాదు తాజా అంచనాల ప్రకారం హైదరాబాద్‌లో రూ.1,000 కోట్లు పైగా ఆస్తులు కలిగిన వారు 100 మందికి పైగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇది దేశంలో ముంబై, ఢిల్లీ తర్వాత మూడో స్థానంలో హైదరాబాద్ నిలవడం విశేషం.

## క్రీడలు

### టాప్ ప్లేస్‌లో విరాట్ కోహ్లీ



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసిసి తాజాగా వన్డే ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత కోహ్లీ ఈ ఘనతను సాధించాడు. విరాట్ చివరిసారిగా జులై 2021లో నం.1 ర్యాంకులో ఉన్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్ తొలి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కారణంగా విరాట్ కోహ్లీ టాప్‌లోకి దూసుకెళ్లాడు. ఆ మ్యాచ్‌లో అతడు 91 బంతుల్లో 93 పరుగులు సాధించాడు. వన్డేల్లో పునరాగమనం తర్వాత విరాట్ నిలకడగా రాణిస్తున్న విషయం తెలిసిందే. గత అయిదు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 50 ప్లస్ స్కోర్లు సాధించాడు. ఓవరాల్‌గా 469 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలున్నాయి. ప్రస్తుతం అతడు 785 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ మొదటి సారిగా అక్టోబర్ 2013లో నం.1 ర్యాంకుకు చేరుకుని, రికార్డ్ స్థాయిలో 825 రోజుల పాటు కొనసాగిన విషయం తెలిసిందే.

# డారిల్ మిచెల్ అజేయ సెంచరీ



భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత్ విధించిన 285 పరుగులు లక్ష్యఛేదనలో డారిల్ మిచెల్ (131 నాటౌట్, 117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతో అజేయంగా నిలవగా, విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈ లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఈ మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 1-1తో సమం చేసింది. భారత గడ్డపై భారత్‌పై వన్డేల్లో ఇంతటి భారీ లక్ష్యాన్ని ఛేధించడం కివీస్‌కు ఇదే మొదటిసారి. లక్ష్య ఛేదనలో కివీస్ ఓపెనర్లు డేవాన్ కాన్వే (16), హెన్రీ నికోల్స్ (10) త్వరగానే నిష్క్రమించినా.. తర్వాత వచ్చిన విల్ యంగ్, డారిల్ మిచెల్ మూడో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జట్టు స్కోరు 208 పరుగుల వద్ద విల్ యంగ్ మూడో వికెట్‌గా పెవిలియన్ చేరుకున్నాడు. తరువాత క్రీజ్‌లోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (32, 25 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కఋష్ణ, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. రెండో వన్డేలో విజయంతో సిరీస్‌ను కివీస్ సమం చేయడంతో చివరిది, మూడో వన్డే కీలకంగా మారింది. ఈ సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇండోర్‌లో జరగనుంది. బుధవారం మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. ఒక దశలో కష్టాల్లోఉన్న భారత్‌ను కెఎల్ రాహుల్ (112; 92 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో ఆదుకున్నాడు. దీనికి ముందు ఓపెనర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56; 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా రెండో అర్ధ శతకం చేశాడు. బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టులో ఓపెనర్లు రోహిత్, గిల్ తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. రోహిత్(24 పరుగులు)ను తొలివికెట్‌గా క్రిస్టియన్ క్లార్క్ వెనక్కి పంపాడు. ఒక దశలో 99/1తో పటిష్ఠ స్థితిలో భారత్ నిలిచింది. అయితే ఈ దశలో గిల్, శ్రేయస్ అయ్యర్ (8), విరాట్ కోహ్లీ (23) వరసగా పెవిలియన్ చేరడంతో 118/4తో కష్టాల్లో పడింది. 18-27 ఓవర్ల మధ్య భారత బ్యాటర్లు ఒక్క బౌండరీ కూడా కొట్టలేదు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా (27 పరుగుల)తో కలిసిరాహుల్ భారత్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 88 బంతుల్లో 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. అయితే ఐదో వికెట్‌గా జడేజా మైకేల్ బ్రాస్‌వెల్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన నితీశ్‌కుమార్‌రెడ్డితో జతకట్టిన.. రాహుల్ 52 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. నితీశ్ (20 పరుగులు) ఫాక్స్ ఔట్ చేయగా.. కాసేపటికే హర్షిత్ రాణా (2)ను జేడెన్ లెనాక్స్ పెవిలియన్‌కు పంపాడు. అప్పటికి 87 పరుగులతో ఉన్న రాహుల్ జేసన్ వేసిన 49 ఓవర్‌లో ఫోర్, సిక్స్ కొట్టి శతకం (87 బంతుల్లో) అందుకున్నాడు.

# టీ20 సిరీస్‌కు టీమిండియా స్టార్ ప్లేయర్ దూరం




టీమిండియాకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. గాయంతో ఇప్పటికే న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమైన భారత స్టార్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్.. రానున్న టీ20 సిరీస్ నుంచి కూడా తప్పుకున్నారు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో టీమిండియా ఐదు టీ 20 ల సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. కాగా ఫిబ్రవరి 7 న ప్రారంభం కానున్న టీ0 ప్రపంచ కప్ ముంగిట ఈ వార్త ఆందోళన కలిగించేదే ! వడోదర వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేస్తున్నప్పుడు సుందర్ పక్కటెముకల కండరాలకు గాయం అయిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచులో కేవలం 5 ఓవర్లు మాత్రమే వేసిన వాషీ.. తీవ్రమైన నొప్పితో మైదానాన్ని వీడాడు. బ్యాటింగ్‌కి కూడా వస్తాడా ? లేడా ? అన్న సందేహాల నడుమ జట్టు గెలుపు కోసం క్రీజులోకి వచ్చాడు. నొప్పితో విలవిల్లాడుతూనే పరుగులు చేశాడు. వికెట్ల మధ్య పరిగెత్తడానికి కూడా చాలా ఇబ్బంది పడ్డాడు. అయితే తాజాగా వచ్చిన స్కానింగ్ రిపోర్ట్‌ల ప్రకారం గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో రానున్న టీ20 సిరీస్‌కు దూరమవ్వాల్సి వచ్చిందని బీసీసీఐ పేర్కొంది. టీమిండియాను ఆటగాళ్ల గాయాలు వేధిస్తున్నాయి. కీలక ఆటగాళ్లు గాయాల పాలవుతుండటంతో ఆందోళన కలిగిస్తోంది. రానున్న టీ 20 ప్రపంచ కప్ 2026 కోసం టీమిండియా సిద్ధమవుతున్న వేళ.. సుందర్ దూరమవ్వడం జట్టు కూర్పుపై ప్రభావం పడనుంది. ఇప్పటికే స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రాక్టీస్ చేస్తూ గాయపడి.. వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. యువ బ్యాటర్ తిలక్ వర్మకు సర్జరీ అవ్వడంతో.. అతడూ ఆడటం కష్టమే. ఇలా ఒక్కొక్కరుగా స్టార్ ప్లేయర్లు గాయాల పాలవుతుండటంతో.. బలమైన న్యూజిలాండ్ జట్టును టీమిండియా ఎలా ఎదుర్కోనుందనే దానిపై చర్చ మొదలైంది.

# బ్యాటర్లు తడబడినా.. యూఎస్‌పై యువ భారత్ ఘన విజయం

అండర్ 19 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో యువ భారత్ అదరగొట్టింది. యూఎస్ఏతో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అభిజ్ఞాన్ కుందు టాప్ స్కోరర్. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 107 పరుగులకు ఆలౌంది. ఆ తర్వాత భారత్ లక్ష్యఛేదనకు దిగగా.. వరుణుడు ఆటంకం కలిగించాడు. దీంతో డీఎల్ఎస్ ప్రకారం మ్యాచ్‌ను 37 ఓవర్లకు




కుదించి 96 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. టీమ్ఇండియా ఆ లక్ష్యాన్ని 17.2 ఓవర్లలోనే ఛేదించింది. భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (2), వేదాంత్ (2), విహాన్ (18), ఆయుష్ మాత్రే (19) నిరాశపరిచారు. కనిష్క పరుగులు చేశారు. యూఎస్ బౌలర్లలో రిత్విక్ 2 వికెట్లు తీయగా.. రిషభ్, ఉత్కర్ష్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు టాస్ గెలిచిన టీమ్ఇండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు నిప్పులు చెరగడంతో యూఎస్ఏ 35.2 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. అందర్ గిల్ (1), సాహిల్ గార్గ్ (16), అర్జున్ మహేశ్ (16), ఉత్కర్ష్ శ్రీవాస్తవ (0), అమోఘ్ ఆరేపల్లి (3), అద్నిత్ జాంబ్ (18), అదిత్ కప్పా (5), శబరీష్ ప్రసాద్ (7), రిషబ్ షింపి (0) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. యూఎస్ఏ బ్యాటర్లలో నితీశ్ సుధాని(36) టాప్ స్కోరర్. అతడే చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. భారత బౌలర్లలో హేనిల్ పటేల్ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. ఇక దీపేశ్ దేవేంద్రన్, ఆర్ఎస్ అంబ్రిష్, ఖిలాన్ పటేల్, వైభవ్ సూర్యవంశీ తలో వికెట్ తీసుకున్నారు.

# మ్యాచ్‌లు బహిష్కరిస్తామన్న ప్లేయర్లు..

కీలక అధికారిని తొలగించిన బీసీబీ బంగ్లాదేశ్ క్రికెట్‌లో నెలకొన్న సంక్షోభం కాస్త సద్దుమణిగినట్లు కనిపిస్తోంది. బీసీబీ డైరెక్టర్, ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్ నజ్ముల్ ఇస్లాం బుధవారం ఆటగాళ్లపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. అతడు రాజీనామా చేయకపోతే గురువారం నుంచి బంగ్లాదేశ్ ప్రిమియర్ లీగ్(ఃఖఒ)తోపాటు అంతర్జాతీయ మ్యాచ్‌లను కూడా బహిష్కరిస్తామని బంగ్లాదేశ్ క్రికెటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ క్రమంలో నజ్ముల్ ఇస్లాంకు బీసీబీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయినా, ప్లేయర్లు వెనక్కి తగ్గలేదు. గురువారం బీపీఎల్‌లో రెండు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. మొదటి మ్యాచ్‌లో చటోగ్రామ్ రాయల్స్, నోఖాలి ఎక్స్‌ప్రెస్ తలపడాల్సి ఉండగా.. టాస్ సమయానికి ఇరుజట్లు వేదిక వద్దకు రాలేదు. వివాదం మరింత ముదురుతోందని గ్రహించిన బీసీబీ.. బోర్డు ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్ పదవి నుంచి నజ్ముల్‌ను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు, సమయం మించి పోవడంతో గురువారం జరగాల్సిన




రెండు మ్యాచ్‌లను వాయిదా చేశారు. '2026 టీ20 ప్రపంచ కప్‌లో ఆడకపోతే బోర్డుకు ఎలాంటి నష్టం ఉండదు. క్రికెటర్లకు మాత్రమే నష్టం జరుగుతుంది. వారు ఈ అవకాశాన్ని కోల్పోతే ఎలాంటి పరిహారం ఉండదు. కోట్లకు కోట్లు వెచ్చిస్తున్నా బంగ్లా క్రికెటర్లు అంతర్జాతీయ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేయడం లేదు. వాళ్లు ఆడలేకపోయిన ప్రతిసారీ డబ్బులు తిరిగి అడుగుదాం' అంటూ వ్యాఖ్యానించారు.

# న్యూజిలాండ్ అంత తేలిగ్గా గెలవడం ఆశ్చర్యానికి గురి చేసింది

రాజ్‌కోట్ వేదికగా టీమ్ఇండియా, న్యూజిలాండ్ మధ్య రెండో వన్డే జరిగిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడిన టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. నిర్ణీత 50 ఓవర్లలో భారతజట్టు 7 వికెట్లు నష్టపోయి 284 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (112) టాప్ స్కోరర్ గా నిలిచాడు. శుభ్‌మన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌లో హాఫ్‌సెంచరీ (56) సాధించాడు. కానీ.. రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), శ్రేయస్ అయ్యర్ (8), రవీంద్ర జడేజా (27), నితీశ్ కుమార్ రెడ్డి (20), హర్షిత్ రాణా (2) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. కేఎల్ రాహుల్ ఓపికగా చేసిన ఒంటరి పోరాటం వల్ల టీమ్ఇండియా ఆ మాత్రం ఫైటింగ్ టోటల్‌నైనా ప్రత్యర్థి జట్టు ముందు ఉంచగలిగింది. అయితే ఛేదనకు దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు అలవోకగా పరుగులు రాబట్టారు. ఓపెనర్లు డెవన్ కాన్వే (16), హెన్రీ నికోలస్ (10) విఫలమైనప్పటికీ డారిల్ మిచెల్ (131×), విల్ యంగ్ (87)



అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా మిచెల్ అజేయ సెంచరీతో అలరించాడు. టీమ్ఇండియా అతికష్టంద చేసిన పరుగులను కివీస్ ఆటగాళ్లు మాత్రం ఆడుతూ పాడుతూ ఛేదించారు.

# వుదయం సినిమా

# సినీ తారల అసలు పేర్లు

## హెలెన్



ప్రముఖ బాలీవుడ్ నాట్య తార హెలెన్ అసలు పేరు అన్ రిచర్డ్ సన్. మయన్మార్ లోని యాంగన్ లో 2111 1938న జన్మించింది. యుద్ధ సమయంలో అక్కడ నుంచి అనేక మందితో తిండికి కూడా ఇబ్బందులు పడుతూ మెల్లిగా బెంగాల్ చేరింది. తరువాత బొంబాయి చేరి కుకు అనే తార ద్వారా రాజ్ కపూర్ ' ఆవారా ' సినిమాలో 1951లో గ్రూప్ డాన్సర్ గా ప్రవేశించింది. ' అలిఫ్ లైలా' లో 1953లో నాట్య తార అయి క్రమంగా 1958లో 'హౌరా బ్రిడ్జ్ 'సినిమాతో ప్రేక్షకుల దృష్టిలో హౌరా బ్రిడ్జి అంతటి స్థానం ఆక్రమిం చుకుంది. మేరా నామ్ చిన్ చిన్ చు... గీతానికి చేసిన నాట్యంతో క్లాసిక్ నృత్య తార అయింది. 1955లో 'సంతోషం ' తెలుగు సినిమాలో మొదటి సారి నాట్యం చేసింది. తెలుగులో నాలుగు సినిమాల్లో, తమిళ మలయాళ కన్నడ పంజాబీ భోజ్ పురి మరాఠి ఇండోనేశియా ఇలా 750 చిత్రాల్లో తన నాట్యంతో అలరించింది. 2009లో పద్మశ్రీ అవార్డు లభించింది. ఇప్పటికీ తన శరీరాన్ని ఫిట్ గా ఉంచు కోడానికి ఎక్సర్ సైజులు చేస్తున్నానంటుంది.

## సునీల్ దత్



సునీల్ దత్ అసలు పేరు బలరాజ్ రఘు నాథ్ దత్ . 661930న పాకిస్థానీ పంజాబ్ లోని ఝేలం ఖుర్ద్ గ్రామంలో పుట్టారు. తండ్రి పోయాక హర్యానా నుంచి, బొంబాయి వచ్చి జై హింద్ కళాశాలలో చదువుకుని,ఒక ట్రాన్స్ పోర్ట్ కంపెనీలో ఉద్యోగం చేశారు. రేడియో కార్యక్రమాలతో కెరీర్ ప్రారంభించి సిలోన్ రేడియో హిందీ ప్రసారాల్లో గుర్తింపు వచ్చింది . 1955లో విడుదలైన రమేష్ సైగల్ దర్శకత్వం వహించిన రైల్వే ప్లాట్ ఫాం సినిమాతో నటునిగా పరిచయం అయ్యారు. రమేష్ సైగల్ సూచన తోనే సునీల్ దత్ గా పేరు పెట్టుకున్నారు. 1957లో మదర్ ఇండియా సినిమాతో స్టార్ గా ఎదిగారు. ఈ సినిమాలో తన తల్లిగా నటించిన నర్గీస్ దత్ ని 1131958న వివాహం చేసుకున్నారు.వీరు ఒక నాటక సంస్థ నెలకొల్పి నటీనటులను గాయకులను తయారుచేసి సరిహద్దులలోని మిలిటరీ వారిని అలరించే వారు.కేన్సర్ తో మరణించిన భార్య నర్గీస్ కోసం నర్గీస్ దత్ మెమోరియల్ కేన్సర్ ఫౌండేషన్ నెలకొల్పారు.50 ఏళ్ల తన సినీ జీవితంలో 80 చిత్రాల్లోనే నటించారు. ఏక్ హీ రస్తా, సుజాత, సాధన, వక్త్, హమ్ రాజ్, మిలన్, ఛాయ, నర్తకి వగైరా హీరోగా పేరు తెచ్చాయి. మున్నా భాయ్ ఎమ్ బి బి ఎస్ ఆయన సహాయ పాత్రలో నటించిన చివరి సినిమా. 1968లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.పార్లమెంట్ సభ్యుడుగా మంత్రిగా చేసారు.25-5-2005న గుండె పోటు తో ముంబైలో మృతి చెందారు.

## మోహన్ లాల్



అయిదు భాషల్లో 360 సినిమాల్లో నటించి నటిస్తూనే నిర్మాతగా దర్శకుడుగా, పంపిణీ దారుడుగా గాయకుడుగా కొనసాగే మోహన్ లాల్ అసలు పేరు మోహన్ లాల్ విశ్వనాథన్ నాయర్. 2151960న కొల్లాం దగ్గర ఎలందూర్ లో పుట్టారు. తన 18 వ ఏట 1978లో నటించిన తొలి మలయాళ చిత్రం థిరనోట్టం 27 ఏళ్ల తరువాత 2005లో విడుదల కావడం ఒక విశేషం. మంజిల్ విరంజ పూక్కాల్ 1980లో విడుదలై ప్రతి నాయకునిగా పేరు తెచ్చింది. 1982 వరకు విలన్ గా చేస్తూ తొలిసారి మలయాళంలో తీసిన 70 ఎమ్ ఎమ్ సినిమా 'పాద యాట్టమ్ ' తో హీరో అయ్యారు. 2001లో పద్మశ్రీ, 2009లో పద్మభూషణ్, 2025లో దాదా సాహెబ్ ఫాల్కె అవార్డులు లభించాయి. గాండీవం తొలి తెలుగు సినిమా. జనతా గ్యారేజ్, మనమంతా, వృషభ, కన్నప్ప సినిమాల్లో నటించారు.

**ఇంకా వున్నారు !**







ఎ.ఎస్.ఆర్.కేశవరావు
సెల్: 9989235320

## లక్ష్మి



నటి లక్ష్మి అసలు పేరు యరగుడిపాటి వెంకట మహాలక్ష్మి 1312 1947న మద్రాసులో పుట్టింది.ఈమె తండ్రి నెల్లూరులో పుట్టి డాక్టర్ కోర్సు చేసి మూకీ చిత్రాల నుంచి 5 భాషల్లో హీరో దర్శక నిర్మాతగా పేరున్న వై. వి. రావు, తల్లి నటి రుక్మిణి. 1968లో ఎస్ వి రంగారావు నిర్మించి దర్శకత్వం వహించిన 'బాంధవ్యాలు' సినిమాతో తెలుగులో పరిచయమయింది. 1968లోనే తమిళ చిత్రం ' జీవనాంశం 'తోనూ కన్నడ సినిమా 'గోవా దాల్లి సి ఐ డి 999' తోనూ పరిచయమయింది. లక్ష్మి మొదటి మలయాళ చిత్రం చట్టకారి (1974) తో ఉత్తమ నటిగా కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డు వచ్చింది. 1975 లో 'జూలీ' సినిమాతో హిందీ చిత్ర రంగంతో బాటు యావత్ భారతాన్ని అకట్టుకుంది జీవన తరంగాలు, పుట్టినిల్లు మెట్టినిల్లు, అందరూ దొంగలే, బంగారు కలలు, పంతు లమ్మ, చట్టానికి కళ్ళు లేవు, మల్లెపూవు ఇలా చాల సినిమాల్లో నాయికగా చక్కని నటనతో ఆకట్టుకుంది.మురారీ, నిన్నే పెళ్ళాడుతా,ఓ బేబీ, మిధునం సినిమాల్లో కేరక్టర్ ఆర్టిస్టుగా అద్భుత నటనలో అలరించింది. తను సహ నిర్మాతగా నిర్మించే సినిమా 'బంధాలు అనుబంధాలు ' గా 1982లో విడుదల చేసారు. తమిళంలో 128 , తెలుగులో 76 , మలయాళంలో 65 , కన్నడలో 58 చేసి ఇంకా చేస్తూంది. హిందీలో 7 సినిమాలే చేసి దక్షిణాది చిత్రాలపైనే దృష్టి పెట్టింది. అనేక అవార్డులు లభించాయి. ఇప్పటి వరకు సుమారు 650 సినిమాల్లో తను నటించినట్టు ఒక కన్నడ టి వి షోలో తెలిపింది.

## శోభన్ బాబు జయంతిని పురస్కరించుకుని అవార్డు





అవార్డ్ గ్రహిత సిద్దు జొన్నలగడ్డ

భౌతికంగా లేకపోయినా తాను నటించిన సినిమాల ద్వారా ఆయన ప్రేక్షకాభిమానులలో చెరగని ముద్రను వేసుకున్నారు. అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి పేరిట ఆయన అభిమానులు రెగ్యులర్ గా వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతూ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ సంస్థతో కలసి 'సోగ్గాడు' సినిమా స్వర్ణోత్సవాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా బుధవారం శోభన్ బాబు జయంతిని పురస్కరించుకుని, ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన యూత్ హీరో ఒకరికి ఈ ఏడాది నుంచి సోగ్గాడు శోభన్ బాబు పేరిట అవార్డ్ ను ప్రదానం చేయనున్నట్లు అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి గౌరవ చైర్మన్ రాశీ మూవీస్ నరసింహారావు, అడ్వైజర్ జేష్ఠ రమేష్ బాబు, నిర్మాత జె.రామాంజనేయులు, ప్రెసిడెంట్ సుధాకర్ బాబు, కన్వీనర్స్ సాయి కామరాజ్, పూడి శ్రీనివాసరావు, వీరప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాసరావు, యు.విజయ్, కుర్రా రాంబాబు, ధార సత్యం ప్రకటించారు. ఈ ఏడాది ఈ అవార్డ్ కు యువ హీరో సిద్దు జొన్నలగడ్డను ఎంపిక చేసినట్లు, త్వరలో శ్రేయాస్ మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే వేడుకలో ఈ అవార్డ్ ను ప్రదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు

## ఎల్లమ్మ తో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా అరంగేట్రం



అద్భుతమైన కథలని ఎన్నుకునే విజనరీ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, బలగం ఫేమ్ డైరెక్టర్ వేణు యెల్దండి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం' ఎల్లమ్మ'ను రూపొందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న తొలి చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన వేణు పవర్ ఫుల్, ఆధ్యాత్మికతతో నిండిన కథని సిద్ధం చేశారు. ప్రతిష్ఠాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లతో దశాబ్దాలుగా సంగీత ప్రపంచాన్ని ఏలిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ కెమెరా ముందు అడుగుపెడుతున్నాడు. ఈ చిత్రంతో హీరోగా అరంగేట్రం చేయడం ఎక్సయిట్మెంట్ ని మరోస్థాయికి తీసుకెళ్ళింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ అరంగేట్రానికి ఆయన ఎంచుకున్న సబ్జెక్ట్ ఆయన ఎనర్జీ, క్రియేటివ్ పర్సనాలిటీకి పర్ఫెక్ట్ యాప్ట్. ఇందులో హీరోగా నటించడమే కాకుండా చిత్రానికి సంగీతాన్ని కూడా డీఎస్ పీ నే అందిస్తున్నారు.

ఎల్లమ్మ సినిమా దైవిక శక్తి నేపథ్యంగా, స్థానిక సంప్రదాయాలు, జానపద విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాన్ని బలంగా ప్రతిబింబించేలా రూపొందుతోంది. మకర సంక్రాంతి శుభ సందర్భంగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా మిస్టికల్ వరల్డ్‌కు అద్భుతంగా పరిచయం చేసింది.

గ్లింప్స్ ఒక స్టన్నింగ్ విజువల్ తో మొదలవుతుంది. సుడిగుండలా తిరుగుతున్న గాలిలో ఓ ఒంటరి వేపాకు పైకి దూసుకెళ్తుంది. దాన్ని గమనిస్తూ ఓ మేక నిలుస్తుంది. క్షణాల్లో వాతావరణం ఉత్కంఠభరితంగా మారుతుంది. కాళ్లకు గజ్జెలు మోగుతూ ఓ వ్యక్తి ఒక వైపు నుంచి పరుగెత్తగా, మరోవైపు నుంచి షూస్ పరిగుపెడుతూ ఇంకొకరు దూసుకొస్తారు. ఆ వేపాకు మేఘాలను దాటి పైకి ఎగసి, క్షణాల్లో అమ్మవారి దివ్య రూపంగా మారుతుంది. ఆకాశం నుంచి వర్షం కురుస్తుంది. తడిచిన రెక్కలను విదిలిస్తూ మేక ఒక్కసారిగా కదలడం గ్లింప్స్‌కు మరింత ఎనర్జీ ఇస్తుంది. తుఫాను నడుమ, చెట్టుకు ఆనించి ఉన్న కొడవలి పక్కన, ఒంటి మీద చొక్కా లేకుండా ఒక వ్యక్తి నడుముకు డోలు కట్టుకొని రాయిపై కూర్చుంటాడు. వెనుక నుంచి తేలుతూ వచ్చిన వేపాకు అతని వెనుక నెమ్మదిగా వాలుతుంది. అతను తిరిగే క్షణంలో--- పర్ఫిగా దేవి శ్రీ ప్రసాద్ కనిపించడం అదిరిపోయింది.

పొడవాటి జుట్టు, రగ్గడ్ లుక్, ఇంటెన్స్ కళ్లతో DSP పాత్రలో పూర్తిగా లీనమై కనిపించారు. వేప, పసుపు, కుంకుమ విజువల్స్ డివైన్ ఆరాను జోడిస్తే, DSP ఇచ్చిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది.

## 'మన శంకర వర ప్రసాద్ గారు' గ్రాండ్ సక్సెస్ పార్టీ









మెగాస్టార్ చిరంజీవి మెగా ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం కేవలం రెండు రోజుల్లోనే రికార్డులను బద్దలు కొట్టి, సంచలనాత్మకంగా 100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 120 కోట్లు వసూలు చేసింది. ఇండియాలో ద్భుతమైన జోరును కొనసాగిస్తూ, ఉత్తర అమెరికాలో 2 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువవుతున్న తరుణంలో మెగాస్టార్ ఇంట్లో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని, చిరంజీవి తన హైదరాబాద్ నివాసంలో ఒక గ్రాండ్ పార్టీని ఇచ్చి, ఆ సాయంత్రాన్ని సంక్రాంతి వేడుకల కొనసాగింపుగా మార్చారు. తారల సందడితో కూడిన వేడుకకు రామ్ చరణ్, వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెలతో పాటు పలువురు హాజరయ్యారు. ఈ వేడుకలు ఉత్సాహభరితమైన కేక్ కటింగ్ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి, అనంతరం చిత్ర బృందం అద్భుతమైన విందులో పాల్గొంది. నవ్వులు, కృతజ్ఞతలు, ఆత్మీయ సంభాషణలతో వేడుక కన్నుల పండగలా సాగింది. సినిమా ఘన విజయానికి కారణమైన ప్రతి సభ్యుడికి చిరంజీవి స్వయంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకను విజయోత్సవంగా మాత్రమే కాకుండా ముందస్తు భోగి, సంక్రాంతి సంబరాలుగా ఆనందంగా జరుపుకున్నారు. టీంలో కనిపించిన ఐక్యత, సినిమాకు లభిస్తున్న డ్రీమ్ రన్ కలిసి ఈ వేడుక మెగా మెమరబుల్ మూమెంట్ గా నిలిచింది.

## ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు



మాస్ మహారాజా రవితేజ సంక్రాంతి బ్లాక్ బస్టర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ లో డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించారు. జనవరి 13న గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా సంక్రాంతి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి బ్లాక్ బస్టర్ మీట్ నిర్వహించారు.

నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ..మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ థాంక్స్. మా హీరో రవితేజ గారికి, హీరోయిన్స్ కి, మా సినిమాలో నటించిన అందరికీ ధన్యవాదాలు. అలాగే మా టెక్నీషియన్స్ ప్రకాష్ గారు ప్రసాద్ గారు బీమ్స్ గారు కొరియోగ్రాఫర్స్ రైటర్స్ అందరికీ చాలా థాంక్స్. నేను రెండుసార్లు భ్రమరాంభ థియేటర్ కి వెళ్ళాను. ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు చాలా ఎంజాయ్ చేస్తున్నారు.

డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ.. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. బిగినింగ్ నుంచి చివరి వరకు ప్రేక్షకులని నవ్వించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా మొదలు పెట్టడం జరిగింది. మేము అనుకున్న టార్గెట్ ని 100% రీచ్ అయ్యాం. నా సినిమాలు ఫ్యామిలీ ఆడియన్స్ హ్యాపీగా చూడొచ్చు అని అంటారు. ఈ సినిమాతో ఆ ఆడియన్స్ డబుల్ అయ్యారు. ఈ సినిమా అందరికీ ఇంత బాగా నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆడియో బ్లాక్ బస్టర్ అయిందంటే ఆ క్రెడిట్ అంతా బీమ్స్ కి వెళుతుంది. కార్తీకదీపం, పిన్ని డీజే మిక్స్ సాంగ్స్ కి అందరూ మురిసిపోతున్నారు. ఆషిక ఇమేజ్ ని బ్రేక్ చేసిన క్యారెక్టర్ చేశారు. తను క్యారెక్టర్ లో బెస్ట్ ఇచ్చింది. అలాగే డింపుల్ ఇమేజ్ ని కూడా బ్రేక్ చేసిన క్యారెక్టర్ చేసింది. ఇద్దరు కూడా అద్భుతంగా పెర్ఫాం చేశారు. ఈ స్క్రిప్ట్ లో పవన్ నాకు హెల్ప్ చేశాడు.

## 'కట్టాలన్' సెకండ్ పోస్టర్ విడుదల



క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ 'కట్టాలన్' సెకండ్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఫస్ట్ లుక్ తర్వాత, రెండవ లుక్ మరింతగా ఆశ్చర్యపరిచేలా రూపొందించారు. ఏనుగుల వేట నుండి ప్రేరణ పొందిన ఉత్కంఠభరితమైన మాస్ యాక్షన్‌ను సూచిస్తూ, ఈ పోస్టర్ మలయాళ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో ఆంటోనీ వర్గీస్‌ను పరిచయం చేస్తుంది. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే, ఆంటోనీ వర్గీస్‌ను ఫస్ట్ లుక్‌లోనూ, తాజాగా విడుదలైన సెకండ్ లుక్‌లోనూ పవర్ ఫుల్ లుక్‌లో చూపించారు.

మలయాళ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ రిలీజ్ గా నిలవనున్న 'కటాలన్', మే 14, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. షరీఫ్ మహమ్మద్ నిర్మించిన పాన్‌ఇండియన్ బ్లాక్‌బస్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' తర్వాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుండి వస్తున్న మూవీ.మాస్ అప్పీల్ , యాక్షన్ పరంగా ఈ సినిమా 'మార్కో'ను అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుందని పోస్టర్లు సూచిస్తున్నాయి.

## ప్రేక్షకుల ఆదరణే దక్కించుకున్న..



టాలీవుడ్ సంక్రాంతి పండుగ సీజన్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా ప్రేక్షకుల ఆదరణ దక్కించుకుంటోంది రెబల్ స్టార్ ప్రభాస్ "రాజా సాబ్" మూవీ. ఈ సినిమాను ఫ్యామిలీ ఆడియెన్స్, పిల్లలు మూవీని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వర్సటైల్ పర్ ఫార్మెన్స్ తో ప్రభాస్ చేసిన వన్ మ్యాన్ షో, హారర్ ఫాంటసీ జానర్ లో ఒక కొత్త వరల్డ్ క్రియేట్ చేసిన డైరెక్టర్ మారుతి టేకింగ్. అన్ కాంప్రమైజ్డ్ గా గ్లోబల్ సినిమా స్థాయిలో ప్రొడ్యూస్ చేసిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మేకింగ్ ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో "రాజా సాబ్" సక్సెస్ హ్యాపీనెస్ ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు హీరోయిన్ నిధి అగర్వాల్.

"రాజా సాబ్" సినిమాకు వస్తున్న రెస్పాన్స్ తో హ్యాపీగా ఉన్నాను. ఈ సినిమా కోసం మేమంతా 3 ఏళ్లు కష్టపడ్డాం. ఆ కష్టానికి ప్రేక్షకులు మంచి రిజల్ట్ ఇచ్చారని భావిస్తున్నాం. సినిమాకు మొదట్లో కొద్దిగా మిక్స్డ్ టాక్ వచ్చినా ఇప్పుడు ప్రతి ప్రేక్షకుడు మూవీని ఎంజాయ్ చేస్తున్నారు. "రాజా సాబ్" ముందు సినిమా హరి హర వీరమల్లులో నేను రాకుమారి పాత్రలో నటించాను. ఈ సినిమాలో ఏంజెల్ గా కనిపించాను. ఈ రోల్ లో నటించడాన్ని ఎంజాయ్ చేశాను.

సప్తగిరి, ప్రభాస్ శ్రీను, వీటీవీ గణేష్.. ఇలా చాలామంది కమెడియన్స్ తో కలిసి సీన్స్ చేశాం. సెట్స్ లో చాలా ఫన్ గా ఉండేది. నేను హరి హర వీరమల్లుతో పాటు ఈ సినిమా షూటింగ్ కూడా చేశా. రెండు సినిమాల షూటింగ్స్ కోసం ట్రావెల్, నిద్ర కూడా ఉండకపోయేది. ఆ టైమ్ లో రాజా సాబ్ మేకర్స్ బాగా సపోర్ట్ చేశారు. నన్ను సెట్ లో బాగా చూసుకునేవారు. ఈ మూవీలోని విజువల్ ఎఫెక్ట్స్, భారీ సెట్స్, ప్రొడక్షన్ క్వాలిటీ విషయంలో ఎక్కడా విశ్వప్రసాద్ గారు రాజీ పడలేదు. అందుకే ఇంత హై క్వాలిటీతో సినిమా మన ముందుకు వచ్చింది. ఈ మూవీలో ముగ్గురు హీరోయిన్స్ అనే విషయం ముందే తెలుసు. ప్రభాస్ గారితో నటించడం, ఇంత భారీ చిత్రంలో నేనూ ఒక భాగం కావడం హ్యాపీగా ఉంది. విజువల్ ఎఫెక్టులు ఉన్న సీన్ లో యాక్టింగ్ కరెక్ట్ గా చేసేందుకు కొంత టైమ్ పట్టేది. లుక్ ఎక్కడ ఇవ్వాలి, లేనివి ఉన్నట్లు ఊహించుకుని రియాక్ట్ కావాలి..ఇలాంటివి కొన్ని సీన్స్ చేశాక ఈజీ అయ్యాయి.

హారర్ మూవీస్ చేస్తున్నప్పుడు ఆ మూవీలోని యాక్టర్స్ తమకు కొన్ని అనూహ్యమైన ఘటనలు జరగడం చూశామని చెబుతుంటారు. కానీ మాకు అలాంటివేం ఎదురుకాలేదు. నిజానికి నాకు దెయ్యాలు, ఇలాంటి హారర్ కంటెంట్ అంటే భయం. రాత్రి నిద్రపోయేప్పుడు లైట్స్ వేసుకుని హనుమాన్ చాలీసా లూప్ లో వింటూ నిద్రపోతా.

టాలీవుడ్ లో నేను భాగం. నాది తెలుగు సినిమా అని చెప్పుకుంటాను. ఇటీవల ముంబై వెళ్లినప్పుడు అక్కడ తెలుగు సినిమాలు ఎంత క్వాలిటీగా ఎంత పెద్ద స్కేల్ లో జరుగుతున్నాయో నార్త్ వాళ్లు చెబుతుంటే విన్నాను. మా మూవీనే పవన్ కల్యాణ్ గారితో హరి హర వీరమల్లులో నటించినప్పుడు ఆయనను పవర్ స్టార్ అని ఎందుకు అంటారో అర్థమైంది. ఈ జర్నీలో ఎంతో నేర్చుకున్నా.

ప్రస్తుతం తెలుగులో మూడు చిత్రాల్లో నటిస్తున్నా. హిందీలో రెండు మూవీస్ చేస్తున్నా. తెలుగులో బిజీగా ఉండటం వల్ల హైదరాబాద్ లో ఇల్లు తీసుకున్నా. ఇక్కడికి షిఫ్ట్ అవుతున్నా. నా బాల్యం నుంచే హీరోయిన్ కావాలని కలగన్నా. నేను కలగన్న కెరీర్ నే కొనసాగిస్తున్నా కాబట్టి కొత్తగా నేను కోరేది ఏమీ లేదు. హీరోయిన్ గా మంచి పర్ఫస్ ఫుల్ ప్రాజెక్ట్స్ చేయాలని ఆశిస్తున్నా.

## 22 నుంచి ఆహా ఓటీటీలోకి 'శంబాల'





ఆది సాయికుమార్ నటించిన రీసెంట్ సూపర్ హిట్ మూవీ 'శంబాల' ఆహా ఓటీటీలో ప్రీమియర్ కు రెడీ అవుతోంది. ఈ నెల 22నుంచి ఈ సినిమా ఆహాలో స్ట్రీమింగ్ కు వస్తోంది. ఆహా గోల్డ్ సబ్ స్క్రైబర్స్ కు ఒక రోజు ముందుగానే ఎర్లీ యాక్సెస్ తో ఈ సినిమాను చూడొచ్చు. ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్ అందిస్తున్న ఆహా ఓటీటీ..'శంబాల'తో మరోసారి కొత్త సబ్ స్క్రైబర్స్ ను ఆకర్షిస్తోంది.

గతేడాది డిసెంబర్ 25న 'శంబాల' సినిమా మిస్టికల్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకులు ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని దర్శకుడు యుగంధర్ ముని రూపొందించారు. అర్చన ఐయ్యర్ హీరోయిన్ గా నటించింది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ఈ మూవీని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీకి ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల ఆర్ఆర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. థియేటర్స్ లో మంచి వసూళ్లు సాధించిన శంబాల సినిమాను ఆహా ఓటీటీలో ప్రీమియర్ చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఉన్నారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.